UNIVERSAL LIBRARY
OU_204727
UNIVERSAL LIBRARY

Saraswati Series No. 31

SREE

# MALLIKAMARUTAPRAKARANAM

TRANSLATED INTO TELUGU

*From the Original Sanscrit Drama*

OF

UDDANDAKAVI

PART I.

*(THE FIRST SIX ACTS)*

BY

## VADDADY SUBBARAYUDU

*Senior Pundit, Government First Grade Training College, Rajahmundry.*

FIRST EDITION.

COCANADA:

D BY S. RAYULU, AT THE BALASARASWATI PRESS,
BLISHED BY THE EDITOR "THE SARASWATI."

1903

*Copy-right.*]

[Price. Rs. 0-14-0.



వడ్డాది సుబ్బారాయడు.

*Ananda Press, Madras.*

సరస్వత్యనుబంధము. ౩౧.

శ్రీ

# మల్లికామారుతము.

పూర్వభాగము ౬ అంకములు.

ఇది

సంస్కృతమున భవభూతివిరచిత మాలతీమాధవచ్ఛాయను
నుద్దండకవి రచియించిన ప్రకరణమునుండి

రాజమహేంద్రవరమునందలి దొరతనమువారి
మొదటితరగతిబోధనాభ్యసనకళాశాలయందు
నాంధ్రోపాధ్యాయుఁడగు

వడ్డాది సుబ్బారాయనిచేతఁ
దెలిఁగింపఁబడినది.

(సరస్వతినుండి పునర్ముద్రితము.)

మొదటికూర్పు.

కాకినాడ:

శ్రీ బాలసరస్వతీముద్రాక్షరశాల.

1903

వెల రు. 0-14-0 లు

*All rights reserved.*

శ్రీరస్తు.

శ్రీపరమాత్మనే నమః.

# మల్లికామారుతప్రకరణము.

## ప్రథమాంకము.

శ్రీ లాంగించుత సంగతాటనియుగస్థేయాదితేయాహిరా
డ్బాలాకల్పకసూనహారగమణీవ్యత్యాసకృత్యాఢ్యముల్
వాళీకాన్వితసింధుజాకరచలన్నాళీకమాధ్వీరసా
ర్ద్రాళీకాంబకముల్ పురాంతకధనుర్జ్యాకర్షణంబుల్ మిమున్. 1

(నాంద్యంతమున సూత్రధారుఁడు)

సూత్ర—

చ. తలనెలపూవుసాంద్రపుసుధామధుగంధముఁ దాల్చి, కేళికా
వలయఫణిస్ఫటాళి మొసవం దఱు వొందుచు, నంకగౌరివ
ర్తులకుచపాళిముత్తెపుసరుల్ గదలించులలాటదృక్కృప
ర్ద్రలహారికోర్మివాయువులు తాపము మీఁది శమింపఁ జేయుతన్. 2

మ. గళభూషాఘనఘంటికాఘణఘణత్కారంబు రోదోంతరం
బలమన్, శంభ్వధిరోహణార్హపృథుభవ్యస్నిగ్ధపృష్ఠంబు భా
సిలఁ, దారాచలకూటసన్నిభకకుచ్ఛ్రీనొప్పుకూటస్థగో
తిలకుం డాకృతి గాంచుధర్ముఁడు తమ స్తృణ్యం ద్వదీయం దినున్. 3

మ. ఘనగౌరీకరతాళకంకణఝణత్కారంబులన్ శ్లాఘ్యమున్,
దను వెల్లం బులకించి కాంచుహరుచేఁ దత్స్థానసంభావ్యమున్,
గనదుత్ఫుల్లకలాపకేక మెది, విఘ్నస్వామ్యకాండప్రబృం
హను రంజిల్లుకుమారబర్హి దలనృత్యం బౌ భవత్తుష్టికిన్. 4

(ఆనందముతోఁ దెరవంకఁ జూచి) కొమ్మా! యిటు రమ్మా.

నటి—(ప్రవేశించి సప్రణామంబుగాఁ బుష్పాంజలి చల్లి) ఇదిగో! వచ్చితి నార్య!

సూత్ర—రంగవల్లీ! సకుతూహలు లగునీసభాసదులసావధానత శ్లాఘనీయము గదా! చూడు—

మ. తోఁగరుం గేల్చి గురుంబు టంబునను బూదోయింటి వక్షోజగు
చ్ఛగురుత్వంబున సుంత వంగు మెయితోఁ జల్లంగ నీ వట్లు, శీ
ఘ్రగతిన్ ముందుగ నందు మూఁగినది సోత్కంఠంబు సామాజికా
క్షిగణంబో మఱి చంచరీకచయమో చెప్పంగ రా దుర్మలీ.

ఆర్యవర్యులారా! యజస్రము నమస్కరించెడు రాజన్యమూర్ధన్యులకిరీటంబులం దాపినయింద్రనీలమణిశకలంబులడంబు లెవ్వానియడుగుఁదమ్ముల శైవలమ్ముచిధమ్మున గ్రమ్ము చుండునో, యెన్న నలవిగాకుండ నేడుదీవులం బాఁతినగెలుపుటాతికంబంబు లేవానియకుంఠపరాక్రమంబు కంఠోక్తంబు గావించుచుండునో, దినదినప్రవర్తితంబు లగుదానధారాప్రవాహంబులం బెరిఁగెడు నెవ్వానియశోవల్లీమతల్లికల్లలోకంబులుం బ్రాఁకు లగు చుండునో, స్వచ్ఛతరవారిధారామజ్జనంబునం బవిత్రీకృతు లగుశాత్రవసుభటులస్వయంవరమహోత్సవంబున కుత్సహించునప్సరస్త్రీసంచయం బనారత మేవానిని దీవించు చుండునో, విశ్వవిశ్వంభరాశారిక యెవ్వానివిశంకటభుజావిటపవిటంకంబున విహరించుచుండునో, త్రిభువనపుండరీకప్రబోధనపండితప్రతాపమార్తాండుండు, నృగనహుషనాభాగపురుపురుకుత్సమరుత్తదుందుభిగిరీంద్రద్యుమ్నధర్మజసధర్మచరితుండు, సహజప్రతిభాప్రకర్షప్రవృత్తచతుర్విధకవిత్వసమావర్జితహృదయ సహృదయశిరఃకంపసహితసంశ్లాఘననిరతిశయవైదుషీవిశేషుండు, శైలాబ్ధిసామ్రాజ్యధురంధరుండు, పీఠిహోత్రకులధ్వజుం డట్టివిక్రమభూపాలుఁడు గారవింపం, బ్రఖ్యాతగుణగణాలంకారులు, విమలయశోవితానితవిష్టపత్రితయులు, సకలశాస్త్రార్ణవోత్తరణకర్ణధారులు, నిఖిలభూపాలసభాసభాజితులు నయి భాసిల్లునోసభాసదులారా! మదీయవిజ్ఞాపనం బిది యాలకింపుఁడు.

నేను దిగంతపర్యంత మెల్ల దేశంబులుం దిరిగి, యచ్చటచ్చటం బెనుపీడులం గూడినమహాసభల నారాధించి యారాధించి, సారతరప్రయోగపాటవంబు నలవరించుకొని, విష్టపత్రితయవిఖ్యాతం బగుకుక్కుటక్రోడనగరంబుం దఱిసి, కుతూహలంబున నేతెంచిన రంగచంద్రుం డనుశైలూషకుమారుండను.

మహాజనులారా! ప్రాయికంబుగా సుమనోగణవివేకరాకాచంద్రమండలంబునకు రాహుగ్రహప్రాయం బయినయీకలికాలంబునం బౌరోభాగ్యపరుషంబులగుపరిషదంతరంబుల మదీయాభినయసారంబు, లవణాపణంబులం బచ్చకప్పురంబునుం బోలె నిష్ప్రయోజనం బని యెఱింగి, యఖిలభువనఘస్మరకరా

శకాలకూటకబళనప్రకటితకారుణ్యావష్టంభుండుఁ, బురత్రయనితంబినీకపోలపత్త్రాంకురకర్తనలవిత్రుండుఁ, గంకణక్వణితస్థిరీకృతశబ్దబ్రహ్మవ్యవస్థుండు నగు శ్రీస్థలీశ్వరునిసన్నిధానంబున నిర్ధూతతత్తాదృశకల్మషనిర్మలధిషణంబయి, యశేషకలాకమలినీవికాసనబాలార్కప్రభ యయినయీసభయందుఁ బ్రయోగించి సఫలపఱుచుకొననభిలషించుచున్నాను. సర్వంబున కార్యవర్యులే యిటఁ బ్రమాణము.

(ఆకసమునఁ జెవి యొగ్గి) ఏమనియెదరు? అటు లయినచో నుద్దామశబ్దార్థసన్నివేశశిల్పాకల్పంబును, శృంగారరసగర్భంబును, నాతిసంక్షిప్తవిస్తృతచిత్రేతివృత్తక్లృప్తనిర్వాహణంబును నగు నేదేనిరూపకంబున మాకు వినోదంబు గావింపుమనుచున్నారా? పరిషదాదేశము నాలకించితివా భాసురాంగీ?

నటి.—ఆర్యా! తాదృశప్రబంధ మేదయిన వినంబడునా?

సూత్ర.—(స్మరణ మభినయించి) అయ్యో! హస్తగత మయినమాణిక్యము నంగడిలో నరయుచున్నాను. ముద్దుగుమ్మా! నిర్దుష్టగుణవిశిష్టం బయి యుద్దండకవినిబద్ధం బయినమల్లికామారుతం బనుప్రకరణరత్నం బస్మద్వశంబ కదా!

నటి.—(అనుతాపముతో) ఆర్యా! యధునాతనప్రబంధములయందు లోకుల కనాదరము కాదా!

సూత్ర.—ముద్దరాలా! యాలకింపుము.

చ. పొరయరు ప్రాఁతక్రొత్తఁదనపుండలపుం గవిసూక్తులన్ బుధుల్;
నెరసులు దోఁచినన్ విడిచి నెమ్మి గ్రహింత్రు గుణంబు లుండినన్;
బరుఁడు పరప్రమాణుఁ డవమానము సేయుఁ బరంబు; దాన నే
సెర గిది బొమ్మతాయి యని చీకులు ద్రోచిన దోషి రత్నమే? 6

మఱియు—

క. కవులరస మొలుకుపలుకులు| చెవులం బడ, నాదరంబు సేయనివారల్
గవు లనుచు మూసికొందురు| నవమాలతి పరిమళింప నాసాపుటముల్.

ఆకవీంద్రుఁడు చెప్పనది వినుము.

తే. గీ. ఇందు గుణబిందువులు గలవేని యాలరి
పండితుఁడు గొను దోషంబు ప్రకట మయిన;
బెరసి యున్నను నీరిలో, వేఱుపఱిచి
పాలచుక్కలు గ్రోలదే బ్రహ్మహాయము? 8

నటి—(శ్లాఘించుచు) అట్లయిన నార్యా! పుణ్యకీర్తి యగునాకవిచంద్రుని దేశగోత్రము లేల వర్ణింపరు?

సూత్ర—దక్షిణాపథంబున దయమానకామాక్షీకటాక్షకాలాంబుదతాండవితకవిమయూరమండలంబు లగుతుండీరంబుల క్షీరనదీతరంగక్షాళితోపశల్యం బగు లాటపురం బనుమహాగ్రహారంబు గలదు

చ. చరితమహావ్రతుల్, సకలశాస్త్రపటిష్ఠు లనుష్ఠితాధికా
ధ్వరు లభిజాతు లాస్యధృతభారతు లచ్ఛపుశ్రోత్రియుల్, త్రయీ
పరతులు, సంతతాతిథిసపర్యలచేతను నాసరంబులం
జరుపుచుఁ గాఁపురంబు లట సల్పుచు నుందురు పుణ్యభూసురుల్. 9

అందు నాముష్యాయణుండు, నాపస్తంబశాఖాధ్యాయి, వాధూలకులతరుపల్లవుండుఁ, గవితావల్లభుండు, మహితయశస్కుండు, నుపాధ్యాయగోకులనాథపౌత్రుండుఁ, గృష్ణసూనుండు నగుభట్టరంగనాథున కిరుగుపనాథాపరపర్యాయుండుద్దండకవి యనునైదవసత్పుత్రుండు గలఁడు.

నటి—అహో! యీకవివంశశుద్ధి పొగడఁ దగినది గదా! సరే గాని రామకృష్ణాది మహాపురుషచారిత్రము లుండఁగా నుత్పాదనీయవస్తుగ్రహణవిషమసంఘటనం బగుప్రకరణంబు నేల యాయన రచియించినవాఁడు?

సూత్ర—ఓకుతూహలిని! యిందుకుం బ్రసక్తానుప్రసక్త మయినప్రస్తావము కావలసినంత యున్నది. కాని నే నిప్పుడు దానిని సంక్షేపించి నీకుఁ జెప్పెదను. ఆకవి యథావిధిగ గురువులకు శుశ్రూష గావించి, వారలయనుగ్రహంబున సమధిగతసకలవిద్యుం డయి దిగంతరసందర్శనాభిలాషంబున నాంధ్రకళింగకర్ణాటనాటీకచోళకేరళదేశంబులు గడచి మహానదుల మునుంగుచు, దేవస్థానంబులు సూచుచు, నంతర్వాణుల నభినందించుచు నిప్పుడీతామ్రమాడక్రోడనగరంబునకు విచ్చేసినవాఁడు. ఇట్లు విజయంజేసి—

ఉ. మ్రొక్కుదిగంతవీరులను భూరిచలనంబునఁ బాఱఁ దోల ను
క్కెక్కినహెగ్గడుల్, కరగృహీతము లౌసితచామరంబులన్
బ్రక్కను నిల్చి ప్రోడ లగువారవధూటులు వీవఁగా సుహృ
ద్దృక్కమలార్కుఁడై కొలువు దిద్దినవిక్రముఁ గాంచె గద్దియన్. 10

అట్లు కాంచి యివ్విధంబున సంస్తుతించెను.

క. వజ్రారి ధారుణీశప! రాక్రమఘూర్ణితపుష్కరావర్త! ధరా
చక్రకుటుంబీ! జేజే! విక్రమ! విశ్వైకవీర! విద్యాధారా. అని. 11

నటి—ఆర్యా! సకలకవిమండల శిఖండరత్నం బగువిక్రమమహారాజప్పు డేమా నతిచ్చెను ?

సూత్ర—జవ్వనీ! యవ్వాడి నవ్విశ్వంభరారాజంభారియుం, బరిసరవర్తికోవిదవదనాకృష్టం బయి విఘటమానకమలదళశీతలం బయినకటాక్షంబున సంభావించుచు నీషదున్మిషితమందస్మితసుందరవదనేందుం డయిసాదరంబుగా నతనికిట్లనియె.

మ. కవియుద్దండ! మదీయ మావచన మాకర్ణింపుమా; కామధే
నువు వాణీయసి నీదువాణి; కవితం దొల్కు౯ విలాసంబు ల
ట్లవుట౯ గోరెద, వే రచింపు బుధవర్యా! మల్లికామారుతా
ఖ్యవిధానాఢ్యరసార్ద్రసత్ప్రకరణం బస్మన్మనఃప్రీతికి౯. 12

నటి—ఓహో! నామకరణము గూడ మహారాజే కావించినవాఁడు! ఇది మిగుల నచ్చెరువు. రాజత్వబుధత్వములు రెండు నొక్కనియందే యున్నవి!

సూత్ర—సుందరీ! నిశ్చయముగ నాశ్చర్యకరమే.

క. అనసూయ కవిజనంబులు మనసునఁ, గస్తూరియం దమలినత్వంబు౯
వననిధి నక్షారత్వము వనితా! భూపాలునందు వైదుష్యంబు౯. 13

నటి—ఆర్యా! తరువాయి చెప్ప నక్కఱ లేదు. తెలిసినది. ప్రకరణవిరచనమునకుఁ బ్రభునానతి కారణము. ఇఁకఁ గవివర్ణనము గావింపుఁడు.

సూత్ర—భామా! మీమాంసకచక్రవర్తి, మహర్షిపుత్రుం డాపరమేశ్వరుఁడే యది యొనరించి యున్నాఁడు. విను—

"ఉ. దండివి వేదతండమునఁ; దర్కమునం దతి కర్కశుండవు౯;
జండుఁడ వెల్లశాస్త్రముల; శ్లాఘ్యుఁడవుం గవితాచమత్కృతి౯;
గండఁడ నాలుభాషలను; గావ్యములం గళలం బటుండ వు
ద్దండకవీ! తలంప నెడఁద౯ నిను నద్భుత ముద్భవింపదే?" అని. 14.

నటి—అట్లయిన జన్మాంతరసంచిత మయినమనపుణ్యసంచయము ఫలోన్ముఖ మయినది.

సూత్ర—సుందరీ! యందుకు సందేహ మేమి?

చ. చదువులసాన యోలగము; చాల విచిత్రము గాథయు౯; జతు
ర్విధ మగుమంజులాభినయవిద్యను చేర్చిన యొందినార ము
త్పదముఖదండకవ్యములవాణి సుధాఝరి; యన్నటుండనీ;
సదసున నాయకుం డిదిగొ! సాంధ్యనటుండు సదాశివుం డిట౯. 15

(సభను గూర్చి)

ఆ. వె. ఉల్ల ముల్లసిల్లు మల్లికామారుతం
బనెడుప్రకరణంబు నభినవంబు
మీసమక్షమందు మేము ప్రయోగింతు
మగుఁడు సుప్రసన్ను లార్యులార. 16

మఱియు నొక్కవిజ్ఞాపనము.

ఉ. ఆదిని వేల్పుబాస నటు లాచతురాస్యునిచేఁ బ్రభూతమై
స్వాదురసప్రపూర్ణతను భాసిలుదానిఁ దెలుంగు సేసె వ
డ్డాదికులోద్భవుండు ప్రకటస్వకవిత్వుఁడు సుబ్బరాయఁ డీ
రాదృతిఁ జిత్తగింపుఁ డిపు డాంధ్రరసజ్ఞులు తత్ప్రయోగముల్. 17

(నడచి చూచి) అహో! యవ్యక్తమధురకోకిలాలాపములతో వసంతలక్ష్మి సాక్షాత్కరించినది. ఇదిగో!

ఉ. జుమ్మనుచుం జెవుల్ సొగసి సోలఁగ గానము సేయుఁ దుమ్మెదల్;
కమ్మనితావితో మరునిగర్వ మెలర్పఁగ వీచుఁ దెమ్మెరల్;
క్రొమ్మ లశోకదోహదము గూర్పఁ జెలంగెడు నూపురాళి; పూ
దుమ్మున వాసరమ్ము లగు ధూసరముల్ పొగడల్ హసించుటల్. 18

(నిరూపించి) చూడు మస్మదనుగుణవ్యాపారము నే యీఋతువును నవలంబించినది.

ఉ. పంచమహృద్యకంఠపికపాళికలస్వనతానకృత్యముల్
మించఁగఁ, బల్లవాంగుళుల మెల్లనఁ జూతలతావిపంచి లా
లించి, వసంతవైణికుఁ డళివ్రజసుశ్రుతితంత్రి మీటుచుం,
బంచశరాసదృగ్యశముఁ బాడు జగత్త్రయమోహనంబుగన్. 19

కావున యౌవనవతీ! నీ వీసమయము నాశ్రయించి సంగీతము పాడుము.

నటి—చిత్తము. (పాడుచున్నది).

ద్విపద—మలయాలయమునుండి మారుతార్భకుఁడు
కలకంఠసఖుఁ డనంగమహేంద్రునకును
వల్లభుం డగుమంత్రి వాసంతుఁ డనుఁగు
మల్లిక నాదరింపఁగ వచ్చు నిదిగో! 20

సూత్ర—హాయి హాయి

క. కోయిలలలనలకూజిత। మా ? యల నాణెంపువీణియలకలకలమా ?
హాయి యనిపించె రాగం। బీయది నీమధురగీత మెఱిఁగితిఁ దరుణీ.

సుందరీ! చూడు—

క. అనవద్యం బీవిద్యను। జనహృద్యం బీవిలాస సంపద గని ని
న్ననుకొందు, నెందు కతననొ।విను మాని, ధరం జరించువిద్యాధరిగన్.

పెద్దకాలంబున కిప్పుడు సముచితాభీష్టసకలవస్తుసంవిధానలాభంబునం జేసి దేశదేశంబులు దిరిగిన యీప్రయాసంబును మహాసంతోషమునకుఁ గారణ మయినది. నిజమే—

క. చిరకాంక్షితవస్తు వెటో। దొరకొనినన్ దైవఘటనఁ దొయ్యాలి! యట ముం
దరఁ బడినబహుళతరదు। స్తరదుఃఖము లన్ని పరమసౌఖ్యంబు లగున్. 23

(తెరలో) భద్ర! భరతపుత్ర! చిరకాంక్షితవస్తు వని నీ వుపన్యసించిన విషయము గడు లెస్స యయినది.

సూత్ర—(చూచి) కుసుమపురంబుపఱగడయాశ్రమంబున నివసించు మహాయోగేశ్వరి మందాకిని తనశిష్యురా లగుసారసికతోఁ గూడ నీలాగుననే వచ్చుచున్నది. కాఁబట్టి మనము సముచితసంవిధానంబునకయి పోవుదము.

(నిష్క్రమించుచున్నారు)

—ప్రస్తావన.—

(తరువాత ముందు చెప్పినట్లు మందాకిని ప్రవేశించుచున్నది)

మందా—బిడ్డా! సారసికా! యిది సత్యమే సుమీ.

"క. చిరకాంక్షితవస్తు వెటో। దొరకొనినన్ దైవఘటనఁ దొయ్యాలి! యట ముం
దరఁ బడినబహుళతరదు। స్తరదుఃఖము లన్ని పరమసౌఖ్యంబు లగున్."

సార—భగవతీ! దుఃఖములు గూడ సుఖము లగునంతటిచిరకాంక్షితవస్తుసంఘటనము మీయనుభవమున కిప్పు డేది వచ్చినది?

మందా—(తనలో) ఓహో! యింతకు ముం దిది దేవతార్చనమునకుఁ బువ్వులు దేరఁ బోయినది గదా! అందుచేత నిప్పుడు నడచినవృత్తాంతము దీనికిఁ దెలియదు. (ప్రకాశముగా) విశ్వావసుని కూఁతు రగుమల్లిక యెడల నాకుఁ గల వాత్సల్యాతిశయ మెట్టిదో నీ వెఱింగినదానవే గదా! చెప్ప వలసిన దేమి? ఇప్పు డీకుసుమపురోపశల్యవాసంబును, జిరపరిచితదేశవిరహంబును గూడ నా కందువలననే. మునుపు నేను—

ఉ. భూధరరాజపుత్రి మృగపోతములం దయఁ బెంచుచోట్ల, వి
ఘ్నాధిపు చెక్కు రాపుల ననోకహముల్ మహిఁ ద్రెళ్లుచోట్ల, వి
ద్యాధరబాలికల్ హరునియద్భుతలీలలు పాడుచోట్లఁ, బల్
సాధులసంగతిం దుహినశైలవనంబుల నుండుదానఁ జూ. 24

యోగవిద్యను నాకు సతీర్థ్యం డయినవిద్యాధరామాత్యచక్రవర్తిని విశ్వావసు నెడఁబాసినబెంగ సయితము దానిచేత నే తిరోహితం బయినది.

సార—ఏ మిది! భగవతియంతరంగభృంగము కేవలము మల్లికయందే తగిలి యానందించుచున్న దన్న సంగతి నే నెన్నఁడు నెఱుంగ నయితిని.

మందా—ఇది మాత్రము సుప్రసిద్ధమే. విను. కుంతలేశ్వరునిమంత్రి యగుబ్రహ్మదత్తునికిఁ గుమారుఁడు, పదునాలుగువిద్యలపాండిత్యంబునన కాక యాయుధాభ్యాసంబునందును నాఱితేఱినవాఁడు మారుతుండు, తమపరమాప్తబంధుని మగధేశ్వరునిఁ జంద్రవర్మను సందర్శించుటకుఁ, దండ్రిచేతఁ బ్రేషితుం డయి బహుసైన్యసమేతంబుగా వచ్చి యీకుసుమపురోద్యానంబుల నాతోఁ గూడ నున్నవాఁడు గదా!

సార—అగును భగవతి! మేనియొఱపునఁ జెఱకువిలుకాని మఱపింపఁ జాలినయామంత్రికుమారుఁడు రాజమార్గమున వచ్చుచుండఁగా, నాతనిఁ జూడ వలయు నని పరుగుపరుగున మేడ లెక్కినచక్కెరబొమ్మలవిస్మయవికసితపక్ష్మలస్నిగ్ధవిశాలలోచనంబులచేత వాతాయనంబుల కానాఁడప్రయత్నంబుగాఁ గువలయదామరామణీయకంబు సంఘటిల్లినది.

మందా—ఆతనియందును నాహృదయమునకు మల్లికానిర్విశేష మయినపక్షపాతమే సుమీ.

సార—భగవతీ! యందుచేతనా మీరు తలఁచుగా నప్పుడప్పుడు మారుతుఁడు మారుతుఁ డని ప్రశంసించుచుందురు.

మందా—పరస్పరసదృశగుణశీలరూపాభిజాత్యు లగువా రిరువురకును దైవికముగా నిప్పు డిక్కడనే యన్యోన్యదర్శనలాభము సంఘటిల్లినది. అందుచేత నాయానందము వర్ధిల్లుచున్నది.

సార—భగవతీ! దర్శనమాత్రమున నేమి ప్రయోజనము?

మందా—బిడ్డా! దర్శనమాత్రమే కాదు. అయ్యాదన నది సందు చేసికొని యదరంట నేపెడు తుంటవిలుకాని క్రొవ్వాఁడిపువ్వునారసంబుల కొక్కసారిగ

వా రిరువురు గుఱి యయినవారు. అప్పుడు వ్రీడావిస్మయవిలాసమంథరంబు లయి, విదగ్ధజనైకగ్రాహ్యంబు లయినతనయాకారంబులచేత గాఢకఠోర స్మర వికారము మల్లిక వెల్లడింపనే వెల్లడించినది. ఎట్లంటివా ?

సీ. విను రతిభావానువిద్ధముల్ సవ్యాజభావగర్భస్వభావంబు లగుచుఁ
బ్రస్ఫురత్పక్ష్మతారకభాసురంబులు ధారాప్రవాహసంచారు లగుచు
స్నిగ్ధముగ్ధంబులు స్మేరలోలము లై నమధురలోచనవిభ్రమములు గలిగి
గండస్థలన్యస్తకస్తూరికాపత్రలతికలు చెమటబొట్లను గరంగఁ
దనువునం దెల్లఁ బ్రౌఢకదంబకుట్మ|లాభవికృతి యొకానొక డంకురించి
యపు డనిర్వాచ్యపంచబాణాసమాన|చాప నైపుణి దోఁపించె నాపె రూపు.

సార——భగవతీ! మారుతునియవస్థ యప్పు డెప్పగిదిం జూపట్టెను.

మందా——తే. గీ. మారుతుండును సామోదమంథరదర
హాస మల్లిక నటు వీఁగఁ జేసి చాలఁ
డయ్యె సుషమామరందమగ్నాన్యవిముఖ
మంజులకటాక్షభృంగాళి మరలఁ జేయ. 26

సార——భగవతీ! తగినదానికిఁ దగినవానిని గూర్పఁ దలఁచినతమ్మిచూలి యారంభ మిది యతిరమణీయము గదా!

మందా——బిడ్డా! వేయేటికి ?

క. నాచేఁ జిరవాంఛిత మగు| నీచిఱుతల పెండ్లిఫలము నిడురాగకుజం
బేచుటకై వివిధముగా| నాచతురాననుఁడు బీజ మారోపించెన్. 27

సార——(అనుతాపముతో) భగవతీ! యారట్టేశ్వరుం డగుసింహవర్మకు నమాత్యుం డయినశంబరకుండు మల్లికను రాజముఖంబున నడుగుచున్నాఁడు గదా!

మందా——(సావజ్ఞముగా) వానిని దిరస్కరించుట యెంత పాటిపని ?

సార——భగవతీ! యది సత్యమే. మీనయప్రభావమున కిది యెంతలోనిది?

మందా——బిడ్డా! చూడు——

తే. గీ. మారుతు నలోకసామాన్యు మరగినట్టి
మల్లికను శంబరకునకుఁ జెల్ల దీయఁ;
బారిజాతంబుమీఁదను బ్రాఁకుబాల
పల్లికను గూర్చు నెవఁడు కింపాకమునను? 28

(సానందముగా)

ఉ. రాముము సుమ్మి వీరలపరస్పర మాననురాగబంధనం। బు ;
(సనిర్వేదముగా)
ఈమెకులీనకన్య, చరియించును దాఁ, బితృశాసనంబునం। దు
(సవితర్కముగా)
ఏమగునోగదా జతనము ?
(నిట్టూర్పుతో) ఎంచఁగ నీదృశ మ్మైనవానిలోఁ।
గాముఁడు సర్వతాంత్రికశిఖామణి కేవలముం బ్రమాణ మా. 29

సార—భగవతీ! బాల్యసులభం బయినచాపలం బీనాలుక నూర కుండ నీయమిం జేసి నే నొక్కటి యడుగఁ గోరుచున్నాను.

మందా—బిడ్డా! నిస్సంశయంబుగా నడుగుము.

సార—అట్లు విషయభోగతృష్ణను విషప్రాయముగా నెంచుకొని విశ్వావసుప్రముఖ దివ్యపురుషులతోడ బద్ధసఖ్యం బయినభగవతిమానసంబు మానుసులయెడలఁ బక్షపాతపరవశం బేల యగుచున్న దని శిష్యురాలి సందేహశల్యము.

మందా—కుమారీ! తెలుప రానిరహస్యము నడిగినదాన వయితివి గదా! కానిమ్ము. (చెవిలో) ఈలా గీలాగు.

సార—(చేతితో నోరు మాటుకొని సవినయముగా నాలించి) అహో! మల్లిక మహాప్రభావసంపన్నురాలే? నే నీవఱకును మానవసామాన్య యనుకొన్నదానను. మీరు చెప్పినట్లే కానిపక్షమునకు సకలలోకలోచనాసేచనకం బయిన తాదృశలావణ్యరేఖ యేకారణమున నామెకుఁ జేకూఱఁ గలదు? ఊరక యిట్టివారియందు నట్టివారియందు భగవతి యేతీరున స్నేహసారముగానఁబఱిచెదును?

మందా—బిడ్డా! నీకుఁ జెప్పినయీసమాచారము వేఱొకచెవిని బడఁగూడదు సుమా.

సార—చిత్తము భగవతి! నేనంత యోటినోటిదానను గాను గదా!

మందా—సరే కాని యిదిగో నాకు స్నానవేళ యయినది. అష్టపుష్పికావ్రతంబునకుఁ గావలసినయుపకరణంబుల నీవు సిద్ధపఱుపుము. ఇక్కడనుండి యింటికి వెళ్లుమల్లికతోఁ గూడ నంపఁబడినమనకాళింది యింకను దిరిగి వచ్చినదికాదు.

సార—అట్లే సిద్ధపఱిచెదను భగవతి!

(ఇద్దఱు నిష్క్రమించుచున్నారు. విష్కంభము.)

(తరువాతఁ గామయమానావస్థుఁ డయి పటకుటీరస్థుఁడు మారుతుఁడు ప్రవేశించుచున్నాఁడు.)

మారు— ఆమె—

శా. తా విద్యాధరకన్యయో? నరులకుం దత్పుణ్యసంప్రాప్త యౌ
లావణ్యామృతసాగరోత్థితనవశ్లాఘ్యేందిరాదేవియో ?
హా! విజ్ఞాతము, చంద్రచందనసుధాజ్యోత్స్నామృణాళాదులన్
బూవుందూపులజోడుమాయ గడఁగెన్ మోహింపఁ జేయన్ ననున్.

(గగుర్పాటుతో)

చ. జగములఁ జిల్కుచున్ సుధను సంతసపెట్టుహిమాంశుపాదముల్,
మృగదృశ మోముఁజందురుని మెచ్చి యటం జొరఁ బోలుఁ; గానిచో
నిగిడి కటాక్షసాళముల, నెమ్మెయి జీవము దేర్చి, పాపుచుం
దగ, నమృతంపుసోన లెటు నన్ దడుపం గల వాక్షణంబునన్ ?. 31

ఆహా! యానీరజాక్షి నెమ్మేను సర్వానవద్యము గదా!

ఉ. క్రొమ్ముడి కింద్రనీలములకు మ్ముడి; బందువు లిందు వామెమో
ముమ్మడి కల్మిలేముల కహో నడుమన్; దమక్రిందివానికిన్
ముమ్మర మైనభారములు ముద్దియ చన్దుగయుం బిఱుందుఁ; జెం
దమ్ములె పో పదమ్ములు; యథార్థము నెన్నడ లొజ్జ లంచకున్. 32

(ఆలోచించి)

చ. సిరికి నివాస మైనసరసీరుహ మెవ్వఁడు సేసెనో, మహా
త్తరజగదీక్షణోత్సవము తచ్ఛశిబింబ మెవం డొనర్చెనో,
గరగరికల్ ఘటించుమతికౌశలి మీనుసిడెంబువానికాఁ
పుర మగునమ్మృగాక్షిమొగమున్ సృజియించినవాఁడు నాఁడె యౌ. 33

(మరల నాలోచించి) అయినను నాయీయెన్నిక క్రమ మయినది కానేరదు

ఉ. ఓపునె పోల విశ్వనయనోత్సవదం బతులంబు పక్ష్మలా
క్షీపణితాననంబు పరికింపఁగఁ బంకరుహంబు? పాప మా
దీపితపూర్ణిమావిధుమదిం గల దే నలవాంఛ, వానికిం
దోఁప దదేమి పూన స్మరదోర్గతచాపముఁ గల్వరోపమున్ ? 34

ఆహా! వివిధము లయినయామెవిలాసముల చేత సంచలించెడునాధైర్యముఁ గుదురుపఱుచుకొనఁ జాల కున్నానే!

తే. గీ. సురుచిరభ్రూవులను నొప్పుసుదతిత్ర్యస్ర
తరళమంథరముగ్ధమందత్రిభంగి

మధురదృక్పాతముఖచారిమముఁ దలంచు
చిత్తమున నూరు నేమేమొ వృత్తులెన్నొ. 35

సర్వథా దుర్లభవస్తువు నపేక్షించుచు దీనుఁడ నయి నన్ను దుఃఖపెట్టుకొనుచున్నాను.

ఉ. భూరితరంబులైన తపముల్ సవరించినఁ బొందరాని చా
నీరజపత్రనేత్ర ; యిది నిక్క మెఱింగియుఁ గోరుచుంటి; నీ
హారధరాధరేంద్రమకుటాంచితచారువిలాసమాల భా
గీరథి నక్కటా మలయగిర్యధివాసి వరించుకై వడిన్. 36

వలపు లేనివాలుఁగంటికయి మేలుపడిన నావంటివానిని విదగ్ధజనంబులు గోష్ఠీమధ్యంబులం బరిహసించుటయుఁ బాటిల్లును గదా!

చ. తనయెడ రక్తి లేనివనితం గని మేల్పడినట్టివాఁ డనం
గునిగుఱి కూర కగ్గమయి గోష్ఠులయం దపహాస మొందు; నె
వ్వని దెసమక్కువన్ శరవిపాండుకపోలము లేణశాబలో
చనలు ధరింతు రప్పురుషుజన్మమ జన్మము పో తలంపఁ గన్. 37

(అశంసముతో)

ఉ. అంచ లకుంఠితంబు లగు టడ్డముగాఁ బ్రసరించు టశ్రులో
ల్యాంచిత నూట, సోగ లగునక్షులనైజపువిభ్రమంబు లో;
యించుక నన్నుఁ గావ మది నెంచినమాయవిలాసచేష్టలో;
గాంచక సిగ్గిసీ! యెడఁదఁ గ్రమ్మఱ నాస లెవ్వా ఘటింపుదుర్. 38

అటు కాదు. ఆమహేంద్రద్విరదగమన నాయింద్రియముల భ్రమపెట్టినది. అందుచేతనే యట్టివి కాని వయినను నయ్యయివికారంబులు సాత్త్వికంబులని నేను దలంచుచున్నాను.

క. మరుపేరిరైంద్రజాలికు। కరమున విలసిల్లుపింఛికయ పోలె నహో!
తరణాక్షి నాదుచిత్తము। పరిపరివిధములను భ్రాంతిపఱుపం దొడఁగెన్.

ఆసమయమందు—

ఉ. చెమ్మట లూరెఁ జెక్కులను; జేతులు జాఱె ; స్ఫురించెఁ జూచుకా
గ్ర మ్మధరోష్ఠముల్ ; మొగిడె రాగకషాయితదృగ్యుగంబు ; కన్
బొమ్మ నటించెఁ; గంపమును బొందెఁ దొడల్; పులకించె దేహ మా
కొమ్మకు నూర్పుగాడ్పుల దుకూలమునంచలముం జలించెఁ గా. 40

ఔరా! యనవ్యాపేక్షం బయి యీచిత్త మాచంచలాక్షియొద్దకే పరుగు నాఱుచున్నది. కానీ. దీని నిట్టు లుపాలంభించెదను.

చ. అదలుచు నొజ్జ యైనవినయంబు గణింపక, సిగ్గుబోటికే
ల్విదులుచుకొంచుఁ బోఁ, గని వివేకసుహృత్తు, నినుం ద్యజించె; బా
ల్యదశ మొదల్ సదా పరిచయంబు గలానిని నన్ను నమ్మ వో
హృదయమ! యమ్మృగాక్షి యపరీక్షిత; యే మిది నీక్రమం బహో. 41

ఔరా! మన్మథునిప్రసాదకోపంబు లెంతనిలుకడ లేనివి!

ఉ. కప్పురపుంబరాగముల, గంధరసంబుల, నన్, హిమాంబులన్,
జిప్పిలుపేరిమ వెన్నెలలచే, నమృతంబులఁ దొప్పఁదోఁచె న
ట్లప్పుడిఁ కిప్పుడో, శివశివా! పెడఁబాయఁగ బాలఁ, గాలపు
న్నిప్పను గాల కూటమును నిర్ఘృణుఁడై యడరించు నాపయిన్. 42

(ఆకసమువంకఁ జూచి)

తే-గీ. కనికరం బేది, నామీఁదఁ గరకుటంప
చిచ్చుఁ జిమ్మెద వోరనొప్పి మచ్చెఱుంగ
వకట! విషమాస్త్ర! చండీశునళికదృష్టి
పా లయిననాఁటినీపడ్డబాధఁ దలఁపు. 43

(నిట్టూర్పు పుచ్చి) నే నీబాధ యెవ్వరితోఁ జెప్పుకొందును? నగరదర్శన కుతూహలంబునం బోయినకలకంఠుఁ డింకను రాఁ డయ్యెను.

(సంతాప ముకుళితలోచనుం డయి యున్నాఁడు. తరువాతఁ గలకంఠుఁడు ప్రవేశించుచున్నాఁడు.)

కల—(ఆనందముతో) కుసుమపురమును జూడఁ బోయి, యమాత్యవిష్ణురాతుని యింటివీథిఁ జేరఁగా నే యదృష్టవశమునఁ గన్నులు కలిగినందుకుఁ దగినఫలము లభించినది.

ఉ. క్రొమ్మెఱుఁగట్లు మేఘమునఁ, గోమలి యోర్తు మహేంద్రనీలహ
ర్మ్యమ్మున బోటులం గలసి యాటల నుండఁగఁ, గంటిఁ దొంటిభా
గ్యమ్మునఁ; గొమ్మయుం దపనజాంబుచలత్కువలాభముల్ కటా
క్షమ్ములు చిమ్మె నాపయిని గమ్మలు బొమ్మలు నెమ్మె గుల్కఁగన్. 44

(నడచి) పట్టణములోనికిఁ బోయి యున్నందున నిందనుకను నేను, జగదానందమాకందకందళనమలయమారుతుం డగుమారుతునిఁ బ్రియసఖుని సంద

ర్పింపఁ జాల నయితిని. కాఁబట్టి నాకన్నులు నిజముగాఁ జిరకాలోపవాసము చేసిన ట్లుండి తద్దర్శనామృతపారణమునకు వేగిరపడుచున్నవి. ఇప్పుడే యాశ్రమమునుండి విచ్చేసి, పరిజనుల నందఱ నవలి కనిచి, యొక్కఁడు నేమో యాలోచించుకొనుచు ననుఁగుఁజెలికాఁడు పటమండపమున నున్నాఁడని ప్రతిహారి చందనలత చెప్పినది గదా! నే నిప్పుడు లోనికిఁ బోయెదను. ఇదే గుడారపుద్వారము. (ప్రవేశమభినయించి చూచి విచారముతోఁ దనలో) ఏమిది! ప్రియవయస్యుఁడు చింతాతిభారమున మ్రానుపడినట్లు, చిత్రించినట్లు, వ్రాసినట్లు, తాపినట్లు, తగిలించినట్లు, నిశ్చాంచల్యభావంబునఁ గనుపట్టుచు, నిట్టూర్పుగాడ్పుల హారవల్లరు లల్లలాడ, ననిచినకడిమిమ్రానిం గ్రేణి సేయుకంటకితకమనీయకాయంబుతో, మానసంబునం బాటిల్లినయేదేని గాటంపుటారాటంబున నస్వస్థత గలిగి యున్నట్లు గానఁబడుచున్నాఁడు. (తేఱి చూచి) ఆశ్చర్యమాశ్చర్యము!

క. మూసినకను దెఱ కీతఁడు। గాసిలుచును గడిఁది మేనికాఁకల నోహో
యాసకొలుపు నయనంబుల। వేసఁగి సెగసోఁకుగంధవిటపియుఁ బోలెన్.

(ఆలోచించి) మొట్టమొదటిపాటున నోర్వఁ దరంబు గానిమన్మథావేశము కొట్టకొన నీతఁ డిప్పు డధిరోహించి యున్నవాఁడు. ఇది యథార్థము. కాని యెడల నీవిధ మైనహృదయజ్వరంబున శోషిల్లు చుండియు, నిదాఘతాపంబునం జిక్కి పోయెడుభాగీరథీప్రవాహంబునుంబోలె నీతఁ డభిజాతశోభాతిశయుం డెట్లు లయ్యెడును? అయిన నాశ్రమగతున కనంగవికార మనంగ వికార మనుట మాత్రము సరిపడి యుండ లేదు. కానీ. తెలిసికొనియెదను. (దగ్గఱఁ బోవుచున్నాఁడు.)

మారు——(కనులు దెఱవకయే) చెలికాఁడా! కలకంఠుఁడ! (ఈయర్థోక్తనే) ఇక్కడఁ గలకంఠుఁ డెక్కడ?

కల——(తనలో) ఏమీ యీస్నేహపారవశ్యము! ఈదృశావస్థయందును నన్నే యీతఁడు తలంచుకొనుచున్నాఁడు! (ప్రకాశముగా) వయస్య! నీ కసమయమున నేల యీకాతరత్వము? గుట్టలను రాకొట్టఁ జాలిననీదిట్టతనం బెప్పట్టునకుఁ బోయె?

ఉ. వ్రాలిచి తేల కేలను బ్రభాతసుధాకరపాండురాననం
బేల దృగశ్రువాఃకణము లీగతి జొప్పల నప్పళించు? ను

ష్ణాళువుగా రదాంశుకము శ్వాసము మేరను మీఱ నేల ? నీ
మే లగు మే నిదేమి సఖ! మిక్కిలి గాసిలుఁ? దెల్పు నిక్కమున్. 46

మారు—నీతోఁ గాక మఱి యెవ్వరితోఁ దెలుపుదును? ఆలకింపుము. ప్రాణసఖా! నేఁటియుదయమున మార్తాండమండల మింకను దనపొడుపుఁగుసుమంపుఁగెంపుసొంపు మాయమింజేసి, వాసరలక్ష్మీచరణలాక్షారసపిండంబునుం బోలె నంతరిక్షాశోకవృక్షపుష్పగుచ్ఛంబునుం బోలెఁ జూపట్టుచుండఁ, బరిమితపరివారంబుతో బయలుదేఱి, యద్భుతయోగప్రభావ యని మునుపు నేను వినుచు వచ్చినమందాకినిని సందర్శింప వలయు ననుకుతూహలంబున, జింకలు గొంకుజంకు లెఱుంగక ముంగిటఁ దిరుగుచున్నయామె యాశ్రమ మీచేరువ నుండఁగా నందుఁ బ్రవేశించి, మంచుఁగొండనుండి వెడలి వచ్చినమందాకిని చందంబునఁ బావనగంభీరప్రసన్నమధురాకృతి యగు నామె దర్శనమును జేసికొంటిని.

కల—తరువాతి ?

మారు—అనంతర మాక్షణంబునఁ, దుంటవిలుకాని వింటినారి క్రేంకారంబు ననుకరించుచు, గంటలయొడ్డాణము లోనుగాఁ గలనగలకలరణనంబుతోఁ గలసి, యింద్రియాభినందనం బయినమణినూపురంబులఝణఝణత్కారంబు నావీనుదోయికి వినవచ్చిన దయ్యెను. అంతలోనే యచ్చటఁ జేరువ నున్నకాత్యాయనీదేవియాలయము చెంగటియారామవాటియందు, ముందు నడిచెడి హెగ్గడుల కరతలంబులఁ దలతలమని యెడు పయిఁడిబెత్తంబులం గనుంగొని మెఱుంగుఁదీఁగ లని యాశ్రమశిఖండిమండలం బానందతాండవంబు గావింప, మానికంపుఁగామల నేపు సూపువీచోపులం బూని కోపుల నల్లనల్లన వీచుచున్నజాణలగు బోగంపుఁబువ్వుఁబోణుల మణికంకణంబులఝణఝణలు, చేరువతమ్మికొలఁకులయలలమొత్తముల నాయాల లూగురాయంచలఁ జేరఁ దీయఁ, బయికత్తినపగడంపుఁగామల నుల్లసిల్లెడువెల్లగొడుగులు వెన్నెలపులుఁగులకుఁ జలివెలుఁగులవిభ్రమమును గలుగఁ జేయ, నాకసంబున నకాలశక్రధనుస్సంపాదకంబు లగు నాభరణప్రభలతో, నడక లలవడినసొగసుఁబూఁదీగలుం బోలె నత్యుదారవేషంబున నం దేజరిల్లుచుండియానలసందోహం బాకస్మికంబుగా నాకం దోయికి విందు సలిపెను.

కల—ఓహో! తరువాత?

మారు—అటుపిమ్మట మిత్రమా! యే మని చెప్పుదు?

చ. అమృతవిలిప్తవైద్యుతచయప్రతిమం బయి యర్కతేజమున్
గముచుమహోజ్జ్వలత్సుషమ గాఢనిమగ్నతఁ జెంది, నూత్నర
త్నముకురమధ్యబింబసమధామశరీరముతోడఁ గాన వ
చ్చెమదనదేవతం దలఁపఁ జేయునొ కానొక లేమ యామొగిన్. 47

అట్లు గాన వచ్చి, తన కనుంగుదంటనెచ్చెలి యొసంగెడుకయిదండ నంగీకరించి, వలుఁదపిఱుఁదులబరువునంజేసి యలసాలసంబు లగునెన్నడలహొయలునం జలియించు నడుగుఁజెందమ్ముల కెంజిగులం జగతి యెల్లం జిగిరించినట్లు గోచరింపఁ దామరదోయిని హాయిగా విశ్రమించినరాయంచపెంటిజంటకుం జత వచ్చెనునుద్గుంజితమణిమంజీరయుగళంబు మంజులంబుగాఁ బంచశరచాటుప్రబంధపారాయణంబు సేయుచుండ, జవజవలాడునన్నువకవుఁదీవియ కపాయంబు వచ్చునో యనుభయంబునంబోలె మొరయుచుం బొరలుమణిమేఖలాకలాపంబు నునుఁబట్టువలిపసరిగదువ్వలువను నెఱులు గొలుప, నలుపంబుగా నదుగునుదుటు బటువుగుబ్బలపయిఁ బయ్యంట కాసంత యోసరిల్ల, నెమ్మోముఁదమ్మికమ్మవాసన కాసించి పయిపయిం బొలయునలికులంబులయావలికిం గడు నులికినకలికికనుదోయితళుకుబెళుకులు నింగికి నీలాలు దాప, నుంగరంపుముంగురులకొసలు సోఁకెడునొసలికుంకుమలలామంబు మత్తాళిగాళులూనుమంకెనపూవుపొంకంబు సూపఁ, జూపఱకనుంగవలకు వెఱంగు వేడుకలం బరిఢవించునవ్యాజవివిధవిలాసంబులతో నాభాసురాంగి యస్మదభిముఖంబుగా నేగుదెంచెను.

కల—తరువాతఁ దరువాత?

మారు—అటుపిదపఁ దదాగమనసందర్శనకుతూహలంబునఁ దొందరగా లేచి మందాకిని, ప్రథమప్రధావితమానసుని నన్ను వెంటఁబెట్టుకొని, కొన్నియడుగులు నడిచి, యాకడ నాకుటింటిముంగిట, నేలకితీఁగలు గొఁగిలించుకొన్నగున్నచీఁకటిమ్రాఁకుక్రిందను గూరుచుండెను.

తరువాత—

ఉ. ఆకయిదండ యిద్దజవరాల్బొమసైఁగను దోలఁ జూప, న
న్నాకె విలాసవిస్మయమయామృతదృగ్ఝరిముంచుచున్, వితా
కైకనుపట్టియున్ నడుమ, నట్టిది కానటు లెట్టు లెట్లొ మం
దాకిని యున్నపట్టునకుఁ దా నరుదెంచెను మెల్ల మెల్లగన్. 48

కల—చెలికాఁడా! యిది చూడఁగా నామెహృదయమును గొండొకయనంగ
వికారంబునఁ జుంబితం బయినట్లే పొడకట్టుచున్నది.

మారు—వయస్యా! తత్సమయమున—

గీ. ఆమృగేక్షణ చేరువ యైనకొలఁది। నిబిడతమ మైనతత్కాంతి నేత్రగోళ
ముల సుధారసపూరంబు వోలె నింప।నవలఁ ద్రుటి యైనఁ గాన లే నైతి నేను.

కల—అహో! యట్టిమహాస్సంభారము మనుజమహిళాదుర్లభము గదా తరువాత?

మారు—ఉ. ఆపయి నెంతయేనియుఁ బ్రయత్నమునన్ సకలాంగకంబులన్
నైపుణిఁ జూపు నేఁ బఱపి, నవ్యవిలాససురద్రుమంజరిం
దాపున నాపెఁ గన్గొని, వితాకున నుండ, నసూయనోయనన్,
జాపము వంచి మోహనపృషత్కము కాముఁడు గ్రుచ్చె నాయెదన్. 50

కల—సఖుఁడా! యిందు కాశ్చర్య మేమి?

గీ. వదనవక్షస్స్థలీవామభాగములను। బ్రహ్మవిష్ణ్వీశు లెవ్వని ప్రభుతఁ బెనుతు
రాజగత్త్రయవిజయదీవ్యద్ధనుండు।మరుఁడొరుల నేయుటరయ విస్మయము గాదు.

మారు—తరువాత—

ఉ. నందనదేవతాళిచిఱునవ్వులపువ్వులదండ, బాలచ
న్నుందుగ్రవేలుధన్యముఁ గనుంగొనినాఁడ నొకండు; దాన నా
సుందరిమోముఁదమ్మిని నెసుమ్మురియాడు నళుల్, తదాశ్రమం
బందలిమ్రాఁకుదీఁగలలతాంతము లన్ని తృణీకరించుచున్. 52

కల—మిత్రుఁడా! యిదియు ననితరసాధారణ మయినయామెయాభిజాత్యమును
సూచించుచున్నది.

మారు—తరువాత—

ఉ. కోమలి యాక్షణం బచట గుబ్బలపై నరజాఱుపయ్యెదన్
వేమఱు ముద్దుఁగేలిమునివ్రేళులతో సవరించుకొంచుఁ, దా
సోమరిమారుతంబునను సుంత చలించెడునల్లగల్వచె
ల్వామడ నుంచుచంచలకటాక్షములం బొలయించె నాపయిన్. 53

మిత్రుఁడా! నే నాసమయమున నెంతో సేపు—

శా. పారాతీతవిలాసముల్ వికసితవ్యాజిహ్మముల్ మంథర
స్మేరాకేకరతారముల్ తరళముల్ స్నిగ్ధంబులున్ ద్ర్యస్రస

భ్రూరింఖంబులు పాశయష్టులవముల్ ముగ్ధంబు లౌనా మెకుం
గారోదారవిశాలనేత్రములకుం గాఁజాలితిం బాత్రమన్. 54

కల—(తనలో) ఈ నేత్రములవికార మకారణము గాదుగదా!

మారు—చ. అతులితవిభ్రమంబు లగునంబురుహాక్షిచలత్కటాక్షముల్
ప్రతిఫలితంబులై, యవయవంబుల నన్నిటిఁ గప్ప, నాయొడల్
హితుఁడ! సహస్రసంఖ్యగలదృక్కులు గ్రిక్కిఱియంగ నున్నత
చ్ఛతమఖమూర్తితోడ నెఱిసామ్యముఁ గాంచెను దత్క్షణంబునన్. 55

కల—ఇది యంతయుఁ దత్తరంగితదృష్టివిలసితము.

మారు—సఖుఁడా! నా కప్పటినుండియు నొకసందేహము గలిగియున్నది. నీ వది తీర్పవలయును విను.

చ. కరఁగుహిమాంశునిస్రుతులకై వడచల్లనితత్కటాక్షముల్
గురియుట నాపయిన్ మయి గగుర్పొడచెన్; సరి గాని, నాఁడ న
బ్బురమిది; మల్లెమొగ్గలను బోలెడుచెమ్మటబొట్లు గూడ నే
సరణిని నాకు నయ్యెదన, సంభవిలెం జెలికాఁడ! తెల్పుమా. 56

కల—(చిఱునవ్వుతో)

క. వనితకడకనుల కాహ్లా | దనతాపనములు నిసర్గధర్మము లందున్
మునుపటియది కడ నుండిన | వెనుకటి దడనున్నఁ, బడయు విపులబలంబున్.

మారు—అనంతర మితరులకుం గానరాకుండఁ, బ్రోడనెచ్చెలి వ్రేలితోడ సైగ సేయ, నించుక యులికిన ట్లయినమయిదీఁగతో, నాకెదురునేసినమొగంబును మందాకిని కభిముఖంబుగాఁ ద్రిప్పి.

గీ. అప్పుడారక్తకోకిలావ్యక్తమధుర | భాషణమున, నమోభగవతి యటంచు,
నన్నుఁ గ్రేఁగంటఁ గనుచు నే నవలయల్లఁ | జలితమధుకరమైనయాదలనువంచె.

కల—చతురత గలచెలిమికత్తియ కట్లు సముదాచారమునఁ బ్రవర్తింపఁ జేయుట సముచితంబె కదా!

మారు—చ. చేకొనునక్షమాలికను జెచ్చెర పీనుకొనం దగిల్చి, తా
నాకెవినమ్రమూర్ధమలనల్లనఁ దాఁకుచుఁ గేల, బిడ్డరో!
నీకు గుణానురూపుఁ డగునెయ్యపుభర్త లభించు నంచు, మం
దాకిని యిచ్చె దీవనను, నన్నవలోకనముం బొనర్చుచున్. 59

కల—దీనిచేత వయస్యుఁడే యనుగుణుఁ డని యామె గనఁబఱిచినది. తరువాత?

మారు—అటుపిమ్మటఁ గ్రమ్మఱ గృహమునకుం బోవఁ గృతప్రణామ యగు నామె
తో మందాకిని, బిడ్డా! యీతఁడు నిజనయప్రభావావర్జితసకలచతురంతవీరమణి
మకుటోల్లిఖితచరణపీఠుండును, త్రిభువనమంగళపుణ్యావదాతకర్ముండు నగు
కుంతలేశ్వరామాత్యునకు బ్రహ్మదత్తునకు, క్షీరవారాశికి నీహారాంశుండును, జంద
నగిరికి గంధవాహుండునుం బోలె సంభవిల్లినవాఁడు, సహజహారప్రకాండ
లాంఛనుండు, గౌరీప్రసాదలబ్ధుండు మారుతుం డను మంత్రికుమారుండు. ఈతనిని
కుశలప్రశ్నంబున నీవు సంభావింప వలయు నని యానతిచ్చినది.

కల—(విస్మయముతో) అహో! మందాకినీభగవతి మహాప్రభావురాలే. తాను
హిమాలయపర్వతకటకంబునుండి విచ్చేసిన దయ్యును, దన కపరిచితులయిన
తండ్రిగారిని దెలిసికొన్నది. వరలాభవృత్తాంతమును గూడ వర్ణించినదే.

మారు— తే-గీ. అట్లు నాయభిజన్మ మాయమ్మ పొగడ,
బాల నను వీడుకోల్వేఁడుభంగి దోఁచె,
నపుడు సానందసస్పృహాసానుయాచ్ఞ
సబహుమానసవ్రీడలోచనము చేత. 60

అంత నేనును, భగవతీ! సకలేంద్రియవశంకరం బయినయీపూజ్యురాలి
దర్శనంబుచేత నే సంభావితుండ నయినవాఁడను. ఈమె యింక నిజగృహంబు
నలంకరించి క్షణవిరహనిస్సహంబు లయినబంధుజననయనంబుల నానందంబు
నొందించును గాక. అనుటయు ససంభ్రమసౌవిదల్లసందర్శిత సరణి యగు
చు, నాశ్రమ సమీపంబున నున్నకర్ణీరథంబుసవిధంబునకు మామకీనమానసం
బుతో సపరివారంబుగా నిర్గమించినది.

మ. సరి మున్పా లిటు ద్రిప్పి మోమెడ నెడం జంద్రాస్య యేమేమొ నే
ర్పరి యామెంబడివచ్చు నెచ్చెలియతో భాషించుచుం నాలతో,
స్మరవేధోస్త్రసదృక్షమౌనిజకటాక్షం బక్కటా! నాహృదం
తరమం దోఁడక మాటిమాటికి సఖుండా! గ్రుచ్చి విచ్చేయుచోన్. 61

నా వేదన యేమని చెప్పుదును?

మ. భ్రామసింగాణి ననన్యసాయకసమంబుం దీక్ష్ణదీవ్యత్కటా
క్షమహాస్త్రం బరి నోసి యామె విడువం, గాయంబునం దాఁకి, నా
కమృతంపుంజడి యాయెఁగా యపు డనుంగా! దూరమై యిప్పు డా
యములం గోయక కోయుచున్న దది గాయం బేమి గాకుండఁగన్.

కల—(తనలో) అతిగాఢ మయినయీయభినివేశము మరలింప రానిదిగాఁ దోఁచుచున్నదే.

మారు—క. ఏవఁడిఁ గనుఁ జేరలఁ ద। ల్లావణ్యామృతరసంబులం గ్రోలితి నో
యా వేళ నె దా వైళమ। యా వెలఁది మదీయహృదయ మావేశించెన్.

(ఆశ్చర్యముతో)

గీ. ఉగ్రతర మైనమోహ రాహుగ్రహంబు। మ్రింగుచున్నది మామకహృదయచంద్రు
నైనఁ దన్మధ్యశాయిని యగులలామ। మృగియుఁ బోనిమ్ము గేక్షణ మిగులునహహా!

మఱి యిప్పుడు—

మ. నిలిచెదనో గమించెదనొ నే నిదురింతునొ మేలుకొందునో
తెలిపెదనో భ్రమింతునొ మదిం దురపిల్లుదునో సుఖింతునో
కలనొకొ లేనొకో యనుప్రకారము లిన్నిటఁ జేర నెందునున్ ;
జెలిమరి! యేదొ క్రూరపుటనిర్వచనీయవికార మొందుటన్. 65

కల—సఖుఁడా! యామెకులనామములు వినంబడెనా?

మారు—చెలికాఁడా! యామె యట్లు కర్ణీరథారూఢ యయి వెడలుచుండఁగాఁ, గుతూహల మున్నను నియమాతిపాతభీతిచేత నవ్విషయము మందాకిని నడుగ నైతిని. పిమ్మట నేనును నాయోగినికి నమస్కరించి వీడుకొని శిబిరమ్మున కేతెంచితిని. అయినను వేఱుగ వినుట యెందుకు?

క. అక్కన్యక మానుషియే। నెక్కుడుకులమందె జన్మ మొందఁగ వలయున్;
లక్కుమి పాలక్కడలిం గా। కక్కట పల్వలమునం దుదయ మొందెడునే?

కల—సఖుఁడా! విన్నదానిం బట్టి యూహించుచున్నాను. ఆమెహృదయము నందును గందర్పుఁడు ప్రవేశించినవాఁడు చూడు.

క. పులకలు మొలచుట, పయ్యెఁట। దొలఁగుట, బొమ లీల మెఁ గుదులుట, కటాక్షం
బులు చిలుకుట, పయనపుఁదఱి। మలఁగి కనుట, మగువమనసు మరగినఁ గుఱుతుల్

మారు—మిత్రుఁడా! విభ్రమనిధు లగునుత్తకాశినులకు నట్టిచేష్టితంబులు నైసర్గికంబులె గదా! అయిన నది యచిరముగ నే వెల్లడి కాఁగలదు.

కల—(చూచి యాశ్చర్యముతో)

పంచచామరము. తొఱంగి నూతనామృతస్రుతుల్ వితానసూనముల్
బిటాన నేల జుమ్మటంచు భృంగసంఘ మేగెడున్?

వెలఁగి దేమి తావి? నాసవిందు, ప్రాణబంధు వౌ
తెలఁగునన్ హజారమందుఁ దెర్లు గుప్పుగుప్పునన్. 68

మారు.—ఈమేదురామోద మాదరకంధరకుచమండలంబున సొగసు గులికెడు పుష్పమాలిక సౌరభమును బ్రకటించుచున్నది.

ప్రతిహారి.—(ప్రవేశించి నమస్కరించి) జేజే కుమార! యిదిగో దనచేతిలోని మరకతపుబరణినుండి బయలు వెడలెడుదివ్యపరిమళమ్మున ఘుంఘుమ్మనిరేఁగి, నిజాగమన మార్గమ్మునఁ దుమ్మెదలదిమ్ము గ్రమ్ముకొనఁగా, రెండవకాళింది యోయన నొకానొకవెలంది కుమారుని సందర్శింప వచ్చి ద్వారముకడ నిలిచి యున్నది.

మారు.—లోనికిఁ దీసికొని రమ్ము.

ప్రతి.—చిత్తము. (నిష్క్రమించుచున్నది).

మారు.—సఖుఁడా! నీ కిది యేమిగాఁ దోఁచుచున్నది?

కల.—ఈసౌరభ మద్వితీయము. ఆమె యామాలికయే నీకుఁ గానుకంపె నని నే నూహించుచున్నాను.

మారు.—ఓయి విశృంఖలమనోరథ! నీవు గగనలతాకుసుమమును శిరోభూషణముఁ జేయఁగోరుచున్నావు. కానీ, తెలియ వచ్చెడును.

(తరువాతఁ బ్రతిహారి దారిచూపఁగా ముందు చెప్పినట్లు కాళింది ప్రవేశించుచున్నది).

కాళిం.—(విస్మయమునఁ దనలో) ఔరా! మారుతునివారతనపురీవి యేవిధముగా నెసంగుచున్నది! దరిసించుట కరుగుదెంచి కావలివారిచేత నివారితు లయి క్రేవల నొదిఁగి యొదిఁగి మూఁకమూఁకలుగా నున్నరాకొమారులచేతను, బుస్సుబుస్సునఁ దొండంపుఁగొనలఁ బయికిఁ జిమ్మెడుతుంపురులగుంపులవలనఁ బగటిపూఁటన వినువీథి నక్షత్రచిత్రితంబు గావించెడుకావలియేనికలచేతను, దెఱపిలేక రాకపోకలు పచరించెడుగడనమించుఁబోఁడులకాళ్లల గల్లుగల్లు మని సందడించెడిరతనాలయందియల మ్రోఁతలచేతను, నీతనిహజారము మహారాజ ప్రతీహారమును బోలియున్నది. (నడుచుచున్నది).

ప్రతి.—ఈలాగీలాగు.

కాళిం.—(స్పర్శసుఖము నభినయించి) అహా! పట్టపగలే నామేనికిఁ బండువెన్నెల సోఁకునట్లున్నది; ఇది మారుతుని హారవల్లరిప్రకాశము గావలయును. (అపేక్షతో) ఈమహాభాగుఁడు ప్రియసఖి యగుమల్లికయెడల నెయ్యమును మఱవ.

కుండునా? (ప్రకాశముగా) ఇదిగో గుడారపు ద్వారము. (ఇద్దఱును బ్రవేశించుచున్నారు).

కాళిం—జేజే! మహాభాగ!

మారు—కల్యాణీ! యిటు విచ్చేయుము.

కాళిం—(కలకంఠునిఁ జూచి తనలో) కుందనంబుచందంబున, తెలపూవుకైవడిని బచ్చనిమేనిచాయ గలయీరెండవపడుచువాఁ డెవఁడు చెపుమా? (విమర్శించి) కలకంఠుం డని పేరు వడసినమారుతప్రియవయస్యుండు గానోపు. (ప్రకాశముగా) నేను మందాకినీభగవతిశిష్యురాల నగుకాళిందిని.

మారు—ఎఱుఁగుదును. ఆసమావేశమున నిన్నుఁ జూచి యుంటిని గదా!

కాళిం—మహాభాగా! నీ వింతకు మున్ను గనుఁగొన్నయాకన్యకామణి, భగవతికిఁ బ్రాణసమాన, మాకుఁ బ్రియసఖి. ఆయిందువదన కందర్పసుందరుని నిన్ను సందర్శించినతోడనే చందమామయుదయమునఁ గలువతీఁగలాగున నుల్లసిల్లి, విస్మయానందపరవశురాలయి, యిల్లుసేరి వెంటనే తనకంఠదేశమున బ్రేలునీపూలమాలిక నిత్యాభినవము, మహాభాగునకుఁ దగి యుండు నని పుత్తెంచినది. కుమారా! యామె నిట్లు ప్రణయచపలురాలిని గావించినది, ప్రథమదర్శనమాత్రదత్తవిస్రంభంబు, నవిజ్ఞాతాహంకారపేశలగంభీరంబు, హృదయాపహారియు నగు నీయాకారమేగాని, కులకన్యకావిరుద్ధ మగుప్రాగల్భ్యము గాదు సుమీ. (బరణిమూఁత దీయుచున్నది).

మారు—(జనాంతికముగా) సఖుఁడా! నీయూహ సరిగా నున్నది.

కాళిం—(మాలికను జేతితోఁ బట్టుకొని) ఇదిగో నది.

మారు—కాళిందీ! మీప్రియసఖి యత్యుదారురాలు సుమీ. ఒక్కమాఱు సందర్శించిన యీజనునియం దామె యీమాడ్కిని బ్రసాదము గనఁబఱిచినది. మఱి తెలుపుము. ఆమె యెవరివంగసము నలంకరించినది? అట్టిది యేభంగినిలభించినది?

కాళిం—(అంతటఁ జూచుచున్నది).

మారు—చందనలతా! నీవు నీనియోగమున నుండు

ప్రతి—(నమస్కరించి) చిత్తము. (నిష్క్రమించుచున్నది).

మారు—ఇతఁడు నాప్రాణమే.

కాళిం—మహాభాగ! యాలకింపుము. దిగంతవిశ్రాంతధవళకీర్తిసమృద్ధులవలనఁ దృష్ణాచపలచకోరవారంబునకు నేపుణ్యుఁడు నిరంతరాన్నసత్రంబు లుత్పాదించె

నట్టివిశ్వావసుండు దివస్పతికి బృహస్పతియునుంబోలెఁ జంద్రవర్మమహారాజున కమాత్యుం డయి యున్నవాఁడుగదా !

మారు—ప్రజ్ఞాగాంభీర్యసత్యసత్వనిధిని మహానుభావుని విశ్వావసు నెవ్వ రెఱుఁగరు ?

కాళిం—ఆయన సంతానము లేనిదోషమున రేయుం బగలు మలమల మఱఁగెడు మానసంబుతోఁ, గోమలచరణాంగుళిపల్లవపర్యస్త మహిషాసురమస్తకయు నేతత్కుసుమపురోపకంఠవాసినియు, నగుగౌరీభగవతి నతిభక్తి నారాధింప నారాధింప, నొక్కనాఁ డాయనస్వప్నమందు దేవి, వత్స ! విశ్వావసుఁడ ! యసాధారణం బగునీభక్తికిఁ బెద్ద మెచ్చితి. దివ్యమాలికాచిహ్నమగుకన్యకారత్నము నొకదానిని నీ కొసంగితిని. తెల్లవాఱఁగానే నీవు నాయుద్యానవనములోనికిఁ బోయితివా యచ్చో నది గానవచ్చును ; దెచ్చుకొమ్మని యానతిచ్చెను.

మారు—(విస్మయానందములతో జనాంతికముగా) సఖుఁడా ! నిజముగా నామెయే తత్కన్యారత్నము.

కాళి—తరువాత నామంత్రిశేఖరుండు హర్షపరవశుం డయి వఱువాత లేచి యాచోటి కతివేగ మేగిన, నప్పూఁదోఁటలోని కొండొకమల్లెతీఁగ మొదలం జివురుసెజ్జపయి, సంజకెంజాయను జాబిల్లికళవలె నొకకన్యకామణి సౌందర్యఖని వికచప్రసూనదామలాంఛిత గానవచ్చినది. వెంటనే విశ్వావసుండు మెత్తని తత్తనువుతాఁకున నొడలెల్లను బులకరింప నాముద్దుబిడ్డ నెత్తుకొని తీసికొనిపోయి, మల్లికామూలమున లభించుటంజేసి మల్లిక యని నామకరణంబుఁ జేసి తనకుటుంబిని యగుకమలాదేవిచేత సమర్పించినవాఁడు.

మారు—(జనాంతికముగా) మహానుభావుఁడు విశ్వావసుఁడు మంచిపేరు పెట్టినాఁడు. అది యుక్తమే.

తే. గీ. మల్లికామూలమందు సంభవము నొందె ;
మందహాసంబు మల్లికాసుందరంబు ;
గమనవైఖరి మల్లికాక్షంబె గానఁ
జాన మల్లిక ; దీన సంశయము గాన. 69

కాళిం—ఆమెయే మాప్రియసఖి. ఇదియే యామాలిక. (మారుతునిచేతికి మాలిక నిచ్చుచున్నది.)

మారు—(గరుపాడుపుతోఁ దనలో)

చ. జిలుఁగమృతంపుఁదుంపురులు చిందుచుఁ జందుగకుంకుమంపుఁబూఁ
తలయొరపిల్లచే నెఱుపు దాలుచునీచెలిపూలమాల, హా!
మలమల గామవహ్నిసెక మాఁడెడునాయెడ లర్కతప్తముం
గలువను బొడ్పఁగెంపు గలకాముదివోలెను దొప్పఁదోఁచెడున్. 70

(ప్రకాశముగా) జనకమహారాజు సీతాదేవిని, ద్రుపదరాజు యాజ్ఞసేనినిం బోలె నబ్జాలను బుత్రికనుగాఁ బడసినమహానుభావుఁడు విశ్వావసుఁడు విశ్వశ్లాఘ్యుఁడు గదా! అహో! యాపూజ్యురాలిదాక్షిణ్యాతిశయము! అపాంగలవమునకయిన ననర్హుఁ డగునీజనునియందు, సహజమాలికాప్రదానముననే మహాప్రసాదముగానఁబఱిచినది.

కాళిం—(తనలో) ఈయన యెంతమధురముగాఁ బలుకుచున్నాఁడు! అయినను గమలాకరము మకరందముఁ జిలుకు నన నేమి యాశ్చర్యము? (ప్రకాశముగా) మహాభాగ! మాప్రియసఖిజీవితమునకును నీవు దగినవాఁడవు; మాలిక యన నెంత?

మారు—(జనాంతికముగా) చెలికాఁడా! యిందు కనురూపముగా నామె కే నేమి యంపుదును? హృదయ మీవఱకే యిచ్చివేసితిని గదా!

కల—(చిఱునవ్వుతో) మిత్రుఁడా! సహజమాల్యమునకు సహజహార మే యనురూప మయినది.

మారు—హృదయజ్ఞ! నామనోగత మే నీవు నుపన్యసించితివి. ఇదినిశ్చయముగా నామె స్తనమండలమున నుండఁ దగిన దే.

తే. గీ. అతివకుచకలశాగ్రంబునందు హార | మిడినఁదరుణిమతరుణమత్తేభకుంభ
యుగళినక్షత్రమాలికయోజఁదనరు, నేర్పడినయారుమదరేఖయేపుసూప.

కల—కాళిందీ! మేమును నిన్నించుక ప్రార్థించుచున్నాము.

కాళిం—ఆనతిమ్ము మహాభాగ!

కల—(హారమును వ్రేలితోఁ జూపి)

ఉ. ముద్దియ! నాయనుంగుసఖుమోమునభారతిలేఁతనవ్వుజా
లుద్దిగ, మందరాగదళితోడుపఖండసమానతారముల్
పెద్దవి గల్గునీసరము, వేలుపురామణినాయకంబుడా
లద్దఁగ నొప్పు, యామునలహర్యుపసంగతగంగవైఖరిన్. 72

మారు—చెలికాఁడా! నీవు వర్ణనప్రవీణుండవు.

కాళిం—అయ్యా! యిది నే నెఱిఁగినదే. భగవతి దీనిని సహజ మని వర్ణించినది.

కల—కాఁబట్టి దీని నాపూజ్యురాలికంఠమునం దర్పించి కృతార్థముఁ గావింప వలయును.

కాళిం—(తనలో) మారుతునిఁ జూచినప్పటినుండియు మల్లిక యెంతో తహతహప డుచున్నట్లు గానఁబడుచున్నది. కాఁబట్టి యామె సంతాపము శాంతిపఱుచుటకు నిది మేమే కోరుకోవలసినది గదా! (ప్రకాశముగా) మీవినిమయ మత్యంతరమణీయము గదా! నేను దమ రానతిచ్చినట్లే కావించెదను.

మారు—(హారమును మెడనుండి తీసి) కాళిందీ!

క. కేవల మీహారమె కా। దావరవర్ణినికి, నన్ను నర్పణ సేయం
గావలె; నే నీవఱకే। యా వెలఁదిగుణాళి కమ్ము డయితిం; గయికో. 73

కాళిం—(హారము పుచ్చుకొని చిఱునవ్వుతోఁ దనలో) మహాభాగ! సత్యవచనుఁడవు గమ్ము. (ప్రకాశముగా) కయికొన్నదానను. ఆజ్ఞాకరణార్థము సెలవు తీసికొనియెదను.

మారు—మంచిది.

కాళిం—(నిష్క్రమించుచున్నది.)

మారు—సఖుఁడా!

ఉ. అంబవరంబునన్ సుకులమందుఁ దదుద్భవ మం చెఱింగినా
డం, బటువుంజనుంగవ బెడం గగు నామెప్రసజంబు నందితిన్;
గంబుశిరోధిభావము ప్రకాశము గామిని, నట్టు లయ్యుఁ, జి
త్తంబునఁ దాప మెప్పటివిధంబున నే యగు నాకు నిప్పుడున్. 74

కల—మిత్రుఁడా! మాల్యదానాదులచేతఁ దదనురాగమును బరిస్ఫుటమే యయినది గదా!

మారు—తే. గీ. మాల్యదానంబుచేత నెమ్మాడ్కిఁ జేయ
నౌను మన కిట రాగసత్తానిరూఢి?
నది తదౌదార్యమైన, సౌహార్దమైన,
నగును; సాకూతచేష్టిత మైన నగును. 75

(సంతాపము నటించుచు)

చ. వెలుపలియక్షిజాలములవెంట గ్రహింపదు తత్తదర్థముల్;
దలఁపదు వాసనావిరహితస్థితిఁ బ్రాగనుభూతవస్తువుల్;
దెలియనియేదొ తాపమున నెమ్మది గ్రుడ్డిది మూఁగదై పగల్
బలితపుటెండ మూర్ఛిలుతొవం బడి యుండు ద్విరేఫమట్లగున్. 76

(తెరలో నిద్దఱు వైతాళికులు) జేజే! జగన్నయనచకోరచంద్ర! యేతన్మధ్యందిన సంధ్య యుష్మదానందమున కౌను గాక!

ఒకఁడు—

ఉ. చెమ్మలు గల్గునేనుఁగులచెక్కుల నత్తమిలం, దొలంగెడుం
దుమ్మెద, గోరువెచ్చనిమధుద్రవముల్ గలతమ్మిమిద్దె; మ
చ్ఛమ్ములు సొమ్మసిల్లివడ, శైవలగర్భకుడుంగముల్ తడా
గమ్ములఁ జొచ్చుఁ జెచ్చెర వికర్తనుఁ డౌదలమీఁది కేగుదేన్. 77

వేఱొకఁడు—

చ. పలుకును నీరునీ రనుచుఁ బంజరకీరము డప్పిఁ; యంత్రపు
న్నిలయమునందు బుస్సుమనునీరకణమ్ముల నాను నెమ్మిఁ; దోఁ
టలఁ జెఱునీటికాలువలడాపునఁ బెంపుడులేళ్లు పండుఁ; శో
షిలి మిడియెండవేఁడిమిని, జెట్లమొదళ్లకుఁ బ్రాఁకు నీడలున్. 78

(ఇద్దఱు వినుచున్నారు.)

కల—(తనలో) కానీ. ఈయావేళమునకుఁ దలఁగించి, మజ్జనగృహంబునకుఁ గొనిపోయెదను. (ప్రకాశముగా) చెలికాఁడా! యెల్లచోటుల సంఘటితము లయిన ఘటీయంత్రములనుండి బుస్సుబుస్సన నెగయునీరధారల తుషారములచేత శీతలము లయినయారామవాతపోతములు వీతేర, సహ్యాతాపోదయ మగునీసమయమును విలోకింపుము.

మారు—(విలోకించి) సఖుఁడా!

ఉ. ఏదిరొ చూచునాస నెచటెచ్చటఁ జూ పొలయించుచున్న న
య్యాదెస నెల్ల నాకుఁ గన నయ్యెడుఁ గేవల మింత మాత్రమే,
జా దెసలారునోష్ఠమణి, స్వాంతము లాగెడు ముద్దునెమ్మొగం
బా దెలివాలుఁగన్నఁ లలసాలస మైనతదీక్షితంబునున్. 79

(సాభిలాషముగా)

చ. చెమటఁ గరంగ బొట్టిపుడు, సీవరులన్ సఖు లల్ల వీవఁగా,
సుమలతికాగృహంబున నె సుందరి యుండునొ; కాక, చేతులం
దమర మృణాళభంగవలయంబులు, యంత్రజలార్ద్రవస్త్ర యై,
కోమ, ఘనసారపాండుకుచగుచ్ఛత నుండునొ దారగీమునన్. 80

(నిట్టూర్పువిడిచి)

తే. గీ. రాగసూచకముగఁ జూచులాగు, నవ్వు
మోము గలలాగు, వెఱఁగునఁ బోవులాగు
చిన్నె లెసఁగంగ సంకల్పశిల్పి, చిత్ర
ఫలకమున లిఖియించినబాలఁ గందు. 81

ప్రతిహారి—(ప్రవేశించి) కుమార! మహారాజసన్నిధానమునకుఁ బంపఁబడినమన భ్రమరకుండు వెండియుఁ బట్టణంబునుండి చనుదెంచి, కోమలదుకూలముద్రితచిత్రఫలకహస్తుండయి, హజారమునయున్నవాఁడు. సింహళద్వీపాగతులయిననావికు లాచిత్రఫలకమును మనమహారాజునకుఁ గానుక వెట్టినారఁట.

కల—మహారాజు వాత్సల్యనిధి గావున విశిష్టవస్తు వని దానిని మనకుఁ బంచినాఁడు.

మారు—(జనాంతికముగా) సఖుఁడా! మనకుఁ జిత్రాంతరదర్శన మెందుకు?
"తే. గీ. రాగసూచకముగ" ఇత్యాదిపద్యముఁ జదువుచున్నాఁడు.

కల—(తనలో) అహో! యీయత్యాసంగము మరలింప రాకున్నది గదా! (ప్రకాశముగా) చందనలతా; చెలికాఁడు స్నానము నిమిత్తము లేచినాఁడు. భ్రమరకుని మజ్జనశాలకు రమ్మను.

(అందఱు నిష్క్రమించుచున్నారు).

గద్య. ఇది శ్రీపరమేశ్వరవరప్రసాదలబ్ధసరసకవితాధురంధర వడ్డాదిసాధువంశక్షీరనీరాకరరాకాసుధాకరాచ్చనామాత్యపౌత్ర హారితసగోత్ర పవిత్రగుణకదంబలక్ష్మాంబాగర్భశుక్తిముక్తాఫల సూరపరాజప్రధానతనూభవ విబుధవిధేయ సుబ్బరాయనామధేయాంధ్రీకృతమల్లికామారుతప్రకరణంబునందుఁ

ప్రథమాంకము.

సంపూర్ణము.

శ్రీరస్తు.

# మల్లికామారుతప్రకరణము.

## ద్వితీయాంకము.

(తరువాతఁ జేటి ప్రవేశించుచున్నది.)

చేటి—అయ్యో! దిరిసెనపుఁబువ్వుఁ బోనిమవ్వంపుమేను గలజవ్వని భర్తృదారిక, యగ్గలం బగు వేఁడివెలుంగుతీండ్రచేత—కాదు, వలకాఁకచేతనే యెంత యాతనపడుచున్నది! ధారాగృహమున మధ్యాహ్నమునఁగాఁ బ్రవేశించినది. ఎండవేఁడిమి చల్లాఱినప్పటికిని, వెలుపలి కామె యిప్పటికిని రానే లేదు. ఆ మహాభాగునిగుణవర్ణనములమూలమున నింతప్రొద్దు పోయిన దన్నసంగతి యామెకుఁ దెలియలే దని నేను దలంచెదను. (ఆసతో) ఆయన గూడ నిట్లే యుండునా? పరస్పరసదృశానురాగసంఘటనశ్లాఘనీయుఁ డయినమహానుభావుఁడు పూవువిలుతుఁడు గెలువనివా రెవ్వరున్నారు? (ముందు చూచి) ఇదిగోఁ గంకేళిక. ఇది మహాభాగుని పరిచారకునకు మనోహారిణి, కంకేళిపల్లవమువంటిపాటలదుకూలమును దాలిచి చాల సంతోషమున వివశురా లయి యీలాగే వచ్చుచున్నది.

(తరువాతఁ గంకేళిక ప్రవేశించుచున్నది.)

కంకే—(తనలో) ప్రియవయస్య యగునవమాలికవలన భర్తృదారికవృత్తాంతమును దెలిసికొనియెదను.

ప్రథమ—(సమీపించి) సఖీ! నీలో నీవే మేమో యనుకొనుచుఁ, దారసిల్లినను, నాతో మాట లాడక పఱ గెత్తుచున్నావు.

కంకే—చెలియా! ప్రవాళిక! కోపపడకే నేను వేఱొకపనిమీఁదఁ బోవుచు నాపరాకున నిన్నుఁ జూడ నయితిని.

ప్రవా—సఖీ! నీముఖరాగమునుబట్టి యూహించుచున్నాను. నీయుపభర్త భ్రమరకుఁడు వచ్చినట్టు లున్నాఁడు.

కంకే—(సిగ్గుతోడిచిఱునవ్వుతో) చెలియా! వచ్చినమాట నిజమే. అందుచేతనే గదా నాకింతసేపాలస్యమయినది. ఎన్నాళ్లకో కనఁబడుటచేత నేవేవో సల్లాపము లాడుచు నన్ను విడిచిపెట్టినాఁడు కాఁడు.

ప్రవా—సఖీ! కంకేళికను భ్రమరకుఁ డేలాగున విడిచిపెట్టఁగలఁడు? దానికేమిగాని, మఱి యతఁడు కుమారమారుతుఁడుగారి వ్యాపారమే మయిన నీతోఁ జెప్పినాఁడా? ఆయన కేమి తెలిసినదో? ఏ మనుచున్నాఁడో? ఏమి చేయు మన్నాఁడో?

కంకే—చెలియా! నాతో నిది యొక్కటిమాత్రము చెప్పినాఁడు. ఏదో యొక ద్వీపమునుండి చిత్తరువుపలక యొకటి వచ్చిన దఁట. అందులో మితి మీఱిన సౌందర్యము గలయొక కన్యక వ్రాసియున్న దఁట. ఆమెయాకృతిని దదేకదృష్టితోఁ జూచుచు మారుతుఁడు గారును వేఱొకచిత్రరూపము లాగునఁ జూపట్టుచున్నా రఁట.

ప్రవా—(తనలో) అయ్యో! ఫుటుక్కున నాశాతంతువు దెగిపోయెను గదా? పాప మీదీనురాలు తత్ప్రథమదర్శనమాత్రముననే, వేసంగి వేఁడిమిని మాఁడెడు నాఁడు నెమ్మిలాగున వేఁగిపోవుచున్నది. (ప్రకాశముగా) సఖీ! నీవు, మన సిక్కడ లేనిదానివలెఁ గనఁబడిన దానవు. నీవు బయలుదేఱినపని యేమి?

కంకే—చెలియా! యామాట చెప్పి యతఁడు, నేను గట్టుకొన్నయీతోఁపుఁజీర నాకు బహుమానము చేసి, తాను దన యేలికయానతిని భర్తృదారికను జూడ వలసినవాఁడయి తనరాకడఁ దెలుపుడు సేయుటకు ముందుగ నన్నుఁ బంపినాఁడు.

ప్రవా—(తనలో) ఈమాటచేత నాహృదయము కొంచె మూఱడిల్లుచున్నది. (ప్రకాశముగా) సఖీ! చీరమాట వచ్చినది గనుకఁ జెప్పుచున్నాను. ఇప్పుడు, రత్నపతి యనుపేరు గలసాహుకారులభర్త, సముద్రయీడు వచ్చినకన్నెపడుచు చన్నుమొగడకు దీటయినదంతపుఁగరాటమున నుంచి, యేదీవినుండియో తాను బదిలముగాఁ దీసికొని వచ్చినపట్టుఁజీరను బ్రభువు లగునమాత్యులవారికి సూడిదగా నిచ్చినాఁడు.

కంకే—సఖీ! నీ వది చూచితి వటే?

ప్రవా—లేదులేదు. ఆమాత్యులవారు దానిని జేత నందుకొని మూఁత దెఱవకయే "దీనిని మీమల్లికకు నిం"డని తత్కాలమున దేవిగారిని జూడ వచ్చిన మందాకినీభగవతి చేతిలోఁ బెట్టినారు.

కంకే—అట్లయిన దానిని జూచుట మనకు సులభమే గదా! అది యటుండ నీ. శంబరకునినిమిత్తము రాజుగారు నిర్బంధించుచున్నారే. ఆమాట యేమయినది.

ప్రవా—అయ్యో! దాని కమాత్యులవారు ప్రత్యుత్తరము చెప్పినారే. మల్లికకువరుని నిర్ణయించుటకుఁ గాత్యాయనీభగవతియే కాని యాయన ప్రమాణముగా రఁట.

కంకే—వానియాస కూల. మాబాగుగ నిరాకృతుఁ డయినాఁడే. మంచిది గాని నీ వెక్కడనుండి వచ్చుచున్నావో చెప్పు.

ప్రవా—ఇప్పుడు దుర్గాలయమునుండి వెడలి వచ్చినభర్తృదారికకు, మధ్యాహ్న సూర్యునియెండవేఁడిమిని వడ దాఁకిన దని విని సౌమ్యసిల్లి దేవిగారు నన్నుఁ బంపఁగా నాకన్నియవృత్తాంతమును దెలిసికొని తిరిగి వచ్చుచున్నాను.

కంకే—చెలియా! యటు లయిన భర్తృదారిక యిపు డెక్కడ నున్నదో చెప్పు.

ప్రవా—చెప్పుచున్నాను విను. తాఁకుడునుబట్టి యనుమానింపఁ దగినపటికపు గోడలందుఁ జుక్కలుగఁ దొలిచిన చందమామ నీరుఁగ్రోవులదారిని బయలుదేఱు యంత్రనారితుషారపుజడులవలనను, మెత్తనివట్టివేళ్లచప్పరముల వ్రేలాడఁ గట్టినసన్నజాజిపూవులదండలవలనను, జీలమండబంటి ముత్తియపురజపుటిసుకతిన్నియలం గావించినసన్నకాలువలం గెలంకులు గరంగిపోవం జలజల జాలుకొనుమంచిగందంపునీరిపాఱుడులవలనను, సొబగు మీఱుధారాగృహంబునఁ, జల్లనినెలతాలజగతిపయిఁ బఱచిన విరులపఱపున లేఁదూఁడుఁ దొడవులతోడియొడలు సేర్చి, వ్రేవను మోవుటనఁటాకువీవనం బూని ప్రాణంపునెచ్చెలి నవమాలిక యల్లనల్లన వీచుచుండఁ, గాళిందీముఖంబున మాలికాగాసవృత్తాంతము సాదరంబుగా నాలకించుచున్నది.

(తెరలో) సఖీ! కాళింది!

(ఇద్దఱు వినుచున్నారు)

ప్రవా—సఖీ! కేళాకూళికి నాకెలఁకునఁ గోకిలపంచమస్వరకోమల మయిన భర్తృదారికయాలాపము విన వచ్చుచున్నది. ఆమె ధారాగృహమును విడిచి ముత్యాలచవికకు వచ్చిన దని తలంచుచున్నాను. కాఁబట్టి పరిజన మిట నిలువ వల దని యాన తిచ్చినయామె వండనుమన ముండుట యుక్తము గాదు. (నిష్క్రమించుచున్నారు) (ప్రవేశకము).

(తరువాతఁ గాళిందీనవమాలికలు. సుత్కంఠిత యగుమల్లికయుఁ బ్రవేశించుచున్నారు)

మల్లి—తరువాతఁ దరువాత ?

కాళిం—తరువాత నన్నామహాభాగుఁడు సానునయముగాను సప్రణయముగాను నిటు లాన తీయఁగా, స్నానోపకరణములకయి త్వరపడియెడుగడనకత్తెల చేతులయందలి కుందనపుబిందెలవలనఁ బింజరిత మగు నాతపమునఁ బ్రకాశించుద్వారమునఁ నిట్లు చక్క వచ్చితిని.

మల్లి—(సాభిలాషముగాఁ దనలో) సఖీ! తోడఁబుట్టినదానా! మాలికా! నీవు ధన్యురాలవు. శ్లాఘనీయసౌభాగ్యురాలవు. మనమిరువురము నేకముహూర్తమున నే జన్మించినవార మయినను మనకర్మఫలములు వేఱు వేఱే కదా! ఇంచుక వికసించిన తాపింఛములాగునఁ జామనచాయ గలయాకోమలాంగునికంఠము నిశ్శంకముగా నీవు నిమిషములోఁ గవుఁగిలించుకొని సుఖ మున్నదానవు. (ప్రకాశముగా) సఖీ! యదృష్టవశమున మహాభాగుఁడు ప్రథమప్రణయమునకు భంగము గలిగింప లేదు.

కాళిం—సఖీ! యందుచేతనే శరత్తారావళిపాండర మయినసహజహారమును దనమెడనుండి స్వహస్తముతో, దీసి నీనిమిత్త మిచ్చినాఁడు. ఇదిగోఁ జూడు. (మల్లిక మెడలో హారము వేయుచున్నది).

మల్లి—(సంతోషమున గగుర్పాటుతోఁ దనలో)

ఉ. ఆయనదర్శనంబు మొద లాళులు చేయుహిమోపచారముల్
కాయము నేర్వ, నౌర్వశిఖిగా నతిమోహమునం దలంచు నే
నీయెడ నెంతుఁ జన్గవ శయింపఁ దడంగగ భవ్యహార మా
హా! యుడురాజమండలచయం బొడ లెల్లను గప్పినట్లుగన్. 1

నవ—సఖీ! కాళింది! విరిగలువరేకులతోరణము గోనినిద్దంపుసోగచూపుల పాలపముతోడ నమ్మహాభాగుఁ డెప్పుడు ప్రత్యక్ష మయ్యెనో యదియమొదలుగా ననుక్షణమును బగబగ మనుపచ్చవిలుతునిచిచ్చున నిచ్చలు భర్తృదారిక తోరపుటారాటముఁ బొందుచున్నది. ఏమిచెప్పుదు ? మంజులముగాఁ బలుకుపంజరపుఁజిలుకలతోడ మాటలాడదు. కమ్మదెమ్మెరలు పాలయుకేళీప్రాసాదముల నధిరోహింపదు. నర్మగర్భము లయినసహచరీసల్లాపములకు నవ్వదు. కేవలము మృణాళహారములను బూని ధారాగృహములఁ దిరుగులాడును. అరవిరిజాజిక్రొవ్విరులు గిలయ నెఱపినచిగురుసెజ్జల నత్తమిల్లును. లేఁత తామరపాకువిసనకఱ్ఱను విసరి ప్రసరింపఁ జేయుసిల్లనాయువునకు సొమ్మసిల్లును.

మాటలయందు మాటిమాటికిఁ దడఁబాటుఁ జెందును. క్షణక్షణము నతిప్రయాసమున నూపిరి పుచ్చును. మఱియు నిప్పుడు—

ఉ. వీనుల సారెఁ దక్కథలు వేయఁ బ్రసక్తిని దెచ్చుఁ; దాఁ బర
ధ్యాన మెదో ఘటిల్లినటు లయ్యెడు నిశ్చల మధ్యమధ్యమం
దానినమాత్ర హారము లతాంగి మరుచ్చలనీపయష్టిచం
దానఁ గనంబడుం బులకితండము మై మొలకెత్తి నొత్తుగన్. 2

కావున నీసిగ్గరికత్తియ మనోభవ మయినమన్మథావేశముఁ దానుగ మనకుఁ జెప్పదు. మనము చెప్పింతము. ప్రాణసఖులతోఁ జెప్పుకొన్నప్పుడే గదా సంతాపము సైఁపఁ జాలిన దగును! (మల్లికనుగూర్చి) సఖీ! రంజనము రాజలక్షణము; సేవ పరిజనలక్షణము, క్షేమ బంధువలక్షణము; నమ్మిక మిత్రలక్షణము. కాఁబట్టి దుఃఖులోఁ బొరలుచు నాడుకొనునీడునుండియు మేలుగీడులఁ బాలుపంచుకొనుజనమునందు మనసు దాఁచుట మంచిపని కాదు. అని కాళిందె పలుకుచున్నది. చెలియా! నీతలఁపులోనిది మాకుఁ దెలియఁబఱచి సంవిభాగమువలన సంతాపము తగ్గించుకో.

మల్లి—(తనలో) అయ్యో! నే నెన్నిసారులు చెప్పఁ దలఁచుకొన్నను సిగ్గు బొత్తిగ నన్ను నోరెత్తనీయకున్నది. అయిన నెప్పటికి నేని చెప్పెదను. (ప్రకాశముగా) సఖీ! యామహాభాగుని— (అర్ధోక్తియందే బాష్పరుద్ధకంఠియయి విరమించుచున్నది)

నవ—(జాలితో నెయ్యమునఁ గౌఁగిలించుకొని) సఖీ! నీవు వేఱుగ మాటలతోఁ జెప్ప నక్కఱ లేదు. వేఁడివెలుఁగు నెండను వాడఁ బాఱినదిరిసెపుఁ బూవు తీరు పోలిక దయనీయము లగునీయవయవములే తెలియఁ జేయుచున్నవి. మఱియుఁ బురుషోత్తమునియందు మహాలక్ష్మియు, భాస్కరునియందుఁ బద్మినియుఁ బోలె నేవానియందు నీ వనురాగము గూర్చితివో, లేఁబ్రాయము గలయా మహాభాగునిజన్మము సఫల మయినది గదా!

మల్లి—(నిట్టూర్పుతో) సఖీ! పరస్పరము లేనియనురాగము శోచనీయమే సుమీ.

కాళిం—సఖీ! మల్లికా! నీ వాలాగున ననఁ గూడదు. సదృశానురాగఘటనమునకుఁ బూనుకొన్న భగవానుఁడు సూనబాణుఁడు, తనయమోఘవిశిఖముల కాతనిని గూడ గుఱి చేసినాఁడు చూడు—

ఉ. నావలనన్ భవద్గుణగణంబులు దా వినునప్పు డక్షి బా
ష్పావృతి, మేన వెల్లఁదన మాననమందును వాడుఁ, జెంగటన్
గేవల మిష్టమిత్రమును, గ్రిక్కిఱియంగను వర్ణవర్ణమం
దావగ కానికిం గలుకుటందపుఁ జెక్కుఁగవన్ గగుర్పునన్. 3

మల్లి—కాళింది! సఖీజనంబు లూఱటకయి పలుకుకల్లమాట లిట్టివే యని నే నెఱుంగుదును.

నవ—సఖీ! సరె. అది కల్లమాట. మఱి దీని నే మనియెదవు? ప్రథమదర్శన విస్మయానందముల చేత విస్ఫారితోత్తానతరత్తారకాశాగోదరములయి, యీషత్తిర్యగ్జిహ్మితాపాంగరింఖణముల చేఁ దరంగితవిభ్రమము లయినలోచనములు, చంద్రికాలింగితదుగ్ధసాగరతరఁగశిథవళముగ్ధమధుర మయినకిరణసంతానమున నీకు సర్వాంగాభిషేచనము గావించినవి కావా? (చిఱునవ్వుతో) ఒకవేళ, మరకతగర్భస్నిగ్ధశరీరుఁ డగునాతనిఁ జూచుమహాళానాళిని నప్పుడు జరగిన యీసంగతి నీకుఁ దెలియనే లే దేమో? అయ్యెడ మందాకినీభగవతికి వందనముఁ జేయుట గూడ మఱచిపోయి, సముదాచారమునకుఁ దొలంగిన సంగతి నాకేళిద్రవేలికదలికవలన నెఱుంగ నయిన, నులికిపడి యెట్టెట్లో తెలివి దెచ్చుకొన్నదానవు గదా!

మల్లి—(సిగ్గు పడి నవ్వి) సఖీ! నన్నుఁ జక్కఁగా నుపాలంభించితివి.

కాళిం—సఖీ! సర్వథా నీ కనాశ్వాసనము గా కుండును గాక! ఆయన ముందుగా నీకాత్మార్పణంబు గావించుకొని, తరువాత హారము సమర్పించినవాఁడు.

నవ—కాళింది! దానక్రమంబుననే ప్రియసఖియుఁ బ్రతిగ్రహించినది సుమీ. మహాభాగునే ముందుగా డెందమునం దారోపించుకొని తరువాత హారమును ధరించుకొన్నది.

మల్లి—(సంతోషముతో హృదయమును జూచి) మహాభాగ! సకలజనచిత్తవిత్తములను బలాత్కారముగా నెత్తుకొనిపోవుమహాకృపణునకు నీకు నౌదార్యము కూడ నుండుట యత్యాశ్చర్యము గదా! త్రిభువనైకమండన మయిననిన్నే నాకు దయచేసితివి. కాఁబట్టి తహతహపడుచున్ననాకన్నులకు హారము నెట్లట్లు నిన్నుఁ గూడఁ గనఁబఱుపక పోయితివా, నీమాట ముమ్మాటికి బూటకమే.

నవ—(జనాంతికముగా) కాళింది! పాప మీపడుచు నాపలుకు నిజమనియే తలంచినది, కానీ. ఈమె నించుక యాడించెదను. (ప్రకాశముగా) సఖీ! మల్లిక!

“ తీరఁ గనఁబడిన నీమె నన్ను మన్నించునో మన్నింపదో ” యనుననుమాన
మున మహాభాగుఁడు పయికి రాక మనసులోనే దాఁగి యున్నాఁడు.

మల్లి—సఖీ! య ట్లయినయెడల నుదయించుచుఁ గదా చందమామ చెందొగతీఁ
గను బరీక్షింపవలయును! ఆమహాభాగుఁడు కాన రానికారణమ్మునఁ గుమ్మలోఁ
గ్రుక్కినట్లు నే నెంతకుములు చున్నానో నాయవస్థ నీ వెఱుంగవాయేమి ?

ఉ. ఆతనిఁ జూచు కోరిక మహాధి యొకానొకఁ డేర్చు దారుణం
బై; తతమోహ మింద్రియచయంబు గలంచుచు మూర్ఛపుచ్చు; సా
ద్వైతితనేకగాహి యయి, ధారగఁ గొండొకతెల్వి హెచ్చు; నే
లా తెలుపంగ నుడిగ్ ? గను నిదంత హృదంతరవర్తి యాతఁడే. 4

నవ—(జనాంతికముగా) కాళిందీ! చూడు. భర్తృదారిక యనురాగప్రకార
ము మహారమణీయముగా నున్నది.

తే. గీ. రాచిలుక తేజిరౌతు నారాట మెల్ల
ముద్దుముద్దుగ వర్ణించి ముద్దరాలు
లోనఁ బ్రియుఁ డున్నహృదయంబుపైని భావ
మంథరసభావ్యదృష్టి వేమాఱు నిలుపు. 5

(విషాదముతో) అయ్యో! యింద కేమిగతి ? ఈమెకు ధైర్యనాశముతోఁ
గూడ మదనావేశ మావిర్భవించినది.

(ప్రకాశముగా) సఖీ! యిప్పుడు నీహృదయమున నున్నతఁడు భావనామా
రుతుఁడు.

మల్లి—(సిగ్గుతో) అయ్యో! భావనామారుతుఁడే ? నేను మాధురాల నయి
యథార్థమారుతుఁడే యనుకొనుచున్నాను. అకలంకహరిణాంకసుందర మయిన
యాతని ముఖబింబమును మరలఁ జూచుట యెన్నఁ డయిన సంభవించునా?

నవ—సఖీ! నీ వింత బెంగ పెట్టుకోకు. లోకమున నుత్కంఠ గలజనులు ప్రతికృ
తిదర్శనాదులవలన సులభముగా మనస్సును వినోదపెట్టుకొందురు గదా.

కాళిం—సఖీ! నవమాలిక యథార్థము చెప్పినది. ప్రియజనోత్కంఠాతత్పరమాన
సుల కెల్లఁ దద్గుణవర్ణనమును, దద్భూషణలాభమును, దత్ప్రతిచ్ఛందదర్శనం
బునుగదా మహావలంబములు.

మల్లి—సఖీ! పరమేష్ఠి తీఱికతో మనసున సృజియించిన చక్కఁదనము గలయా
మహాభాగుని ప్రతిచ్ఛందమును నేను జేతితో నే తీరున వ్రాయఁగలను. అయిన

ను జేత నయిన రీతిని బ్రయత్నించెదను. చిత్రశాలమునుండి రంగులతోఁ గూడఁ జిత్రఫలకమును దీసికొని రా.

నవ—మంచిది. (లేవఁ బోవుచున్నది)

(ప్రతిహారి ప్రవేశించుచున్నది)

ప్రతి—ఇదిగో! దంతపుబరణియొకటి చేతఁ బట్టుకొని మందాకినీభగవతికిఁ బ్రియశిష్యురా లగుసారసిక వచ్చినది.

మల్లి—శీఘ్రముగ నెందుకుఁ బ్రవేశపెట్టవు?

ప్రతి—(నిష్క్రమించుచున్నది.)

మల్లి—సఖీ! తెత్తువుగాని క్షణముండు.

(తరువాత సారసిక ప్రవేశించుచున్నది)

సార—మల్లికావృత్తాంతము వర్ణించినప్పుడే తద్దివ్యాంబరాగమనముమాట భగవతి నాకుఁ జెప్పినది. అక్కటా! యకన్యక రక్కసునిచేతఁ జిక్కిన దనివర్ణించినప్పుడు నాయొడలు గడగడ వడఁకి పోయెనే! ఆసీమంతమణి యేల కనఁబడ దయ్యెనో? అది సోఁకినంతమాత్రమున మూర్ఛిల్లిన వారికిఁ దెలివివచ్చు నని భగవతి తత్ప్రభావ మానతిచ్చినది. (ముందుచూచి యానందముతో) ఇదిగోఁ దహతనాపడుచు మల్లిక ముందరి నేయున్నది. (తేటిచూచి) ఊఁహూ! మాలికాస్థానమున హార మభిషిక్త మయినది! "మల్లికయాకారములు స్మరవికారము చెప్పనే చెప్పినవి" యని భగవతి యథార్థమే యానతిచ్చినది.

చ. వడలియు నింపులై, పసిమిఁ బాండిమ నొప్పుచు, తేకు లిప్పుడిప్పుడె వికసించు కేతకిని బోలెడునీమెయొడల్ స్మరాధిఁ దెల్పెడు; విధిసృష్టికష్టము ఫలించుత మప్రతిమంబుగా; ముదంపడుదురు గాక డెందముల బంధులు యోగ్యవరోపలబ్ధికిన్. 6

మల్లి—(తనలో) అయ్యో! దుర్లభజనాభినివేశిని గదా నాయాశ.

సార—భగవతియాశీర్వాదములం బరిపూర్ణ.

మల్లి—(ఆనందముతో) ఏది

సార—నీ వేగదా!

మల్లి—రమ్ము సారసికా! కూర్చుండ వేమి?

సార—త్వరితముగాఁ బోవలయు నని. భగవతి యొక్కర్తే యున్నది. దుప్పలువ యున్నయీదంతపుబరణి యామె నీకుఁ బంపినది. (మల్లిక చేతి కిచ్చుచున్నది.)

మల్లి—(సబహుమానముగాఁ బుచ్చుకొనుచున్నది.)

నవ—సఖీ! ధారాగృహమందు నుండఁగా నక్కడకు వచ్చినప్రవాళిక యిది వచ్చినవిధము నాకుఁ జెప్పినది. దీనిని సింహళద్వీపమునుండి తీసికొని వచ్చి యమాత్యులవారికి రత్నపతి గానుక పెట్టినాఁడఁట.

సార—నిజమే. అదేయిది.

మల్లి—ఇప్పుడు భగవతి యెక్కడ నున్నది?

సార—అమాత్యులవారివలన శంబరకసంబంధమును గుఱించి యేమేమో యాలకించుచు నంతిపురమున దేవిగారియొద్దఁ గూరుచున్నది.

నవ—(వెనుకకుఁ దిరిగి) శంబరకుఁడు రాజముఖమున భర్తృదారిక సముగుచున్నాఁ డనులోకప్రవాదమును గూర్చి యని నేను దలంచెదను.

మల్లి—(గోఁతపడుచుఁ దనలో) ఎబ్బె! నన్ను మఱియొక్కఁ డెట్లు లడుగును?

సార—ఇఁక న న్ననుమతింప వలయును ప్రియసఖీ!

మల్లి—సఖీ! భగవతిసన్నిధికిఁ బోవుచున్నదానవు గనుక నిన్ను నేనుండు మనలేను.

సార—(నిష్క్రమించుచున్నది.)

మల్లి—సఖీ! యిఁక నిప్పుడు చిత్తరువుఁబలక తీసికొని రా.

నవ—సఖీ! భగవతి యంపినదుకూలము నొక్కసారి చూచి, చిటికలోఁ బోయి తీసికొని వచ్చెదను. (బరణిని దీసికొని వచ్చి మూఁత దెఱచి ప్రేలికొనతో దుకూలమును బయికిఁ దీయుచు విస్మయముతో)ఓహోహో! నాచేతి కిది లేఁత యరఁటిపిలుకవలన వెలికి వచ్చినవిడివిడని మొలకమొవ్వుటాకును దాఁకి నట్లున్నది. (హర్షముతో) కాళింది! భర్తృదారికగుబ్బలమీఁది పూలదండ కెట్టితావి యో దీని కట్టితావి గలిగి యున్నదే. (గడి విప్పుచున్నది.)

కాళిం—(విలోకించి కౌతుకముతో)సఖీ! కొంగునఁ జిత్తరువు గూడఁ గానఁబడుచున్నదే.

నవ—(తేఱిచూచి) చిత్తరువు మాత్రమే గాదు. చూడుచూడు. వీనులఁ దాఁకెడు సోగకన్నులతో మహాభాగుఁడే యిట లిఖింపఁ బడినాఁడే.

మల్లి—(విస్మయానందాభిలాషములతోఁ జూచి) సఖీ! నవమాలికా! నిక్కముగా నతఁడే.

శా. ఆకర్ణాంతదృశం బదే మొగ మదే యందంపుఁగంఠం బదే
మోఁకా ల్దాఁకుచుఁ బచ్చకంబముల సొంపుం గేరుబాహుల్ ; విశా

లాకారం బదె వక్షము; (చిఱునవ్వుతో)
అం దదె యహో! స్వచ్ఛంబు హారంబు; శుం
డాకాండప్రతిమంబు లూరు లవె; శోణం బంఘ్రియుగ్మం బదే. ౭

సఖీ! యింతేభేదము. కన్నులకు తెప్పపాటు లేదు గనుక నీతఁడు దివ్యపురుషుఁడు; అతఁడు మానుషుఁడు.

నవ—(నవ్వి) ముద్దరాలా! చిత్తరువున తెప్పపా టెట్లు లవున్?

మల్లి—నిజ మయినవాఁడు కాఁడా? అయ్యో! చిత్తగతునియందుఁబోలెఁ జిత్రగతుని యందును భ్రాంతి నొందుచున్నాను. (సిగ్గు పడుచున్నది)

కాళిం—సఖీ! నవమాలిక! యిది చిత్రవిన్యాసకౌశలము సుమా. నిజ మనియే నమ్మకము గలుగుచున్నది.

నవ—(చిత్తరువును దేఱి చూచి) సఖీ! యీరమణీయ మయిననిర్మాణవైఖరి భర్తృదారికాహస్తవిజ్ఞానవైదగ్ధి ననుకరించుచున్నది.

మల్లి—(సోత్కంఠానుస్మరణముగాఁ దనలో) దీనిని జూడఁగా నా కేదో తలఁపు వచ్చుచున్నది. (మరలఁ దేఱి చూచి) సఖులారా! చూడుఁడి చూడుఁడి. మహాదృష్టవంతురా లయినదేసిమీఁదనో యీయనకుఁ జక్కఁగా నారూఢ మయినగాఢోత్కంఠ గలిగి యున్నట్టు లాకారమువలన గోచరించుచున్నది.

తే. గీ. మొలకవెదురును బోని ముట్టాలుకుమేన
నొలసె బిసకాండసోదర మొందు చాయ;
కమలిన ట్లగ్గు నిట్టూర్పుగాలిఁ గెంపు
తునుకతులకింపు గలమోవిదొండపండు. ౮

(నిర్వేదముతో) అయ్యో! సఖీవచనసలిలసంసిక్త మయిన యీశాలతాంకురము మొట్టమొదటకే లూన మయినది. అక్కఱములతోఁ గాక, బాలచంద్రకలాపాండరము లయినయవయవములతోడనే యీమహాభాగుసిచేతఁ దనసౌభాగ్యాతిశయమును దెలిపించుకొనుచున్నయీపుణ్యభాగిని యెంతధన్యురాలో గదా! అయిన నామె నిష్కారుణురాలు. కాకున్న నీదృశావస్థయం దున్నయీయనయెడల నుదాసీనురా లేల యగును? (మదనపీడ నభినయించుచు ఖేదముతో నిట్టూర్పు విడిచి) అయ్యో! జేల హృదయమా! వేఱొకతెయందుఁ దగులుకొనినమనసు గలజనునిమీఁద మాటిమాటికి నేల వాలెదవు? నిన్ను నే నిప్పటికిని మానధనమునుగా నెంచుచున్నాను. కోరిక లన్నిసున్నయయ్యెనే! నీబిడియ మంత యెక్కడకుఁ బోయినది? నిన్ననవలసిన దేమి?

మన్మథునే దూషింప వలయును. ఈ నెన్నాఁడి రాకుండఁ గ్రొవ్వాఁడి నారసములతోడ నావన్నెకానియందు గట్టిగా బిగఁ గొట్టినవాఁడు వాఁడె కాఁడా? (ఆకాశమున లక్ష్యముంచి) భగవానుఁడా! ఆఁడుకూఁతులమీఁదఁ జేతిబలుపు నగపఱిచెడుపో టుకాఁడా! మన్మథుఁడా! నగరార్గళదీర్ఘభుజదండమండనుఁ డగునమ్మహాభాగు నకు నీవు నిశ్చయముగా భయపడుచున్నావు సుమీ. ప్రళయానలభీషణము లయి నా హృదయమును భస్మసాత్కృతము సేయునీసాయకము లక్కడనే యున్న భవదీయ రూపలక్ష్మీపాటచ్చరుఁ డగు నమ్మేచ్ఛలానిమీఁదఁ బడ కున్నవి గదా! కాదు. ప డుచునే యున్నవి. అందుచేతనే యేమెనిమిత్తమో, చక్కనిగడ్డపెరుఁగుముక్కవలె వెలవెల్ల నగుచెక్కిళ్ళతో నీయన గాన వచ్చుచున్నాఁడు. (కన్నీళ్ళతోఁ దేటి చూ చుచున్నది.)

కాళిం—(సకరుణముగా, జనాంతికముగా) అహహా! యేమియీప్రేమాతిశయము!

తే. గీ. తెలిసి యయ్యయియాకారములను జిత్ర
కాంతునందును నన్యసంగతిని వగచు
చామకనుదోయి, రోషవిషాదములను
స్నిగ్ధదమకంబులను జలించెడును మిగుల. ౯

(ప్రకాశముగా) సఖీ! నీవు చెప్పఁదలఁచిన మాట యయినపక్షమున నేను గూడఁ గొం చెము చెప్పఁ గలదానను.

మల్లి—(తనలో) స్నేహమాత్రదర్శిని యగునీమె వెండియు న న్నోదార్చు నని తలంచె దను. (ప్రకాశముగా) కాళిందీ! యేమని?

కాళిం—నే ని ట్లూహించెదను. ఎవ్వఁడో చేతివిన్నాణమును గనఁబఱుచుకొనుటకు మనసునందే కల్పించుకొన్న యొకానొకని నిందు వ్రాయఁగా ఘుణాక్షరన్యాయము న మహాభాగునియాకృతికిఁ బ్రతి వచ్చి యుండును.

మల్లి—సఖీ! నీవు తిన్నగాఁ జూడ లేదు. ఎవ్వతెయో మహాభాగునిఁ జూచుటవలనఁ బరవశురా లయి తనతహతహ నివారించుకొనుటకు సాధనముగాఁ దత్సమానురాగు నిప్రతిరూపమును బయ్యెదచెఱఁగున వ్రాసికొనియె నని చెప్పవలయును. చూడు. క న్నీళ్ళతోఁ గలసి కనులనుండి రాలినకాటుకబొట్టు లిక్కడ నంటుకొని యిప్పటికిని గాన వచ్చుచున్నవి.

కాళిం—సఖీ! యిది పొసఁగి యుండ లేదు. ద్వీపాంతరమున మహాభాగుని దర్శన మె వ్వతె కే నేలాగునఁ జేకూడును? మఱియు నిది ప్రత్యక్షవిరుద్ధము. నీవు ప్రభాతము

ననే గదా యాతనిఁ జూచినదానవు. అప్పుడీవిధ మైనయవస్థ గలవాఁడు గాఁడు. (చిఱునవ్వుతో) ఇప్పు డయినాఁడు.

మల్లి — (తనలో) ఈమెమాటలు యుక్తియుక్తములుగా నున్నవి. హృదయమా! యిం చుక యూఱడిల్లుము. (ప్రకాశముగా) కాళిందీ! యాకృతిసంవాదము సంభవిల్లు ను గాక. ద్వీపాంతరమందున్న చిత్రశిల్పి యీహారమధ్యమందలిమహేంద్రమణిని గూడ సెల్లు వ్రాయఁ గలిగినాఁడు.

కాళిం— (నవ్వి) సఖీ! నగ మగును, నగము కా దనునర్ధజరతీన్యాయము పనికిరాదు. చూడు —

క. సుకవిమతిఁ బోలి సఖి! చి। త్రకరునికరవర్తతూలి, తత్తద్వస్తు

ప్రకర మలక్షితతత్త్వము। సకలము నుల్లేఖనంబు సలుపు యదృచ్ఛన్. ౧౦

మల్లి — (సవితర్కముగా) అయ్యో! సందియపుటుయ్యాలయం దుండి నాడెంద మూర క యాందోళన మొందుచున్నది. (తనలో సంతర్ధైర్యముతో) కానున్నది కానిమ్ము. ఆయనం జూచుటకు వాఁచి యున్ననాకన్నులకుఁ బుణ్యావశమునఁ దత్ప్రతిచ్ఛంద ము లభించినది.

నవ — సఖీ! యెందులకును నీవు సందేహింపఁ బనిలేదు. "నీమాట ముహూర్తకికి బూట కమే" యని నీ వీయన నుపాలంభించితివి గదా! తనమాట నిలుపుకొనుటకే చిత్రమి షమున నీకుఁ బ్రత్యక్ష మయినాఁడు. నీవు వేఱుగా నాలోచించుటచేతఁ జింతిల్లు చున్నాఁడు. కాఁబట్టి మృణాళధవళ మయినహారముతీరున నీతఁడును భవదీయహృ దయసంగసౌభాగ్యమునకుఁ దగినవాఁడు. (పయ్యెదయందుఁ గదియించుచున్నది)

మల్లి — (ఔత్సుక్యస్మరణహర్షవితర్కములతో) ఏమిది?

ఉ. పయ్యెద యై మదీయకుచభాగము నియ్యది సోఁకినంతనే

యెయ్యదియో నాకబీజముగ నిప్పు డనుస్మృతి యంకురించెడున్;

దియ్యమునం దదీయ మగుదేహమె బిగ్గఁ గవుంగిలించిన

ట్లయ్యెడు మేను, చిత్రగతుఁ డౌ ప్రియసంగమమే లభించినన్. ౧౧

ప్రతీహారి — (ప్రవేశించి) భర్తృదారికా! బంగారుదారమునఁ గుచ్చిన దయి, చంద్రనిప్పులా గున దగదగ వెలుంగుచు, మడుఁగుఁబుట్టమున మూటుమడిచినను, వెలివిరిసి నలుఁగ డలఁ గడలుకొనియెడుకడిఁదిమినుకుల గుమికతనఁ దనయున్నతావు తేటతెల్లగాఁ గాన వచ్చెడు విడిమానిక మొకటి చేత నుంచుకొని భ్రమరకుఁ డనునొక పురుషుఁ డు, తన్నుఁ గంకేళిక తీసికొని రాఁగా గుమ్మముకడ నిలిచి యున్నవాఁడు. నేఁటి

యుదయమున మందాకినీభగవతియాశ్రమమందు మనము మరలి వచ్చునప్పుడు చూచినమహాభాగునియానతిని భర్తృదారికను జూచుటకయి స్కంధావారమునుండి వాఁడు వచ్చినాఁడని కంకేళిక చెప్పినది.

మల్లి—(సఖులముఖముఁ జూచుచున్నది)

నవ—(జనాంతికముగా) ఇది పాఁగియేయున్నది. వాఁడు కంకేళిక వేడుకకాఁడు. మహాభాగునియాభ్యంతరానుచరుఁడు.

మల్లి—కనకలతా! వానినిఁ దీసికొని రా.

ప్రతి—చిత్తము. (నిష్క్రమించి పూర్వోక్తభ్రమరకునితోఁ బ్రవేశించుచున్నది)

భ్రమ—(తనలో) నే నెప్పుడుఁ ద్రొక్కఁ దొలఁగనియీయమాత్యులవారిలోఁగిటియందుఁ గంకేళికమూలమున నాకు నేఁడు ప్రవేశము కలిగినది. (నడచి సశ్లాఘముగా) మాదొర మారుతుఁడుగారు మహోదారులు గదా! ద్వీపాంతరమునుండి వచ్చినదని తమకు మహారాజుగా రంపినబాలార్కపాటలము నీరత్నము నే యిచ్చినారు. అయిన నిట్లన నేల? తాదృశమాలికాదానమునకు జీవితమైన నుచితమైనదే. హారమన నెంత? మణి యన నెంత? (నిట్టూర్పు విడిచి) అయ్యో! కీమునకు మూలమైనయీచిత్తరుపలకను మహారాజుగారి కాసాహుకారిచ్చినాఁ డేలయులుపా యిచ్చినాఁడు? మహారాజుగారు దాని నీయన కేల పంపినారు? అది తేఁగానే కులగోత్రములు దెలియనియీసింహళద్వీపాగతచిత్రకన్యకను జూచి దగ్ధునివలె నేలినాతఁడు నాకస్థితదృష్టి నున్నవాఁడు అయినను నాకస్థితలకుఁ గులగోత్రము లుండునా?

ప్రతి—ఈమెయే భర్తృదారిక.

భ్రమ—(సానందముగాదనలో) బంగారుపేరులాగునను, సంపెంగ పూలదండలాగునను బాగు మీఱునీరామయే యామహాభాగురాలా? నిష్పందమంథరస్నిగ్ధలోచనములతో సామిమారుతుఁడుగారు చిత్తరువుఁ జూచుచున్న దీమెనే గదా! ఇందుచేత నాచిత్రకన్యకు స్తనమండలమున మాలికవ్రాయుట తగియే యున్నది. (సాశంసముగా) ఆయనమీఁద నెట్లో యీమెమీఁదఁగూడ నట్లు నగఁబాలువాలురమ్ములు చిమ్మినప్పుడుగదా మన్మథుఁడు! (కడుదాఁపునకుఁ బోక) అమ్మా! దండము.

మల్లి—(తనలో) ఆయనపరిజనుఁ డని వీనిమీఁద నా కెంతగౌరవము! వీం డ్రెంతపుణ్యము చేసికొనిరో! అతసీదళశ్యాములుఁ డయిన యమ్మహాభాగుని సఫలనిర్మాణములనఁదగినలోచనములతో సదాకొంకులేక చూచుచుందురు గదా! (జనాంతికముగా) కాళింది! తగురీతిని మాటలాడుము.

కాళిం—భ్రమరక! కొంచెము తేరువకు రా.

భ్రమ—(తనలో) వీరికిఁ బేరు కూడ నెట్లు తెలిసినది. (సమీపమునకుఁ బోవుచు న్నాఁడు)

ప్రతి—ద్వారముకడ నడుగులచప్పుడువలె నున్నది. నేను బోయెదను.

(నిష్క్రమించుచున్నది)

నకులు—ఉచితజ్ఞురాలు గదా కనకలత!

భ్రమ—(మల్లికను దేఱిచూచి తనలో) తామరతూండ్లవంటి వలుకఁబాఱినచెక్కిళ్ళ చేత నీమెయెుదీఁగ మదనవేదనను దేటపఱుచుచున్నది. (మరలఁ దేఱి చూచి) మే రుపర్వతశృంగమును గంగాతరంగిణి వోలె నేలినవానిముత్యాలపే రీమెకుచమండల ము నలంకరించినది. ఔరా! పేరు మాత్రమే కాదు. దొరవారు కూడ నీమె పయ్యె దచెఱఁగు నాశ్రయించి క్రీడించుచున్నారే!

కాళిం—భ్రమరక! మహాభాగు లేమి చేయుచున్నారు? ఆయన నోటిమాటలుగా న పరాహ్ణమున నీతో నేమయిన సెల విచ్చినారా?

భ్రమ—చిత్తము. వినుండి. రత్నపతి యనునోడబేరి మామహారాజుగారికిఁ గానుకగా రెండుమేలివస్తువులు సమర్పించుకొన్నాఁడు. అం దొకటి- సుందరాంగులనెఱికురు ల ధరింపఁదగినవెలలేని సీమంతరత్నము. రెండవది- లావణ్యమయ మయి యెల్లవారి చూపులఁ దనవైపునకు లాగుకొనునొకానొకచిత్రగతకన్యాకారత్నము.

మల్లి—(తనలో) అయ్యో! పయ్యెదమీఁద వ్రాసి యున్నమహాభాగుని ప్రతిచ్ఛందమును బరాకునఁ గప్ప నయితిని.

నకులు—(జనాంతికముగా) ఈరత్నపతియేయగునా?

కాళిం—తరువాతఁ దరువాత?

భ్రమ—తరువాత నమ్మణియుఁ, జిత్తరుపలుకయు, దంతపుబరణిలోనున్నయొకానొ కదివ్యాంబరము నీమూఁడును, సింగళపుదీవిచేరువలంక కీశాన్యదిక్కున మానిసియా డుగుజాడ లేక పాడుపడినకాఱడవినడుమను, గొనకొమ్మల నాకసము దాఁకు కొండొకమఱ్ఱిమ్రాఁకుక్రిందఁ బెద్దఱాతిబండమీఁద నున్న వయి, దారి దప్పి యట కే గినమాకంటఁ బడిన వని యతఁడు మనవి చేసినాఁడు.

(అందఱు విస్మయపడుచున్నారు)

కాళిం—(జనాంతికముగా) ఈదివ్యాంబర మదే యని తలంచెదను. (ప్రకాశముగా) తరువాతఁ దరువాత?

భీమ—తరువాత నాదివ్యాంబరముఁ గనంబఱుపకయే వసదనేమును బరిగ్రహించి తత్సవతి తనయిచ్చను బోయెను.

అందఱు—(తమలో) సంశయము తీఱినది.

కాళిం—తరువాత ?

భీమ—తరువాతఁ బ్రీతిచేత మహారాజుగారు రత్నమౌళివస్తువులు రెండు నాచేతఁ బంపఁగా, మాదొరగారు వానిని స్వహస్తమున నందుకొని, యాచిత్తరుకన్నియను వెలివిరిదమ్మిరేకునరులచేతఁ బోలె విస్మయానందనిర్భరము లయిననయనములచేత నర్చించుచుఁ, బెద్దయుంబ్రొద్దు తమ కెద్దియో తలఁపునకు వచ్చినట్లుండిరి.

మల్లి—(నిర్వేదముతో నిట్టూర్పు పుచ్చి తనలో) హా! నాజీవితమున కాధారమైనమనోరథమా! నీ కింక నీళ్ళుచుక్కలు విడువవలసినదే. (జనాంతికముగా) కాళింది! నీవు చెప్పినయుపపత్తు లన్ని విరుద్ధము లయి పోయినవి గదా!

కాళిం—(జనాంతికముగా) సఖీ! వచనశేషమును వినక ముందే యెందుకు వందురెదవు ? (ప్రకాశముగా) తరువాత ?

భీమ—తరువాత నాచిత్రకన్యకను సత్యమైనదిగానే తలంచికొని యాయన సారెసారెకు నారతనమును దనచేతితో నామె పాపట నుంచుచు వచ్చెను.

మల్లి—(జనాంతికముగా) సఖీ! వచనశేషమును గూడ వింటిమి గదా!

నవ—(తనలో) ఓమన్మథభగవానుఁడా! ముద్దరా లయినయీకులకన్యక హృదయమును దృఢముగా నమ్మహాభాగునియందుఁ దగులుకొలిపి, యాతనిచిత్తము వేఱొకచిత్తరియందు హత్తించితివి. ఇది కేవల మయుక్తము సుమీ.

కాళిం—(తనలో) ఏమిది! అయిన నీమాట ముగియ లేదేమో. (ప్రకాశముగా) అహో! మహాభాగున కామెయం దెంతయనురాగము! మఱి చెప్పుము. ఆయాకృతి యెవరిపోలిక నుండును ?

మల్లి—(ఆశంసముతో వినుచున్నది)

భీమ—ఇంతపర్యంతము నామెకు నెవ్వరు సాటి లేరనియే తలంచు చుంటిని.

మల్లి—(నిట్టూర్పుతోఁ దనలో) అందుచేతనే గదా మహాభాగుని కన్నులకు నేననర్హురాల నయినదానను.

కాళిం—ఇంకను, నేదో చెప్పఁదలఁచుకొన్నట్లు, నీవింతపర్యంతము నని వచించితి వేమి?

భీమ—ఇఁక నిప్పుడో (అర్ధోక్తియందు) ఉచితానుచితము తెలియదు. చూచినట్లు చెప్పుచున్నాను. (మల్లికను జూపి) ఈపోలిక నుండును.

మల్లి—(ఉచ్ఛ్వాసముతో) అదృష్టవశమున సదృశపదమునఁ గూడ నారోపిత నైన దానను.

ఇద్దఱు—(జనాంతికముగా) సఖీ! మహాదృష్టవంతురాలవు. అందు నీవే వ్రాయఁబడితివి.

మల్లి—సఖులారా! సాదృశ్యమాత్రమున నేనే యని యెట్లు నిశ్చయించెదరు?

కాళిం—నిన్నుఁ జూచి వేఱొకదాని ప్రతిరూపమును మహాభాగుఁడు చూడఁడని.

మల్లి—ఆహా! స్నేహము!

కాళిం—భ్రమరకా! యిం దనుచిత మేమి? నిప్పన్న నాలుక గాలదు. ఆకృతులకుఁ బోలిక లుండ వచ్చును గదా!

భ్రమ—కేవలముఁ బోలికమాత్రమే కాదు. నిజముగా నీయమ్మగారే యాచిత్తరువు నందు, మాదొరవారికిఁ గాను కంపినపూలమాలతోఁ గూడ వ్రాయఁబడి యున్నారు.

అందఱు—(విస్మయపడుచున్నారు)

కాళిం—(జనాంతికముగా) సఖీ! యింకను సాదృశ్యమాత్రమేమి?

మల్లి—(సానందముగా) సఖీ! ద్వీపాంతరమున నాప్రతిచ్ఛంద మెట్లు?

కాళిం—మహాభాగుని దెట్లో యట్లే. (ప్రకాశముగా) ఇది యాశ్చర్యము! తరువాత?

భ్రమ—తరువాత నిది నిక్కము కాదని ప్రియమిత్రుఁడు కలకంఠుఁడుగారు వారింపఁగా, నాసీమంతరత్న మటనుంచుప్రయాణమువలన మరలుకొన్నవా రయి యిది తత్రభవతికే తగిన దిచ్చి రమ్మని నా కానతిచ్చినవారు. (బట్టలోనుండి మణిని దీసి కాళింది చేతిలోఁ బెట్టుచున్నాఁడు)

కాళిం—భ్రమరక! మహాభాగునిమూలమున మాప్రియసఖి పరాధీనుగా లయినది. కాఁబట్టి యాయనయానతి నెఱవేర్చెదము. (మణిని బుచ్చుకొని మల్లికకుఁ జూపుచు జనాంతికముగా)

తే. గీ. కొమ్మ! బంగారుదారాన గ్రుచ్చి ప్రియుఁడు
పాటలం బైనరతనంబుఁ బంపినాఁడు,
మారశరవిద్ధ మై మూర్తిమంత మైన
సానురాగంబు నిజమానసంబు వోలె. ౧౩

మల్లి—(ఉత్కంఠతోఁ జూచుచున్నది)

(తెరలో)

చ. పడమటిభూధరంబుతటిపాటలరత్నము విన్న కెంపు, ని

క్యోడ నిడె బాష్పనమ్మిశ్రితదృక్కుల జక్కవపెంటి చూచుచుఁ,
గడనె వసించువల్లభునిఁ గానదు పేర్లోకవుట్టునం బలెన్
దొడర వివోహ మాత్మ, నెటు ద్రోవఁగ వచ్చును శావ మక్కటా. ౧౪

అందఱు—(వినుచున్నారు)

మల్లి—అయ్యో! వావలెనే చక్రవాకియుఁ దపించుచున్నది.

(మరలఁ దెరలో)

క. విడు చక్రవాకి! శోకము; । నెడఁదను దిట మూను; సైఁపు మీనమయరబున్;
జడియకుమీ దినమణియే । జడియున్ భవదీయ మైనశాపపుమూర్ఛన్. ౧౫

నవ—భర్తృదారికా! వీరె వైతాళికులు. అమాత్యులవారికి సాయంసంధ్య నుద్ఘోషించుచున్నారు.

భ్రమ—మహాభాగలారా! న న్ననుమతింపుఁడు. ఈవృత్తాంతమంతయు మాదొరవారితో మనవి చేసెదను.

కాళిం—నీ వీనాలుగిండ్లబవంతిదారిని వెడలి పొమ్ము. ప్రియసఖిని జూచుటకు దేవిగారును వచ్చుచున్నారు. ఇదిగో నందెలచప్పుడు వినవచ్చుచున్నది.

భ్రమ—(నిష్క్రమించుచున్నాఁడు)

నవ—మనము దేవిగారి కెదురు వోవుదము.

మల్లి—(తనలో) ఇప్పుడును హృదయ మనాస్థముగానే యున్నది. (విస్మయముతో) ద్వీపాంతరమందు నాప్రతిచ్ఛంద మెట్లని. (సంతోషముతో) కాళింది మాబాగుగఁ జెప్పినది. మహాభాగుని దెట్లో యబ్లేయుఁట.

భ్రమ—(హర్షముతోఁ దనలో) దొరయానతి నెఱపితిని. వికారములచేతను బ్రతిరూపధారణముచేతను దొరయందలియామెయనురాగమును దృష్ట మయినది. దొరభావమును బ్రకాశిత మయినది.

మల్లి—సఖులారా! పోదము.

(అందఱు నిష్క్రమించుచున్నారు)

ఇది శ్రీపరమేశ్వరప్రసాదనమాసాదితసరసకవితాధురంధర వడ్డాదిసాధువంశక్షీరనీరాకరరాకాసుధాకరాచ్చనామాత్యపౌత్ర హారితసగోత్ర పవిత్రగుణకదంబలక్ష్మాంబాగర్భశుక్తిముక్తాఫల సూరపరాజప్రధానతనూభవ విబుధవిధేయ సుబ్బరాయనామధేయాంధ్రీకృతమల్లికామారుతప్రకరణంబునందు ద్వితీయాంకము.

శ్రీరస్తు.

# మల్లికామారుతప్రకరణము.

## తృతీయాంకము.

---

(తరువాత మందాకిని ప్రవేశించుచున్నది.)

మందా—అహహో! విధాత్రనభిమత మస్మదానుకూల్యమున నే యున్నది!

తే. గీ. కలిగె నవ్యాజరమ్య మాగాఢతరస। మానరాగము మల్లికామారుతులకు;
దొరకె సీమంతరత్నంబు దువ్వలువయుఁ। జాటుచును వారియతిశీఘ్రసంగమంబు.

(కన్నీళ్ళతో)

తే. గీ. అకట! దివ్యాంబరంపుఁబయ్యంట గలిగి। చూళికామణి పాపటచోట వెలుఁగు
బిడ్డనెమ్మెను గాంచుచు వెనుకటి దగు। నీమెజన్మంబు నే స్మరియింతు మదిని.

(హర్ష వితర్కములతో)

చ. బిగితముఁ జెందె నెంతయును వెన్నటిపుట్టువునందె; యిప్పుడో,
పగదగమంచు వెల్గునది దర్శనలాభము వెండి గల్గుటన్;
విగళితభావముం గననిబిడ్డలయీయనురాగ మెంతు, బా
గుగను బదార్థ ముండువఱకున్ మనుమంజిటిఁగా మనంబునన్. 3

అనురాగతత్త్వవేత్త లిట్లెఱుఁగునఁ జెప్పుచున్నారు.

క. పరఁగును స్థిరప్రకాశ। స్థిరాప్రకాశాస్థిరతలచే, మేల్ నడి లోఁ
దరములు రాగములు యువో। త్క్రమమున మాంజిష్ఠనీలకౌసుంభములై. 4

(సభయముగా) మల్లికామదనాతంకమును గాళింది యిట్లు ప్రశంసించినది.

“ఉ. తూటి లతాకుడుంగమునఁ దోయజనేత్ర, చకోరినోరికిన్
జాఱు దళాంతరేందుకిరణంపుఁగణంబును గాంచి మూర్ఛిలున్;
మీఱుపికస్వరంబులను మెచ్చగుకేళినవాళికేమి? వే
మా ఱులుకుం గుహూమధురిమం ధరియించిన దౌనిజోక్తికే.” 5

వినయగాంభీర్యనిధి యగుమారుతుండును నాయెడల నిరుపధిక స్నేహంబును వ
హించినవాఁడు.

క. నుడుగు రహస్యముఁ, గార్యము। లడుగు, నజస్రంబు దర్శనాపేక్ష గనున్;
తడవులపరిచితిఁ బడయం। బడునమ్మకముఁ, బడసి కతిపయదివసములలోన్. 6

పాపమెండొరులప్రతికృతులను మాత్రమే చూచుకొని తమతహతహ నడఁచుకొ

న్న బిడ్డల కిద్దఱకును బునర్దర్శనముకొఱకుఁ గాళిందీసారసికలమాలమున నిపుణము గావసంతోద్యానమున సదుపాయము చేయఁబడియెను గదా! (సవితర్కముగా) ఇప్పుడు శంబరకునిమాయకుఁ బ్రతిక్రియ చేయవలయును. (ఆకాశమున) సర్వమంగళాచరణశేఖర! విశ్వవసూ!

బాగుబాగు! "కాత్యాయనీభగవతియే కాని మల్లికావరనిర్ణయమునకు నేనుబ్రమాణము కా" నని తియ్యన చెడకుండ నే రాజనిర్బంధనమును జక్కఁగా వదలించుకొంటివి. అయ్యో! శంబరకుననీతికౌటిల్యమును దలంచి నాహృదయమునాశ్వాస మగుచున్నది.

సార—(తొందరగాఁ బ్రవేశించి) భగవతీ! తమయానతి జరపితిని. భ్రమరకుఁడు మాత్రమే యొద్ద నుండునట్లు మారుతుని వసంతోద్యానమందలి పువ్వులగురివెంద పందిరిక్రింద నిలిపి వచ్చినదానను. నవమాలికాద్వితీయయగుమల్లికను బుష్పాపచయమిషంబునఁ గాళిందియు నక్కడకే తీసికొని వచ్చినది.

మందా—(ఆనందముతో) భూయోదర్శనమున బిడ్డలకు ననిర్వాచనీయమగు నాశ్వాసనము గలుగునుగాక.

తే. గీ. ఒకరొకరిఁ గౌఁగిలించెదుసుక మొసంగు। పూలచేరును హారంబుఁ దాలుచుటను, బ్రకృతిసుకుమారగాత్రుఁ లీవత్స లిద్ద । ఱొరిచెద రెట్లు లెట్లొ యీయూరటంబు.

బిడ్డా! విభ్రాంతిగొన్న కన్నులతోడను, వడవడవడఁకు చున్నయొడలితోడను జడిసిన దానివలెఁ గానఁబడియెద వెందుచేత?

సార—భగవతీ! మహారాజు నేఁ డమాత్యవిశ్వావసువుగారితో "నీవు గౌరీగృహంబునకుఁ బోయి మల్లిక యెవ్వని కీయఁ దగినదో యడుగవలసినది. ఆభగవతి శంబరకునికి ననినపక్షమునకు నిశ్శంకముగా నాదేవియాదేశముఁ చొప్పునఁ జేయవలసినది" యనియానతిచ్చినాఁడఁట.

మందా—(సాశంకముగా) తరువాత?

సార—పిమ్మటఁ "జిత్త మల్లే" యని రాజశాసనము వడసి రాజపురుషపరివృతుం డయి యిప్పుడే గౌరియాలయ మామంత్రివర్యుఁడు చొచ్చుచుండఁగా, నీలాగున వచ్చుచుఁ జూచినదాన నయి భగవతి కీవృత్తాంతము నివేదింపవలయు నని శీఘ్రముగా నేతెంచితిని.

మందా—(తనలో) అయ్యో! వెఱవవలసినదే సంప్రాప్త మయినదే! (ప్రకాశముగా) వత్సా! గౌరీదర్శనార్థ మిదిగో నేనును బయలుదేఱితిని. దారి తీయుము.

సార—ఇటు, ఇటు, భగవతి! (ఇద్దఱునడుచుచున్నారు.)

మందా—సారసికా! యతిప్రకట మయినమల్లికామారుతులయనురాగముఁ జూచి శంబ
రకుఁ డిదే దోయారంభించినాఁడు.

సార—మహారాజు కూడ వాని కనుకూలుఁ డని నే నడలుచున్నాను.

మందా—ఓసిబేలా! త్రిభువనదుర్లంఘశాసనురా లయినకాత్యాయినీభగవతి రాజశాస
నానువర్తిని గాదుగదా! (నవ్వి) సుజనులయెడల నిసర్గసుకుమారంబును ఖలులయె
డల నతిఘోరంబును గదా దేవిచరితము! చూడు—

తే. గీ. ప్రథమమున విశ్వజనని యపర్ణ, కరుణ। నద్రిపతికులమందుఁ దా నవతరించి,
యంగజవిరోధియర్ధదేహంబు గొనియె। నకృతకవిలాసలోభనీయాంగకముల. 8

సార—హారలలాటదహనభస్మితుం డగుకందర్పుండు విభ్రమకోమలంబు లయినదేవి
యపాంగములచేత వెండియు సంజీవితుం డయ్యెను గదా!

మందా—మరల నామెయే—

మ. అరిఘంటాదరశార్ఙ్గశూలశరబాహాదండసందోహ యై
కరివిద్విట్చటులాచ్ఛకేసరలసత్కంఠం బధిష్ఠించి సం
గరరంగంబునఁ జండరాక్షసశిరఃకాండం బసిం జెండి చె
చ్చెరఁ జెండాటకు నిచ్చుచున్ ప్రమథయోషిచ్ఛ్రేణి కేపారదే? 9

సార—భగవతీ! మహిషాసురశిరోనిర్ఘాతచరణకమల యగుచండికాదేవి పరాక్రమము
వాగగోచరము గదా!

మందా—అందుచేతనే యమ్మహామాయ యెడల నసురేంద్రులమాయయు నిరర్థకము. ఇఁ
క శంబరకునిమాయ కేమిలెక్క?

సార—ఇది సత్యమే. (ముందు చూచి) పన్నినకాఱ్మొగుళ్ళనుం బోలె నొత్తయినచీఁ
కటిమ్రాఁకులగుబురువలన దట్టముగా నిరులుకొనిన కాత్యాయనీదేవికోవెల యిదియే.

మందా—వత్సా! మన మిక్కడనుండియే వింపము. ఈవంచనావిశేషము దూరమున
నున్నవారికే తిన్నగాఁ గానఁబడును.

(తెరలో)

తే. గీ. అమ్మగో! నీకు మ్రొక్కెదఁ, గమ్మ సుప్ర। సన్నురాలవు కల్యాణి! శర్వరాణి!
నీప్రసాదంబుచేతను నేను గన్న। బిడ్డ కానతి యీవమ్మ దొడ్డవరుని. 10

మందా—(ఆకర్ణించి) ధీరప్రశాంతగంభీరస్వరుం డగువిశ్వవసుని ప్రార్థనము సుమీయది.
(మరలఁ దెరలో) వత్సా! విశ్వవసుఁడ! మల్లికకు శంబరకుఁడు దొడ్డవరుఁ డని తెలిసి
కొనుము.

మందా—(మరల విని) ఏమీ! యీయాకాశవాణి చీఁకటిమ్రాఁకులగుమురుపయినుం డి బయలువెడలి కరభస్వరంబులాగున ఘర్ఘరమయి వినవచ్చుచున్నది. (స్వరానుసారిగాఁ జూపునిగిడించి) సారసికా! చూడు మదిగోఁ దమాలవృక్షము చివరను గనఁబడి కనఁబడనట్టు లెవఁడో మనుష్యునివలె నున్నాఁడు.

సార—(చూచి) భగవతీ! నిజముగా మనుష్యుఁడే. నీలిగుడ్డ ముసుఁగు వేసికొని చీఁకటిచెట్లచిగురుగుత్తులలోఁ గలిసిపోయి కనఁబడుచున్నాఁడు.

మందా—అహో! శంబరకునియవినయము! నిసర్గశుద్ధహృదయుని విశ్వావసుని వంచింపఁ జూచుచున్నాఁడు.

సార—భగవతీ! మనము గర్భాలయము చొచ్చియిది యంతయు వెల్లడింతము.

మందా—బిడ్డా! కూడదు కూడదు. కాళిందికిఁ దక్క నీసంగతి మఱియెక్కడ వెల్లడింప రాదు సుమీ.

సార—అట్లయిన, నిందుకుఁ బ్రతిక్రియ యేమి భగవతీ?

మందా—బిడ్డా! వంచనమునకు వంచనమే ప్రతిక్రియ.

ఉ. కూటవిధానచుంచు వగుకుత్సితకార్యవిచారతత్పరున్
గూటచయంబుచేతనె నిగూఢవిధంబున మోసపుచ్చెదన్;
గాటముగాఁ బదంబులను గాఁడినకంటకసంచయంబులన్
బైటికిఁ దీయు టెంతొ సులభంబు గదా పటుకంటకంబులన్. 11

సార—సత్యము, ఒప్పు నిది భగవతి!

మందా—(అనుస్మరణముతో) మారుతుని ప్రియసఖుఁడు కలకంఠుఁడు విష్ణురాతునికూఁతును రమయంతికను గామించినాఁడు.

సార—ఔను. వారిద్దఱకు ననురాగమున్నదఁట. కలకంఠుని వీథిలో నుండఁగాఁ జూచి, ప్రియసఖి రమయంతిక నిరంతరకంతుసంతాపమున వేఁగుచున్నదని మధురిక నాకుఁ జెప్పినది.

మందా—రమయంతిక యిప్పుడు స్నానము నిమిత్తము సోమసరస్సునకు వెళ్ళియున్నది నీ విప్పటి యీయాకాశవాణీవృత్తాంతమును గాళిందిచెవిలోవేసి కలకంఠుని సోమసరస్సునకుఁ బంపింపుము. నేనును గాత్యాయనీభగవతిని సందర్శించి విశ్వావసున కీ భ్రాంతిని దొలఁగించెదను.

సార—అలాగే.

(ఇద్దఱు నిష్క్రమించుచున్నారు. విష్కంభము.)

(తరువాత నుద్యానవనమున మారుతుఁడును భ్రమరకుఁడును బ్రవేశించుచున్నారు.)

మారు.—తాచ్ఛీల్యమునఁ దారిద్ర్యమగు ననుమాట యబద్ధము కాదు.

మ. అదె ముగ్ధాళికిఁ డువో మదే చిగురుటాకౌమోవిమాణిక్య మ
య్యదె వాల్గన్న, యాయదే కుచగుళుచ్ఛాగ్రమా పాకాయ మ
య్యదె యొయ్యారపు నడ్పు, లోచనసుధాస్యందిప్రియారూప మ
య్యదియే యాయది యద్దిరే యద యటంచౌఁ దన్మయం బాత్మ హా. 12

(అంగటఁ జూచి) ఆహా! విరించనునిప్రపంచనిర్మాణప్రకార మియ్యెడ నత్యాశ్చర్య
జనకము గదా!

ఉ. బింబఫలాంచితంబు విషబింబకదంబము కంబునందు; న
క్షత్రములఁ గుంభికుంభములు; రంభలపైఁ బొలిసంబులుం; బరో
ష్ఠములు ప్రవాళ చంద్రముఖి లిన్ని మోములంగులు; లో
కం బఖిలంబు లొప్పెనుము; గాంచఁగ నబ్బుర మేది గాదిటన్. 13

భ్రమ—(చెవిలో) ఇదియే యున్మాదమునకుఁ బ్రారంభము. (ప్రకాశముగా) ప్రభు
వా! పూజ్యురాలినెన్నిన మీపాడిట సులభ మని సారసికపటునఁ దెలిసికొంటిని.

మారు—(స్మరించి హాస్యముతో)

క. విని ప్రియురాలి మాటలు మనమున నే నుండెలుఁగు మదనాకులుఁడన్
గని చంద్రికోదయంబును మునివా సార్ద్రపుష్కరోరమును బోలె నిటన్. 14

(నిట్టూర్పు విడిచి) సంశయవిషయము మయి తగ్గిన శ్రేష్ఠతయనురాగసత్వము లట్టిపరీక్షచే
నిశ్చయింప నభిలషించుచున్నారు. (సాశంసముగా)

మ. కువలయనేత్ర డెందమునఁ గూడ మరుం డిటు చొచ్చెనేని ని
క్కువముగఁ గూడ కుండినను గోరిక లన్నియుఁ దీఱు నంతనే;
రవి దివినుండుఁ బద్మిని సరస్సున; నైనఁ బరస్పరానురా
గవిలసదంతరంగితను ఖ్యాతమె కా మిథునాళ్య వారికిన్. 15

భ్రమ—ప్రభువా! యుపపత్తులచేత నిశ్చిత మైనపూజ్యురాలియనురాగమందు సం
దేహ మెందుకు?

మారు—రాగాంధచేతస్కులకు కుపపత్తులు నమ్మదగినవిరా. చూడుము.

ఉ. ఊహలు సేయుచున్ నయనయుగ్మమునందు నసత్యభావముల్,
మోహముచే ననున్మలపి మ్రుక్కిన యంచును రాగచంచలం
బై హృదయాభిలాషఁ బరాంగ్ముఖ ప్రకటించి, యూహఁ జి

వ్యాహత మాపరాభవము నంది వితా యనుతాప మొందెదన్. 16

భ్రమ—స్వామీ! సీమంతమణిని సమర్పించునప్పు డాపెపయ్యెదచెఱఁగున వ్రాసియున్న దేవరప్రతిచ్ఛందమును జూచితి నని మనవి చేసితిని గదా!

మారు—అంతలేని యదృష్టములకుఁ బాత్రమును గాఁ దలంచుకొను నాహృదయము సర్వథా యనాశ్వాసమే. చూడు. నీమాటను గూడ నూఱటనుగా నూహించుచున్నాను.

భ్రమ—(చిఱునవ్వుతో) స్వామీ! దేవర యిట స్వయముగాఁ జూచినను దమ కన్నులయందుఁ గూడఁ దమకు నాశ్వాసనసంశయమే యగు నని నే నెంచుచున్నాను.

మారు—(ఔత్సుక్యముతో) ప్రియురాలిరాకను బ్రతీక్షించుచున్న నా కన్నుల నిప్పు డేలాగున వినోదపెట్టుకొందును?

భ్రమ—ఏలికా! యాడుకొనుచున్న యీయావని సిరియడుగుఁదమ్ములలత్తుకరసమున జొత్తిల్లినలేఁజిగుళ్ళచేఁ గట్టెట్టి నగుచెట్లగుమురులవలనను, నల్లనల్లన వీతెంచు కమ్మదెమ్మెరలం దొలఁకుతేనెసోనలఁ దానమాడుపూవుఁదీవెలతావులకుం జుంజుమ్మని క్రమ్ముకొని బయ లప్పళించుతుమ్మెదలదిమ్ములవలనను, దియ్యక్రొమ్మావిమ్రాఁకులతలిరాకుఁదునుకల మెసఁగిమెసఁగి యొసఁగినగరువంబునం జెవులపండువుగాఁ బంచమస్వరకోలాహలంబు గావించెడుకోవెలలవలనను సొబగు మీఱు నివ్వసంతోద్యానంబుఁ జూచిన దేవరకుఁ గనువేడుక గాక పోవునా?

మారు—(నవ్వి) నీవు చెప్పినది చూడఁగాఁ బాముకు భయంపడువానిని బుట్టలోఁ దూఱు మన్నట్లున్నది. మన్మథునకు వెఱచుచున్న వానికిఁ దచ్ఛిబిరావాసము నుపదేశించుచున్నావు. చూడు.

చ. చివురులమేలుక ల్లెసఁగుచెట్టులు కావిగుడార్లు, తేఁటికూ
టువకరవాళికల్ గలభటుల్ చిఱుగాలులు, తారకాహళా
రవములు గండుఁగోయిల సొరంబులు, గావున సామి యౌవనో
భవమహిపాలుడామరపుఁబాళెము కేళివనంబు రూఢిగన్. 17

కాఁబట్టి మనశిబిరమునకుఁ బోదము పద. ద్వీపాంతరభూషణ మగుప్రియతమురాలి ప్రతిచ్ఛందమును దీసికొని రమ్ము.

భ్రమ—చిత్తము సామీ! ఉద్యానదేవతలారా మాఱేని కిప్పుడు మీరే సాయము

(నిష్క్రమించుచున్నాఁడు)

మారు—(కోరికతో) ఏసుకృతశాలి యామెయభినవరూపామృతము నాస్వాదింప

నున్నాఁడో గదా!

తే. గీ. ఏది పరిపాకమును బొంది యెవనిచేతఁ
జంచలేక్షణపాణిఁ బట్టించు జగతి;
నాతపస్యయె యుత్కృష్ట మాతపస్య;
యాతరుణుఁడె లోకోత్తరుఁ డౌతరుణుఁడు. 18

నిట్టూర్పుపుచ్చి) దుర్నివారప్రరోహ మయిననాయీమనోరథద్రుమంబునకు మందాకినీవచనంబు లుపఘ్నంబులు. మఱియు.

ఉ. అంపనిమ్రానిపం డనుచు నమ్మధురాధర నెంచి యయ్యొ! నా
బొందిని బ్రాణముల్ వెడలి పోవుచు, సారెకు నాఁగుఁ గంఠమం
దందుకు ముఖ్యహేతువు, గృహంబున కేగుచు మోము ద్రిప్పి, నా
యం దటు సాభిలాషపుఁగటాక్షము లాలలితాంగి చిమ్మటే. 19

(తెరలో) భర్తృదారికా! యిటు. ఇటు.

మారు—(చూచి యానందముతో) ఓహో! మదీయనయనచకోరచంద్రిక యగుమల్లిక నిశ్చయముగాఁ గాళిందీవనమాలికలతో నిటకు వచ్చినది. (పరిశీలించి సదయముగా)

చ. నలినలి నైనకోమలమృణాళముపోలిక నోపలేనిమై
నలఁగఁగ, మోవ రానిజఘనంబుభరంబున డయ్యుచున్, గటా!
పలుఁదచనుంగవన్ నడుము భంగుర మై కెరలన్, వెలంది కెం
దలిరులచంద మానిజపదంబులు గందఁగ నిందు వచ్చెడున్. 20

(ఆనందాతిశయము నటించుచు)

మ. స్మరునాగ్నేయశరంబులం బ్రహతమై, సంతాపశోకార్తులం
గర మిందాఁకను దీనభావముమెయిం గన్పట్టునాచిత్త మ
ద్దిర! యీముద్దియసన్నిధానమున, నెందే నిర్గతం బౌసుధా
ఝరి నోలాడెడుకైవడిన్ బరమహర్షం బొందుఁ దా నిత్తఱిన్. 21

నే నీతీఁగపొదరుమాటున నుండి యీమెను నిరభ్యంతరముగా వీక్షించెదను.

(అట్లు చేయుచున్నాఁడు తరువాత మల్లికావనమాలికాకాళిందులు ప్రవేశించుచున్నారు.)

మల్లి—(తనలో) ఇప్పటికిని నామనస్సునకు నమ్మకము లేదు. (విస్మయముతో) ద్వీపాంతరమున నాప్రతిచ్ఛంద మెట్లు? మహాభాగుని దట్లో యట్లే యని కాళింది

చక్కగాఁ జెప్పినది.

సఖులు—ఇటు ఇటు.

మారు—అతిశయామితసౌందర్య మయినయీమె శరీరము మేర మీఱినమారవికారము ను వెల్లడించుచున్నది.

ఉ. భావము లేనిదా పదపల్లవముం గమలించునూర్పు, బ్రా
హ్మావిని గిల్లఁ లేఁ దలిరుమాదిరి వాడినమేను, చారుపా
కానసరోల్లసల్లలితయంత్రముఁ గ్రిందికిఁ బ్రోయుపాండిమ
శ్రీవాసరారుచన్మోములు, చెక్కిలి, మిక్కిలియున్ స్ఫురించెడున్." 22

మల్లి—కాళింది! సందులేక, యంటట నిండి యున్నపుష్పగుత్తులచేఁ దలలు బొత్తిగ వంగిపోయినతీఁగలు గలయీప్రదేశమునే గదా నీవు సారెసారెకు వర్ణించుచు వచ్చెదవు?

మారు—క. శ్రీమదనుహారాపుఖసూజిత! నారాయణగ్రజన్మా! నాకౌవునా!
యారంగఁ గ్రోలుఁ డీగ, సు! ధారసధారానుకారితమణీభాషితున్. 23

కాళిం—(లోనలో) ఇక్కడ నేదో యొకలతానికుంజమున మారుతుఁడు దాఁగి యుండు నని తలఁచెదను (ప్రకాశముగా) సఖీ! నిజముగా నిదే. మధుసమయమునకు ముఖ్య సమయములయిన మధుకరసల్లాపములు సలుపుచుఁ, జిలుకలు కలిసి పనియింపుచుండఁ గోకిలతో నిన్నది యేలాగునఁ బిలుచుచున్నదో చూడుము.

మల్లి—అందుచేత మన మిక్కడనే పుష్పములు గోసికొందము.

(అందఱును బుష్పములు గోయుచున్నారు)

మారు—(ఆసతో మల్లికను దేఱి చూచి)

ఉ. ప్రసన్నమోము పై కుసుచి రాలెదుపుష్పపుచిక్కు సూర్య నా
గన్నులు ముగ్ధ నెన్నడుము గాసిలఁగాఁ గుచగౌరవంబునన్.
ప్రన్న నొకింత నాభి గనరా, ఘనకన్నెశితోరు నై, లవిం
చు న్నిలుమండి ప్రేళ్ళయి సుందరి, నామనసో ప్రసూనమో? 24

మల్లి—అన్నా! యేమిది? చిదిమినను బువ్వులు చేతిలో నుండకున్నవి?

నవ—సఖీ! నీహృదయము మఱియొకచోట నున్నది. ఇది మనము కోసి పిడిచిన నిష్కుసుమవల్లి గాదా?

మారు—ఔరా! నిజానయాసశోభావిభ్రమముచేతనే మల్లిక భ్రాంతిపడుచున్నది!

చ. వికసితపల్లవంబు లాపవించు మంచబోణి సరోజశోభిమన్

జికిలినఖాళిరోమల రచించుచు నచ్చపుఁబువ్వులన్ జక
చ్చకితకటాక్షలౌల్యమునఁ జంచలభృంగకులంబు సల్పుచున్
ముకురకపోల పూర్ఘ్యమున మున్ విడుతీవియ వెండి గైకొనున్. 25

మల్లి — (సిగ్గువడి నడిచి వేఱొకతీఁగ గయికొని సంభ్రమముతో) అమ్మయ్యో! దుగ్గలితము లయిన యీమొకరితుమ్మెదలు జూమ్మని యొక్కుమ్మడిని రేఁగి నామొగమ్మున మూఁగుచున్నవి.

మారు — క. చలహారలులితఘనకుచ। కలశయు, నవనారవిందగంధలహరికా
వలపళిఝంకృతిసంభ్రమ। విలోల, యీబాల లోభపెట్టెడు మనమున్. 26

నవ — సఖీ! పారిజాతపుష్పములపరిమళమును బరిహసించుగరువము గల నీనిశ్వాసవాసనలచేత నాకృష్టంబు లయి తీయమావిపూగుత్తుల సంపంగులఁ బొన్నలఁ బొగడలను విడిచి నీయెదుట నభోంగణము నరికట్టినవి. కాఁబట్టి చేతితో మోముఁదమ్మిని మాటుకొనుము.

మల్లి — (అట్లు చేయుచున్నది)

మారు — అవురా!

తే. గీ. చకితబాలకురంగలోచన నిజాన
నాంబుజాతము హస్తతలంబుచేతఁ
గప్పుకొనినను దుమ్మెదకదుపు లల్లె
ముసరు జూమ్మని బిసరుహంబుద్ధిఁ జేసి. 27

మల్లి — సఖులారా! వారింపుఁడు వారింపుఁడు. ఈదిక్కుమాలినతుమ్మెదలు నన్ను మఱల విడిచి పెట్టకున్నవి.

నవ — సఖీ! వెఱవకు వెఱవకు. దీనిని నేను వారించెదను (మల్లికను గౌఁగిలించుకొని వేఱొకచోటికిఁ గొనిపోవుచున్నది.)

మల్లి — (కన్నులు దెఱచి) అదృష్టవశమున నెట్టెట్టో యీతుమ్మెదలయలజడికిఁ దలంగితిని.

కాళిం — సఖీ! కోమలాంగి! మల్లికా! నీ పీపూవులు గోయునాయాసమున మిక్కిలి వాడి పోయితివి. కాఁబట్టి చల్లనినీడ గలిగి చదు నయినయేదేని యొకతీఁగమొదలను గొంచెము సేపు విశ్రమింతము.

మారు — ఈమె యలసినమాట సత్యమే.

ఉ. ఊరుపు దోర మాట దెలియుం జనుగట్లు చలించు చుంట, రం

ఘారచిరోరువేపథువు వ్యక్తమ యుచ్చలదంబరంబునన్,
హారిముఖాంబుజంబున శ్రమాంబుకణంబు పరిస్ఫుటంబె, లా
క్షారహితంబు రక్తిమము గానఁబడుం గరపల్లవంబులన్. 28

మల్లి—నీయిష్టము.

కాళిం—సఖీ! దక్షిణమున నిదిగోఁ బటికపుఁబాదున నున్న నీతల్లి యగుమల్లికావల్లీమతల్లిని విలోకింపుము. గౌరీవచనమునఁ దండ్రిగారి కమాత్యులవారికి నీతీఁగ మొదలవే గదా నీవు దొరకితివి.

మల్లి—(సస్నేహముగా) అమ్మా! మ్రొక్కుచున్నాను.

మారు—(సబహుమానముగా)

తే. గీ అఖిలజననేత్రభృంగసేవ్యతను, గాంతి
పూరమకరందమయతను బోలుచున్న
యీకలికి నీకుఁ గలికయై యొసఁగుకతన
లతిక! మీఱెదు మందారలతిక నీవు. 29

నవ—భర్తృదారికా! యరవిచ్చినపువ్వుగుత్తులనుండి పూఁదేనియ జాలువాఱునీవల్లిక, యంకోపవిష్టను నిన్నుఁ జూచుటవలనఁ జన్నులు చేఁపినదానివలెఁ గాన వచ్చుచున్నది. కాఁబట్టి యీతీఁగ మొదలను గూరుచుండము. (అందఱుఁ గూరుచున్నారు)

మారు—(ఔత్సుక్యముతో)

క. పరిపాండుమనోహరనిజ। శరీరకథితాంగభవరుజాభర యగుసుం
దరి రాగహేతు వెఱుఁగం। ద్వరపడు నామది విలంబనంబును జేయున్. 30

కాళిం—సఖీ! పూవులు కోసినబడలికవలన సమితోన్నమితము లగు బిగువుటిబిగుబ్బలబరువునం జేసి యసదుఁగౌఁదీఁగ యల్లలాడ, వాడుదేటి చెమరించెడుమోముఁజందమామతోఁ గానవచ్చెడు నిన్నుఁ గవుంగిలింపఁగోరి క్రొన్ననలతేనియం జల్లనయినస్పర్శము గలయీదక్షిణమారుతుఁ డుపసర్పించుచున్నవాఁడు.

మల్లి—ఏమీ! మహాభాగుఁడు మారుతుఁడా? (తొట్రుపాటుతో లేవఁబోవుచున్నది)

మారు—(సంతోషముతో) అహో! భగవానుఁ డయినమన్మథుని ప్రసాదాతిశయము! విశృంఖలప్రసరణంబు లయిన మనోరథంబులకుం గూడ నగోచరం బయిన యానందము ననుభవింపఁ జేయుచున్నాఁడు.

(ఉచ్ఛ్వాసముతో)

ఉ. మందమరుత్ప్రసంగమున మారుతుఁ డన్న మదాగమభ్రమన్

దొంతర, ప్రేమ, సిగ్గు, పరితోషసముత్సుకతల్ జనింప, స
స్పందకుచోరుభారముగఁ జయ్యన లేచుమృగాక్షిశారద
స్పందరవక్త్రచంద్రుఁ గనుఁగొంటి నహో! సుభగుండ నే మహిన్. 31

(సస్పృహముగా)...నిన్నుఁ గౌఁగిలింపఁ గోరి...మారుతుఁడుపసర్పించుచున్నాఁ
డని కాళింది యథార్థము చెప్పినది.

చ. ప్రణయిని నీమె నల్ల శోకభంగి నోడిం గదియించి కౌతుకం
బును ద్రపఁ బారవశ్యమును బొందినదై ప్రథమస్పృగుద్భవ
స్తనజఘనస్థలీపులకసాంద్రత నొప్పెడుబాల, హాయిగాఁ
గనికర మూని మానియును గౌఁగిట నే నిఱియింపఁ గోరెదన్. 32

(విమర్శించి నిర్వేదముతో) అయ్యో! నాహృదయ మకాండతాండవము చేయుచున్నది
పరిశ్రమాలసురాలయిన యీముద్దరాలికి సమీరణాగమనము మాత్రము సముత్థానకా
రణము గాక పోవునా?

కాళిం——(మల్లికపయ్యెదకొంగుపట్టుకొని) సఖీ! లేవకు లేవకు. నేను మందానిలమును
గదా వర్ణించితిని!

మారు——(పరిత్యాశతో) ఇందు కీమె యే మనునో?

మల్లి——(లజ్జతోడను విషాదముతోడను) సఖీ! మోసపోయితిని.

మారు——ఓహో! నాసంశయతంతు విప్పటి కుచ్ఛిన్న మయినది. హృదయమా! నీమ
నోరథములు సత్యములే చూడు.

క. కాదంబిని! కాదంబిని! యనెడుచాతకంబునకుం, దూ
ర్పుఁదువలె దర్పకుం డి। పైపదలిఁ గామించునీకుఁ బక్షంబయ్యెన్. 33

మల్లి——(కాళింది పట్టుకొన్న తనపైఁటకొంగునందలి ప్రతిచ్ఛందమును జూచి) సఖీ!
విరహకాతరుఁడీమారుతుఁడే కాని, యీమారుతుఁడు నాకు సులభదర్శనుఁడు
కాఁడు గదా!

మారు——(ఆనందముతో) పయఁటకొంగునఁ బ్రతిచ్ఛందమును జూచితి నని భ్రమరకుఁ
డు చెప్పినమాట సత్యమే.

క. ప్రియురాలిగబ్బిగుబ్బల। పయ్యెదలి సుఖించునాదుప్రతిమానమ! ని
శ్చయ మీవే ధన్యమ వే। నయినం దద్విరహభరదహనదగ్ధుండన్. 34

నవ——(నిట్టూర్పుపుచ్చి) భర్తృదారికా! నీ వీలా గెంతకాలము గడపెదవు? చూడు.
నానాఁటికి విరహపరితాపమునఁజేసి కృశించి కృష్ణపక్షశశాంకమూర్తివలె

లావణ్యమాత్రశేష మయినతనువల్లితోఁ గాన వచ్చుచున్నదానవు. విరహిజనుల ప్రాణములను బలాత్కారముగా నపహరించెడు నిర్ఘృణవ్యాపారుఁడయినమన్మథుఁడు కాలక్షేప మిటుమీఁదట సహించువాఁడు గాఁడు. కాళిందీ! యిది నీ వెఱింగినదే గదా! ఏనాఁ డాశ్రమమున, సవిలాసఘూర్ణనశీలము లయిన నిద్దంపుఁగినీసికలు చుంబించునంచలంబులనిగ్నిగలు కపోలయుగళముఁ గలువపంబులు నినుఁ, ముద్దామకుతూహలలజ్జావస్థితము లయినగమనాగమనములు గల విలసితమువమసురమ్యమంథరాక్రాన్తిమితతరంగితకూజితోత్కంఠపృష్టిపాతములు నీభర్తృసారిక, సాకార మైనదినదినపరివసితగౌరీప్రసాదమునుబోనవానిఁ దత్కాలసన్నద్ధుఁ డగుమకరధ్వజుఁడు బాహుప్పళించి యించువింట సంధించి గిడించిన నోడలఁ దూఱిననారసములపింజలో యన దట్టంపుఁబులకలు మొలకలెత్తుటం జిటిలినమయికలపము చెమటవెల్లువను గరఁగి లావణ్యాతిశయము బయలు పడ, నవలోకించెనో నాఁడుమొదలు, తచ్చింతావలంబన మయినహృదయమును, దత్ప్రతిచ్ఛందదర్శనాలంబన మయిననయనమును, దద్భాషణధారణాలంబన మయినశరీరమును, దల్లాభప్రత్యాశాలంబన మయినజీవితమును గలిగి ప్రదీప్తపావకతాప్యమాన యగుచామీకరశలాకయుం బోలెఁ బరిక్షీణ యయ్యును సవిశేషరమణీయతను గానవచ్చుచున్నది.

మఱియు లోఁగిటియంకణమున నేని జరియింప నోపనియడుగుఁదొగుసులతో మానికపుసోపానములపరంపర నారోహించుటం జేసి, కంపించుచున్నజఘనమండలముల భారమున నోరువఁ జాలక కోమలోరుయుగళము కళవళింప, బయలు వెడలు నిశ్వాససమారుతములు పర్యంతలతాపల్లవముల నల్లలార్పఁ గ్రీడాపర్వతశిఖరము నధిరోహించి, మజ్జనావముక్తము లయిన వాహోత్తంసముల ఖురపుటముల రేఁగుధూళిపరాగమున సన్నివేశము గాన వచ్చుతదీయస్కంధావారము నవలోకించుచు, నీవు ప్రచూర్యమాణగంభీరమృదంగఘోషమునకు సాభిలాషముగాఁ బింఛములగ్గి, సముద్రమధ్యగర్జజ్జలధరమునుఱుమునకు మయూరియునుబోలె హర్షించి, నిస్పందవికసితలోచనోత్పలకిరణతాపింఛితగగనాంగణముగా దినదినము నటఁ బెద్దయుం బ్రొద్దు నిలుచుండును. తూఁగుటుయ్యాల ద్రొక్కుటయుఁ దూలుబంతి లెక్కించుటయు లోనుగాఁ గలక్రీడాసాధనము లమరఁ గడఁగుట బొత్తిగ దూర మయ్యెను గదా! పరిజనము పాదములమీఁదఁ బడి బతిమాలుకొను ప్రతిబంధముచేతను గదా పూఁట పూఁట స్నానపానాదులఁ బ్రవర్తించుట! గట్టివాలు గేలఁ బూని కాసఁబఱిచెడు

మంగళముకురమునఁ బ్రతిఫలిత మగు తనమొగమునే కనుంగొని రేవెలుఁగను భయమున వడవడ వడంకి నిడుదయూర్పుగాడుపులచేత దానిని మలినముగాఁ జేయు ననఁగా, సుధారసబిందుసందోహమును జిందించుచుఁ గరాళజ్యోత్స్నావర్ష సంజీవితజీవలోక మగు చంద్రమండలమును గన్నెత్తి చూడ దని వేఱె చెప్పవలసిన దేమి? కేళీగృహమౌక్తిక భిత్తికిరణసంపర్కమునం గాను జంద్రాతపభీతి యుపయించి ముగ్ధకిసలయకోమల మయినకరతలము నాతపత్రము గావించుకొనుచుండును. పన్నీటఁ గలిపినపచ్చకప్పురపుఁబూఁతల శీతల మగురతనాలనెలకట్టున సమకట్టిన పూలపానుపుమీఁద సిసిసిసి నెమ్మేను సేర్చి యుపధానోత్తానిత మగుకేలుఁదమ్మి నత్తిమిల్లినపాండురగండమూలమున నపాంగదేశబాష్పధారాసిక్తమానమునఁ జికురాంచలము లలమికొనఁగఁ, గెమ్మోవిని గమలించుచు దుస్సహముగా వెలువడియెడు నిశ్వాసపవనములవెల్లున మంగళదీపశిఖాపల్లవము లల్లలాడ, గృహదేవతలు సమానదుఃఖముతోఁ దారుణవేదనావిశేషమును గన్నులారం గాంచుచుండ, నడికిరే యతిక్రమించినను గన్నువాలయక వేఁగివేఁగి, యెట్టకేల కట్టెట్టో కునుకు పట్టిన స్వప్నసంభావితప్రియసంగమ యయి యున్మిస్పృష్టఘర్మసలిలసేకమున నొడలఁ బులకతంతులు మొలక లెత్త నిస్తులస్తనప్రదేశమునఁ గనుపట్టు కోమలహస్తయుగళస్వస్తికముతో నీఃద్వంబిత-స్వరచ్ఛితల నిశ్వాసనివేదితానందవిశేష యగుచు, క్షణమాత్రము నిశ్చలత్వమునఁ గానవచ్చి, యనంతరము మందమందముక్తసీత్కారపూర్వకముగా దంతకుందజ్యోత్స్నాకుసుమితబింబాధరము మాటుకొన నొకకేలును, నొండొంటిని గెంటెముగాఁ బెనవేసికొని చెమరించెడుతోరంపుఁదొడగవను నలిగులి యగుసితంబసుకూలమున నించుక విడివడినపోఁకముడిని బట్టుకొన వేఱొకకేలును బ్రసరింపఁ జేసి, యపరిస్ఫుటాక్షరముగా నేమేమో గొణఁగుకొనుచును " నాథా! మారుత! నన్నేల విడనాడి పోయెద " వనుచును మేలుకాంచును ఇది యంతయునీకుఁ బ్రత్యక్షమే కదా!

నిన్నటియపరాహ్ణమున నీ వాశ్రమమునకు వెళ్ళినప్పుడు సాయంతనమజ్జనోత్తీర్ణలగుకుసుమపురసుందరులకు కులకొనలనీటితుంపురులబరువున మంథర మయి, యప్పుడే విచ్చుచున్నవిచికిలముకుళమ్ములు గుమ్మరించు కమ్మతావుల మోసికొని తెమ్మెరకూనలు మలయుచుండ, నేమికతమో యాకస్మికముగా దిగ్గనలేచి బిగ్గ నా మెడఁ గౌఁగిలించుకొని " సఖీ! నవమాలికా! యిదియే నాకడసారికౌఁగిలింతగా నెంచుకొమ్ము. తెల్లవిరిసమ్మిరేకులను దెగడువెడఁదకన్నులు గలయాపరవ్య

సనాథభిక్షు జనునితో జన్మాంతరమందేని తనకే కూర్చుదానఁగా నెంచుకొమ్మని వి న్నవింపుము. అనుచు బాష్పగద్గదకంఠముతో సందేశము చెప్పి మరణమునందుఁ గృతనిశ్చయ యయి, భవనాంగణమునఁ బెరిఁగి తరుణిమగర్వితకేరళవిలాసినీరద నాంశుకసౌభాగ్యలాభశ్లాఘనీయ మయి రోలంబఝుంకారసంకుల మగు బాలకంకే ళిపల్లవకుడుంగమును గెంగేలను స్పృశియింప సాగెను.

కాలిం—(కన్నీటితోఁ, గర్ణములను మూసికొని) సఖీ! తెగుదారి యగునామగువవృ త్తాంతమును నే నింకిట వినంజాలను.

నవ—సఖీ! విను. అటుమీఁదట "భర్తృదారికా! యిట్లయినపక్షమున మే మంద ఱము గూడ నగ్నిహోత్రమునఁ బ్రవేశింతు" మని యొట్టుఁ బెట్టుకొని నిటలాం బుజపర్యస్తచికురబంధముగా నమస్కరింపఁగాఁ, జెలిమికత్తియలు మగు మానిర్బం ధమునఁ గొండొక దాక్షిణ్యము వహించి యెట్టకేలకుఁ దా నచ్చటనుండి మ రలి వచ్చినది.

మారు—(సంతోషముతోడను జాలితోడను)

ఉ. ఎంతయు నైజజీవితముచోట నపేక్షను బూననట్టి యై
యెంతయు మక్కువం దెలుపు నీలలితంపువిచేష్ట లక్కటా!
కంతుదురంతతాపమున గాఢతరంబుగఁ గ్రాఁగునట్టినా
స్వాంతము సంతసంబును విచారము నుం బొరయించు నిట్టెడన్. 35

(మరల సకరుణముగా) ఓహో! యిది మహాప్రమాదము

ఉ. బాలమృగాయతాక్షి నవపల్లవ ముగ్ధశరీర మారునం
జాలను గాలిచేఁ గదలి జాఱెడు జాజిసుమంబుపాటునన్;
శైలకఠోరకూటసమసారము గల్గిన వారిప్రాణముల్
డీలు వడంగఁ జేరెడికడిందివి తద్విధమేషుబాణముల్. 36

నవ—పెక్కులేల? కంఠగతప్రాణ యయి మరలమరలఁ బోవ నుంకించునీమెను, మహాభాగునిపేరురముసంసర్గమునం జేసి సుభగమయినయాహారమే కంఠలగ్న మయి యడ్డగించుచున్నది. (మల్లికాకంఠహారమును జూపుచున్నది)

మారు—(ఆశతో)

శా. ముక్తాహారమ! నాకునుం దెలుపుమా మున్నానుచున్ నీళ్ళ, నా
సక్తిం జల్పినతత్త్వసచ్చరణనిష్ఠాప్రక్రియన్ మిత్రమా?
వ్యక్తిం బొవిరహంప్రఁబొంపపును జానా నేణాక్షిప్రోంథం.

సక్త్రిం గాంచి స్పృశించుచుంటి నురముం జన్గుత్తు లొత్తన్నినున్. 37

నన—(దోసిలిపట్టి మల్లికతో) సఖీ! ప్రసన్నురాలవు గమ్ము. చూడుము. కులకన్యల కుఁ గూడ గాంధర్వవివాహము లాయాయితిహాసముల వినంబడుచున్నవి. కాఁ బట్టి నన్నయినఁ గాళింది నయిన నంపుము గూఢముగా నీహృదయవల్లభునిఁ గొనివచ్చెదము.

మల్లి—(నిట్టూర్పుతో) సఖులారా! యనురాగము దెలియ రానియాజనునియొద్దకు మి మ్మేమని యనుపుదును? ఒకవేళ నాతఁడన్యాసక్తచిత్తుఁ డయ్యెనేని కేవలము నాచాపలమే బయలుపడునుగదా!

మారు—(సదయముగా)

క. నీవే సుమి నాజీవిత, మావంతియు నన్యసక్తుఁ డనకుము నను, నె
క్కైవడిఁ దామరతీవియ, నే వలచెదు తేఁటి గోరు వేఱొండలతన్. 38

కాళిం—(తనలో) తనకన్నులతోఁ దాను జూచినను నీమెకు నమ్మకము గలుగదు. (ప్రకాశముగా) సఖీ! శిఖామణీదానమున ననురాగసర్వస్వము ప్రకట మయిన ది కాదా? (శిఖామణిని జేతితో నిమురుచు)

"తే. గీ. కొమ్మ! బంగారుదారాన గ్రుచ్చి ప్రియుఁడు
పాటలం బగురతనంబుఁ బంపినాఁడు,
మారశరవిద్ధ మై మూర్తిమంత మయిన
సానురాగంబు నిజమానసంబు వోలె"

(ఈపూర్వోక్తపద్యమును జదువుచున్నది)

మారు—(విస్మయముతో) అహో! దైవమునఘటనఘటనాపటిష్ఠత్వము! సింహళ ద్వీపస్థ మయిన యీమానిక మెక్కడ? మగధపురమండన మయిన యీమల్లిక యె క్కడ? (మణిని గూర్చి)

తే. గీ. ఏను నీవును, నొడలమానికంబ
యూదు మతిరాగవంతుల మైన నీదు
నియతి వేఱీమె సురభివినీల మైన
యలక లంటవె నీవు కరాంచలమున? 39

(తెరలో) కాళిందీ! భగవతి సెల వయినది.

అంచలు—(విని) సారసికమాటలా గున్నది.

కాళిం—ఓహో! భగవతి పిలుచుచున్నట్లున్నది. శీఘ్రముగాఁ బోవలయును.

మారు—(విని విషాదముతో) హా! దైవప్రాతికూల్యము!

* తే. గీ. దప్పిగొన్నచకోరపోతంబు నోరఁ
బడెడు వెన్నెల మబ్బుచే బలెఁ జిరాభి
లషితసంప్రాప్తదర్శనలాభ నైన
భామ దొలఁగింపఁబడియె దృష్టపథమునుండి. 40

(అందఱును నిష్క్రమించి లతాగుల్మాంతరిత లయి ప్రవేశించుచున్నారు.)

మల్లి—కాళిందీ! మారుతుఁ డిక్కడ నున్నాఁ డన్నమాట నిజమా?

కాళిం—సఖీ! సాహసిక మఱియొకలాగేల చెప్పును?

నవ—సఖీ—! యిప్పుడు సోమసరస్సునకు స్నానము చేయఁ బోవుచు నీచెవిలోన ది చెప్పిన దేమి?

కాళిం—(తనలో) శంబరకునియవినయమును దీనికిఁ జెప్పను. మంత్రబీజము భిన్నమయిన యెడల ఫలముగలుగ నేరదు గదా! (ప్రకాశముగా) ఏమా? యీపువ్వులగురివెందతీఁగమండపమునందే నిగూఢముగా నున్నాఁడని.

మారు—అయ్యో! సఖులతోఁ గూడ మల్లిక వెళ్ళిపోయినది. (వెలువడుచున్నాఁడు)

మల్లి—(చూచి సంతోషముతో) ఆహా! మబ్బుముసుఁగునుండి చందమామలాగునఁ దీఁగమండపము మాటునుండి మారుతుఁడు వెలువడినాఁడు. (శంకతో) అయ్యో! యొంటరిగా నున్నాఁడే.

కాళిం—సఖీ! శంక నొందకు. హృదయమందే సంచారిణి యగుప్రియసఖి మహాభాగునకు సాయ మున్నది.

మల్లి—అహో! యేమీ! మనోరథవిషయమున నీయతిప్రసంగము!

కాళిం—సఖీ! యిం దతిప్రసంగ మేమి యున్నది. నిన్నే చూడవలయునని వాంఛ గలవాఁ డయి పరిజనము నెల్ల పంపించి యొక్కఁడు నీలతామండపమున నిగూఢముగా నున్నాఁడు.

మల్లి—(ఆనందముతో) ఊఁహూఁ! అట్లయినయెడలఁ జపలాతిచపలము లయిన మనమాట లన్నియు నార్ద్రహృదయుఁడు విన్నాఁడు గదా!

---

* మైసూరులో నచ్చుపడిన తెలుఁగుప్రతిలో నిటపద్యములేదు. గద్యమున్నది. కలకత్తానాగరపుఁ బ్రతిలోఁ బద్యమున్నది. భావము పద్యమునకుఁ దగియున్నందున దీనినే గ్రహించితిమి.

నవ—సఖీ! తాపృశములే యయిన యీమదనజ్వరగాఢసంతప్తుమాటలు మనము ను వింపము.

మల్లి—(పరిత్యాశతో) ఆలాగే. (పోల్చి చూచి) ఇప్పు డీయన ప్రతిచ్ఛందమునను కరించుచున్నాఁడుసుమీ

"తే. గీ. మొలకవెదురును బోఁకముద్దొలుకుమేన,
నొలసె బిసకాండసోదర మొందుచాయ;
కమలినట్లగు నిట్టూర్పుగాలిఁ, గెంపుఁ
దునుకతులకింపు గలమోవిదొండపండు."

(ఈ పూర్వోక్తపద్యము చదువుచున్నది.)

మారు—(సోత్కంఠముగా)

ఆ. వె. వేఁగు చుండ నెమ్మి వేసంగిచేత, ల
భించెఁ బ్రథమమేఘవృష్టి యెట్లొ;
గైన దాని నకట! యాకస్మికంబ యే
తెంచి గాలి యెటకొ కొంచుఁ బోయె. 43

నవ—సఖీ! మహాభాగునివచనము వినఁబడినదా?

మల్లి—నవమాలికా! దీనియభిప్రాయ మస్ఫుటము గదా!

మారు—(మన్మథబాధ నటించుచు) ఆమెయడుగుఁదమ్ములు మోపినచోటే యాశ్రయించెదను.

మల్లి—(ఆశంసముతో) ఇంతలి "యామె" యను మాట యెవ్వతెను దెలుపునో!

మారు—(నడిచి) మల్లిక యిక్కడఁ గదా పూలు గోసినది.

మల్లి—(గగుర్పాటుతో) అహో! నాపే రుచ్చరించినమాత్రముననే నామొడలెల్లఁ బులకరించుచున్నది.

మారు—

మ. కొనగోరం గుసుమంబులం జిదిమి క్రైకో, నామె చే నంటుకొం
టను ధన్యం బగునీలతల్, దొడిమగంట్లన్ మూఁగి యాడావని
ష్ఠను జుంజు మ్మనుతేంట్లపెన్ రొదను నేడ్చున్ దత్పయోజాతవా
సనకుం గేలికి దూర మావగపునన్, జాజన్ సౌనన్నాప్పముల్. 44

మల్లి—అహో! మహాభాగుఁ డెంతమధురముగా వర్ణింప నేర్చును!

మారు—(క్రిందుచూచి)

ఉ. అంప లతాగ్రసూనము, పదాగ్రమునన్ నిలఁ బోలు నీడ, నిం
దందు నలక్తలాంఛితము లంగుళికాగ్రప్రబాధ తేర్పడెన్ ;
(వేఱొకచోటఁ జూచి)
గ్రందుగ గండుఁదుమ్మెదలు గ్రమ్మఁగ నమ్మృగనేత్ర, భీతిఁ గే
ల్చెంపలిడన్ విదుర్చుటను జిందిన పీపువు లిచ్చటం గటా. 45
మల్లి—(సిగ్గుపడి నవ్వి) అహో! మహాభాగుఁడు, సర్వము, జరిగినది జరిగినట్లే, చె
ప్పుచున్నాఁడు.
నవ—సఖీ! యిప్పటికి నభిప్రాయ మస్ఫుటముగానే యున్నదా?
మల్లి—సర్వాకారమధురుఁ డగునీయనయాలాపములు నిసర్గపేశలములగుటంజేసి ప్ర
స్ఫుట మయినను నిర్ణయించుటకు వల్లగాకున్నది
మారు—(తలఁచుకొని) ప్రియతమురాలా! మల్లికా! సర్వథా నీ వనాశ్వాసశీలవు
సుమీ. నీకటాక్షలసమును బ్రతీక్షించుచువానిహృదయము నన్యసంక్రాంత మని శం
కించుచున్నావు.
సఖులు—ప్రియసఖీ! తన్ముఖమునవే యాలకింపుము.
మల్లి—(హర్షముతో) మహాభాగా! నన్నుఁ బ్రియతమురాలా! యని సంబోధించు
టచేత నిజముగా నే నిప్పు డాశ్వాసిత నయినదానను.
మారు—నీయవయవములయందే తిరుగుచున్నది నీ కేల తెలియని డగును?
చూడు—

చ. అడుగుల వ్రాలి, గో ళ్లొరసి, యంటి తొడల్, కటి విశ్రమించి, నె
న్నడుమును శూన్య మం చరసి, నాభిగభీరజలాశయంబునం
బడి, బెడఁగారునారులతఁ బట్టి చనుంగవఁ బ్రాఁకి, చూపులన్
మిడిసి లయించె నామనసు, మేచకపున్నెలికైశికంబునన్. 46

మల్లి—(ఆకాశమున) అకారణకారుణికుఁడ వయినభగవానుఁడా! పంచబాణ!
యీఁడవారిమీఁద నతినిష్ఠురతఁ జూపువాఁ డని నీయెడల రూఢ మయినపరీవాదము
ను నేఁడు గదా నీవు శుభ్రముగాఁ గడిగి వేసికొన్నాఁడవు! అహహా! యెటువం
టి మాటలను వినిపించుచున్నావు.
మారు—(నడిచి) ఇదిగోఁ బ్రియతమురాలు వసియించుటచేత, ధన్యమయిన లతామూ
లము రమణీయమై ధైర్యముపోఁదు గదలించెడు నామె మాన్మథక్షోభను లిక్క
డనే గదా నవమాలిక వర్ణించినది! నే నిచ్చటఁ గూరుచుండెదను? (కూర్చుండి

నిట్టూర్పుతో) సఖీ! నవమాలికా!

నవ—భర్తృదారికా! మహాభాగుఁడు నన్నుఁ బేరుకొనినను, నే నాన తిమ్మని సమీపింపఁ జాల కుంటిని.

మల్లి—కనఁబడకు కనఁబడకు. ఈయనవిస్రంభాలాపమును క్షణ మాలకింతము.

మారు—చూడుఁ. నీప్రియసఖియుపాలంభము. నేను బరవ్యసనము నెఱుంగనివాఁడనఁట. అవురా! యవాఙ్మనసగోచర మయిననామన్మథజ్వరోత్థదాహము నీముద్దరాలు తలంప దయ్యెను.

చ. వినదె పికస్వనంబులను వీనులసూదులు గాఁగ? నే సహిం
పనె సహకారకోరకపుమంజరు లూఁచెడుగాలులన్? గటా!
యనుకుసుధారసం బొలుకు నట్టికరంబులఁ జంపమామ, శేల్
గనగనఁ గాయ వెన్నెలలఁ గ్రంపగుమూర్ఛల నిస్తరింపనే? 45

మల్లి—అయ్యో! త్రైలోక్యమంగళదీప మయినయీయనకు నానిమిత్త మింతటిసంతాప మని యెఱుంగ నయితిని (నిట్టూర్పు విడిచి) ఎఱింగితిని బో- అప్పుడు మాత్రము నే నేమి చేయఁ గలను?

నవ—(జనాంతికముగా) కాళింది! యీభర్తృదారిక తనకు మారుతుని యనురాగము ప్రత్యక్ష మయినను పలిసంద్రములచాటుది గనుకఁ దన్నుఁ దాను సమర్పించుకో లేక యున్నది.

కాళిం—(తనలో) ఇది విశుద్ధకులకన్యకాస్వభావమునకుఁ దగినదే గాని మన్మథుఁడు కాలయాపనమును సహించువాఁడు గాఁడు. కావున నీలాగునఁ బలికెదను. (ప్రకాశముగా) సఖీ! మల్లికా! సకలజననయనానందనుఁడు మహాకులప్రసూతుఁడీమారుతుఁడు నీయం దింత యనురాగముగలవాఁడు గదా! పాపము! ప్రళయానలకల్పము లయి దుస్సహఘోర లగుమదనారాచములచే నీ సుకుమారశరీరుఁడు వేఁగుచు మిగుల నొగిలి యున్నాఁడు. కాఁబట్టి నీ విప్పుడు క్షణ మయిన నుపేక్షించితివేని వెనువెంటనే మూర్ఛగాని మఱి యేదయినఁ గాని కాఁగలదుసుమీ!

మల్లి—(ఖేదముతో) అయ్యయ్యో! యమంగళములను దలంపకువే.

భ్రమ—సామీ! దివ్యగంధముచేత లోకులు దెలిసికొందు రేమో యని మాలికను దేలేదు. ఇదిగోఁ! చిత్తరువుఁబలకమాత్రము దెచ్చితిని.

మారు—భ్రమరక! నీవు నేరవరివి గదా! (చిత్రఫలకము పుచ్చుకొని) క్షణలబ్ధప్రియతమాదర్శనమయిన నాకన్నుదోయిఁ, దత్ప్రతిచ్ఛందస్పర్శనముచేతనయిన నా

నంపఁబెట్టుకొనియెదను. (నిర్వర్ణించుచున్నాఁడు)

అందఱు—(విస్మయముతోఁ జూచుచున్నారు)

నవ—ఆశ్చర్యము! చూడు చూడు, ఉత్తుంగశృంగమండితమైన కొండొకకొండ వ్రాయఁబడి యున్నది (మరలఁ బరిశీలించి) దానివడిచక్కి నొక్కసెలయేఱుగూడఁ దెల్లనినీరితో దిగఁ జాఱుచున్నదే. (సంతోషముతో) అదిగో! దానితీరపుఁబూవుక్రీరమున నీవజకు మనముచూచి యెఱుఁగ దివ్యరూపము గలచెలిమికత్తెలచేఁ బరివేష్టిత యయి మనప్రియసఖియును లిఖియింపఁ బడియున్నది.

మారు—భ్రమరక! యిది చూచినది మొదలు నాహృదయము విస్మయమున మునిఁగి పయికిఁ దేలలేకున్నది. ద్వీపాంతరస్థుఁ డగుచిత్రకారుఁడు మల్లిక నేలాగునఁ జూచినాఁడు? దివ్యజనసేవ్య మగునప్పర్వతమున నామె యేల వ్రాయఁబడినది?

చూచి—

మ. ఇది విద్యాధరసేవితప్రతితటోపేతంబు శీతాద్రి; యి
య్యది ఖేలద్దిగిభేంద్రదానకలుషం బైపాఱుమిన్నేఱు; నం
తదరిం బూఁబొదరింట నెచ్చెలులమధ్యంబందుఁ జెండాడుచు
న్నది నాజీవిత మైనమల్లిక నితాంతక్లాంతకాంతాకృతిన్. 46

మల్లి—(సోత్కంఠాస్మరణంబుగా) ఏమిది! ఈప్రదేశము చిరపరిచితమువలెఁదోఁచుచున్నది. ఈసఖురాండ్రుగూడ నట్లే.

నవ—(సాసూయముగా) ఈసఖీమండలములో మ మ్మెందుకు వ్రాయలేదో!

భ్రమ—"నితాంతక్లాంతకాంతాకృతిని జెండాడుచున్నది" యని దేవర యథార్థము వచించితిరి కంది కెంపలిరాకునందమును గ్రింపుపఱుచునామె యఱచేతియందు ముత్యాలబంతి చెందామరపూవునందలిరాయంచ ననుకరించుచున్నదిగదా!

మారు—(పరిశీలించి యాసతో)

చ. ముడివిడి జాఱుకొప్పు పిఱిఁగి మూఁపున వ్రేలెడు; మోముఁదమ్మినె
త్తుఁడలమొఁ జెమ్మటల్; పిగిలి గుబ్బలగుత్తపుఁబైరిక సళ్ళె; వీ
డ్వడె గసయంబొకింత; కటిపై మణిమేఖల జాఱెఁ; జూడ నీ
బిసమెయి బంతియాటతుద వింతయొయార మొకండు దోఁచెడున్. 49

నవ—భర్తృదారికా! దీని జూడఁగా మనక్రీడాపర్వతఖేలనములు తలంపు వచ్చుచున్నవి

మారు—(మదనోన్మాదముతో)

క. ఖిన్నాలస నయనాంతము। స్విన్నాళికలగ్నకుటిలచికురనికర ము
త్సన్నతిలక మీసఖిముఖ। మన్నన్నా! ధృతిని దొలఁచు నతనునిఁ దలచున్.

మల్లి—(ఈసుతో వెనుక దిరిగి) సఖులారా! నిజముగా నేనే యిందు వ్రాయఁ బడితినా?

నవ—(చిఱునవ్వుతో జనాంతికముగా) కాళిందీ! యీప్రతిచ్ఛందము దర్శనీయమే యయినను దీని నన్యముగా భావించి, భర్తృదారిక యీసునఁ బయి కెత్తిన కను బొమ్మలచేఁ దనసుందరవదనకమలమును గలంకితము చేసికొనుచున్నది.

(ప్రకాశముగా) అతిమానిని! యలుగ కలుగకు. నీయెడమపాలింటిపయి వేలుచున్న సాజంపుఁబూలమాలిక గానవచ్చుట లేదా?

మల్లి—(చూచి సిగ్గుతో) అయ్యో! యీసునఁ గలఁకం బొటీననాభావము వీరు దెలిసి కొన్నారే.

మారు—(కనికరముతో) అయో! పాపము! ఈమెయాయాస మింకను దీఱకున్నది. భ్రమరక! మన కనతిదూరమున నున్నసోమసరస్సునుండి లేఁతతామరపాకులను దీసికొని రా మెల్లమెల్లగా నే నీమెకు విసరెదను.

సఖులు—భర్తృదారికా! మే మదృష్టవతులము. మహాభాగుఁడే నీకు సురటీ వేయు టకుఁ బరిజనపదమునఁ గుదురుచున్నాఁడు.

మల్లి—ఈయనయు నావలెనే ప్రతిచ్ఛందమును సత్యముగాఁ దలంచుచున్నాఁడు.

భ్రమ—(విషాదముతో) సామీ! యిది చిత్రము గదా!

మారు—భ్రమరకా! నీవు సత్యము పలికితివి.

క ఒకచోఁ జవలాకచో మొగు। లొకచోఁ గొలఁ కొక్కచోట నుత్పలయుగ్మం
బొకచోటఁ జాపలత వే। యొకచోటను మార్వ యిదియహో! చిత్రమె యా.

మల్లి—(తనలో) అవురా! యిప్పటికిని భ్రమనివారణము గా కున్నది. ఇంతటి య నురాగము గలయీయనను సమీపించి కవుఁగిలించుకొందునా?

సఖులు—సఖీ! నీవే యిప్పుడు పరవ్యసన మెఱుంగనిదానవు.

భ్రమ—సామీ! యిది ప్రతిచ్ఛందమని గదా మనవి సేయుచున్నాను!

మారు—(ఖేదముతో) అయ్యో! యిది ప్రతిచ్ఛందమా? నీరిలోఁ బ్రతిఫలించిన జాబి ల్లికిఁ జేయి సాఁచెడుపసిపాపనిచాపలము ననుకరించితిని. (ఉత్కంఠామోహ సంతాపములతో)

మ. ప్రళయాగ్నిస్ఫుటమంట లంటుకొనునో, పాటీరశైలానిలం

బులు పైపైచునో, కాయునో మిటమిటన్ భూయిష్ఠసంద్రాతపం
బు లెఱుంగక, పలవాపుఁ దాపభరమో, మోహాతిరేకంబో, య
గ్గలికన్ మైఁ జుఱుపుచ్చుచుఁ గరణవర్గంబుఁ బరోధించుచున్. 52

(ఉన్మాదమున) భ్రమరకా! యిది యేప్రదేశము?
అందఱు—(ఆవేగముతో) అయ్యయ్యో! యెంతప్రమాదము!
మల్లి—సఖులారా! నా కేమి చేయుటకును దోఁప కున్నది.
భ్రమ—(భయముతో) సామీ! యిది వసంతోద్యానము కాదా?
మారు—(అంతటఁ జూచి) సరిగానే యున్నది. ఇదిగో! గున్నలేఁదీయమావి మోకమొదట—

తే. గీ. రఘూ మ్మునఁగ మార్చి, పంచమాస్త్రము ఘటించి
మన్మథుఁడు కేళినిస్తనమంపలేక
కలితాద్వైతసాక్షి యతాకడము చేతఁ
గష్టణము చేయుచున్నాఁడు కార్ముకంబు. 53

మామకప్రాణాపహరణోద్యోగంబు గావించుచున్నయించువిలుకానిని క్షణవిలంబనార్థము ప్రార్థించెదను.

ఉ. విను విషమాస్త్ర! నా చిన్నవిన్నప మియ్యది, నీకు మ్రొక్కెదన్,
కనికర మూఁది నీదుకరుణన్ క్షణకాలము తాళవయ్య; మ
న్మనమున నొక్కమాఱు స్తిమితంబుగ ధ్యానముఁ జేసికొందుఁ, గం
పెనసినమోవిసోఁ గలసవీక్షణముల్ గలమల్లి కాస్యమున్. 54

(కన్నులు మూసికొని మూర్ఛ నొందుచున్నాఁడు)
మల్లి—(కరుణానురాగసంభ్రమావేగములతో) అయ్యయ్యో! మూర్ఛిల్లిన ట్లున్నాఁడు.
సఖులు—సఖీ! యుత్సంగమునఁ జేర్చుకొని పట్టుకొమ్ము.
మల్లి—(ఒడలు పులకరింప నంకమునఁ జేర్చుకొనుచున్నది.)
భ్రమ—(చూచి యానందముతో నమస్కరించి తనలో) వీరుగూడ నిక్కడనే యున్నారే. (ప్రకాశముగా) అమ్మలారా! భాగ్యవశమున వచ్చేసితిరి.
కాళిం—నవమాలికా! కర్పూరపుఁబిపుళ్ళను కరతలములతో నలిపి రసము దీసి యీ యన నొసలిపైఁ బూసి చూతము. (యిద్దఱు నట్లు చేయుచున్నారు)
భ్రమ—సామీ! తెలిసి కొంటిరా మల్లి మాల్లికాంతయే మి మ్ముపచరించు తో

మీఁదఁ జేర్చుకొని పట్టుకొన్నారు. మునుపు గూడ మీ రప్పు డప్పుడు సొమ్మసి ల్లుచు నీమెనామము నుచ్చరించునంతమాత్రముననే తెలియుచు వచ్చితిరి గదా!

మల్లి — (వదనముఁ జేయి బొమ్మమీఁద నుంచి) నాథా! భ్రమరకుఁ డనినమాట వినఁబడ లేదా?

మారు — (తెలియుచు రోమాంచముతో)

ఉ. హాయిగఁ జంద్రచంద్రమణిహారపటీరహిమాంశుమాలతీ
ప్రాయతుషార మై, సురుచిరం బగుస్పర్శ మొకానొకండు నా
కాయమునందుఁ దోఁచుట, నఖండసుధామయవృష్టిఁ బోలె, నా
ప్యాయము నొందుచున్నది మహాత్మ, విధూతదురాపతాప మై. 55

(కన్నులు దెఱచి చూచుచున్నాఁడు)

సఖులు — సఖియా! మన మదృష్టవంతురాండ్రము. వెన్నెల కౌఁగిలించుకొన్నకలువ కొలఁకులాగున మహాభాగుఁడు తెలివి నొందినవాఁడు.

(అందఱు హర్షము నొందుచున్నారు)

భ్రమ — (ఆనందముతో) సామీ! మూర్ఛాగమమున మీకనులు మూఁతవడఁగానే కనికరమునఁ దత్తఱిల్లుచు, మల్లికానికుంజమునుండి శీఘ్రముగాఁ జనుదెంచి యీమె మిమ్ము నిట్లు పట్టుకొన్నారు.

మల్లి — (సిగ్గు పడుచున్నది)

మారు — (హర్షముతో) అహహా! వీరు వెళ్ళ లేదే!

తే. గీ. బిడియమును గురుజనభీతి గడచి డాసి,
గగురుపొడిచినగుబ్బలఁ గౌఁగిలించి
పట్టె ననుఁ, గాతరాక్షి, నీపట్టుకతన;
నహహ! నా కెంతయుపకారి వయితి మూర్ఛ! 56

(తెరలో) ఓహో! జనులారా! పాఱి పొండి పాఱి పొండి.

చ. అరరె! యతర్కితోదితమదాంధము లై యురుసింగురంబు లు
ద్ధురతను మానటీలఁ బడఁ ద్రోసి విశృంఖలవృత్తి నట్టిటుం
బరువిడు చద్వగాలిఁ బరి మార్చుచుఁ జొచ్చె నొకండు సోమపు
ష్కరిణిని, వేఱొకం డిట వసంతవనిన్ భృగుదంతఘోరముల్. 57

(అందఱు విని తత్తఱపడి లేచుచున్నారు)

మారు — అయ్యయ్యో! యెంతదారుణము జరుగుచున్నది!

స్రగ్ధర. దౌదౌలం బాఱుచున్నం, దఱిమి లఘుగతిన్ దాను వెన్నంటి యుచ్చై
ర్నాదం బేపార ఫీట్కారములు సలుపఁ, దద్రావ మాలించి కూలన్,
బాదాగ్రాక్రాంతి నెమ్మిల్ పటపట మనఁగాఁ బ్రాముచుం బ్రాణికోట్లన్
వేదండం బుగ్రశుండాపృథురదహతులన్ బిష్టపేషంబు సేయున్. 68

భ్రమ—(సదయముగా) సామీ! యదిగోఁ జూడుఁ డాబెట్టిదపు మదపుటేనుఁగు, నిబ్బరపురోసంబున మానుసులపొట్టలు నించి చెండాడునపుడు గట్టెజ్జినిగ్రేఁగుఁ దుట్టెలు చుట్టుకొన్నకొమ్ముగోకండ్లచేఁ బాలవెల్లిని ద్రచ్చువేళఁ బగడంపుఁదీఁగెచుట్టలు దగులుకొన్నయున్నతశృంగంబులతోడి కవ్వంపుఁగొండను నవ్వఁజాలుచు, గండమూలంబులం జాలు వాఱుదానధారలకు మూఁగి మొరయుచుండెడు గండుఁదుమ్మెదలు జయడిండిమమ్ము లయి నిజాగమనంబుఁ జాటుచుండ, నట్టనడిమికిఁ దెగిపోయి కాలి యూడ్పుల ఖలఖలాయమాన మ్మగుసుదృఢలోహశృంఖలంబుతో నీషద్వక్రితపింగళేక్షణ భీషణముఖాభోగం బయి తా నీలాగుననే వచ్చుచున్నది.

అందఱు—(వడఁకుతో) మహాభాగా! రక్షింపు రక్షింపు.

మారు—వెఱవకు వెఱవకుఁడు. ఈదుష్టవారణమును నేను వారించెదను.

(సత్వరముగా బద్ధపరికరుఁ డయి నిష్క్రమించుచున్నాఁడు.)

మల్లి—అయ్యయ్యో! మహాభాగుఁడు తదభిముఖముగాఁ బరు గెత్తినాఁడు.

భ్రమ—ఆహాహా! రోషప్రసారిత మయినయద్దానిశుండాదండమునే సోపానముగా వించుకొని నాథుఁడు సముత్సేధసనాథ మగుమూర్ధసౌధ మధిరోహించి, నిష్ఠురాంగుష్ఠమున ఘట్టించి గట్టిగాఁ గర్ణమూలముఁ బీడించుటం జేసి దెసలు వాపోవ గీఁ పెట్టుచు, మదావళము మరలినది. కాఁబట్టి నేనును దానివెనుకతట్టునఁ గూరుచుండెదను

(నిష్క్రమించుచున్నాఁడు)

అందఱు—అయ్యో! వా రిద్దఱును జూపుమేర నతిక్రమించినారు.

(మరలఁ దెరలో)

ఉ. హాళిని దేలు చుండ రమయంతిక సోమసరస్సునందు న
బ్బాలికపాలికిం బరుగువాఱు నయో! మదహస్తి చెచ్చెరన్;

అందఱు—అయ్యయ్యో! హా! సఖి! హా! రమయంతిక! కాలవశమున నీ విప్పుడా ముటేనుఁగుచేతికిఁ దామరతీఁగ వగుచున్నావు.

(మరలఁ దెరలో)

శైలతటంబునం బడెడుశంబ మనం బయినుండి మత్తశుం
డాలము నెత్తి దూఁకెఁ బోగడం గలకంఠమృగేంద్రుఁ డార్భటిన్. 58

అందఱు—(ఆలకించి హర్ష విస్మయములతో) బాగు! కలకంఠుఁడా! బాగు!

(మరలఁ దెరలో) సఖీ! రమయంతికా! భయపడకు భయపడకు, కలకంఠకంఠీరవుఁడు వారణమును దూరముగాఁ దఱిమి వేసినాఁడు.

అందఱు—(విని) ఇది సారసికయూఱటపలుకు.

కాళిం—సఖీ! మల్లికా! జీవితసంశయమునకుఁ దప్పినరమయంతికను మన మూఱడింతము.

(అందఱు నిష్క్రమించుచున్నారు)

గద్య-ఇది శ్రీపరమేశ్వరవరప్రసాదసమాసాదితసరసకవితాధురంధరవడ్డాదిసాధువంశక్షీరనీరాకరరాకాసుధాకరాచ్చనామాత్యపౌత్ర హరితసగోత్రపవిత్ర గుణకదంబలక్ష్మాంబాగర్భశుక్తిముక్తాఫల సూరపరాజప్రధానతనూభవ విబుధవిధేయ సుబ్బరాయనామధేయాంధ్రీకృత మగుమల్లికామారుతప్రకరణంబునందుఁ దృతీయాంకము.

శ్రీరస్తు.

# మల్లికామారుతప్రకరణము.

## చతుర్థాంకము.

---

(తరువాత నిద్దఱు మావటీవాండ్రు ప్రవేశించుచున్నారు)

ప్రథముఁడు—ఓరీ! బర్బరక! విశ్వావసుమంత్రిగారి కూఁతుమీఁదివలపువేఁత, దోస మనక మందార శంబరకుఁ డెంతపోఁతపని చేసినాఁడురా! చందమామవంటిచల్లనిస్వభావము గలిగి, శత్రువులయం దయినను జాల ననురాగమునే కనఁబఱుచుచుఁ దక్కఁగినముగఁ జక్కఁదవిలుతుని లెక్కసేయనివాఁ డయినమారుతుని యందు మల్లికమనసు దగిలియున్న దనుకోరువుచేతఁ బాప మాతని రహస్యముగాఁ గడతేర్పఁ జూచుచున్నాఁడు చూడు. సౌరాలోనుండి బయలువెడలి మారుతుఁ డొక్కఁడు వసంతవనోద్యానము చొచ్చియుండఁగాఁ జూచి వచ్చితి నని వేగులవాఁడు చెప్పినమాట విని, మందుపెట్టి చెఱచి యొకయేనుఁగును మత్తెక్కింప వలసిన దని నీకు నాకు నానతిచ్చినాఁడు గదా! (విస్మయముతో) నే నట్లు మత్తెక్కింపఁ గానే, రోషావష్టంభితమై వచ్చునాయేనుఁగును జూచి మహాపురుషుఁ డయినమారుతుఁడు హఠాత్తుగా నుద్యానవనమునుండి బయలు వెడలి యవలీలగా మీఁద నెక్కి, గరుటామంతుఁడు మనకి పుఁగ్రాఁచుఁబామునట్లు దానిని దూరముగాఁ గొనిపోయినాఁడు.

బర్బరకుఁడు—సింహముఖ! "ఘోర శంబరకుఁ డెంతగోఁతపని చేసినాఁడు రా!" యని నీ వన్నమాట యెంత బాగుగ నున్నది రా! వేయేల? సొగసుకానిపయిని మేలుపడి యున్నకన్నియమీఁద నెవఁడు గన్ను వేయునో, ఛీఛీ! వాఁడెబ్బరాసి పిసాసి గాని మానిసి కాఁడు సుమీ.

సింహ—అవు నది యట్లే, మఱి నీహత్తి సోమసరస్సున నున్నకలకంఠుని యొద్దకుఁ బరుగెత్తినది గదా! దానిపని యేమయినది రా?

బర్బ—ఏమయినదా? అది యట్లు పరుగెత్తి, విష్ణురాతుఁడుగారికూఁతురు దమయంతిక సంతోషముతో నట జలక మాడుచుండఁగా, నామెను బట్టుకో వలె నని నీళ్ళలో దిగినది.

సింహ—(అనుతాపముతో) అయ్యయ్యో! పాపము! దమయంతిక కూడ నాశనే యున్నదా?

బర్బ—(నవ్వి) సింహముఖ! నిరోసనుఁ గుద్యానవనము చొచ్చినప్పుడు మల్లిక కూడ నక్కడ లేదా?

సింహ—(భయముతో) అయ్యో! మల్లికగూడ నక్కడనే యున్నదా? చెంకుగోలను బోలె నాబాల నది పట్టుకొన్న యెడలఁ బడినపాటంతయుఁ బయటఁ గలిసి పోవును. అవురా! శంబరకుఁడుదొరగారి తెలివి తేటలు!

బర్బ—(నవ్వి) పడ్డపాటంతయు నెట్లును బయడేరా.

సింహ—సరే. తరువాత?

బర్బ—అప్పుడు మారమునుండియే దమయంతికికోసరము రోసముతోఁ దొండ మెత్తికొని వచ్చు నామత్తశేభముఁగు విల్లువేటువవ్వున నుండఁగాఁ జేరువ చెట్టుకొమ్మ మీఁద నెక్కి, కలకంఠుఁడు జనసమూహములహాహాకారము లెగయు చుండఁగా నక్కడనుండి యతిసాహసమున దానినెత్తి మీఁద గుబాలున నుఱికి తత్క్షణంబ మరలించి మణికూటసమీపకాననమునకు దానిని బరుగెత్తించినాఁడు.

సింహ—ఔరా! యేనుఁగులు గూడ నూడనింబాడినవి! (నవ్వి) ఇహిహీ! వెలపింపఁ బోయి వెఱచిన ట్లైనది. మఱి చెప్పు. మల్లిక యెక్కడ నున్నది రా.

బర్బ—సోమసరస్సున మూర్ఛ పోయిన దమయంతికి నూఱడించుచున్నది.

(తెరలో) స్వామీ! గజమల్లగర్వనిర్వాపణ! యిటు. ఇటు.

సింహ—ఇదిగో! భ్రమరకుఁడు దారి చూపఁగా, నయనాభిరాముఁ డయిన మారుతుఁడుగారు వసంతోద్యానసమీపమున కిటు వచ్చినారు. కాఁబట్టి యీదాపున నున్న యీవ్యాకులపింగళున కీవృత్తాంతము నివేదింపము. ఆకాశవాణీప్రయోగపండితుఁ డతఁడు ప్రభువుగారికిఁ బ్రియశిష్యుఁడు గదా! (నిష్క్రమించుచున్నారు. ప్రవేశకము) (తరువాత మారుతుఁడు భ్రమరకుండు ప్రవేశించుచున్నారు)

మారు—భ్రమరక! కుంజరకోలాహలమున కలిసిపోయినమల్లిక యెటఁ బోయి యుండును? వసంతోద్యానమున నెక్కడను గాఁబడ లేదే!

భ్రమ—సామీ! దమయంతికను జూచుట కామె సోమసరస్సునకుఁ బోయి యుండు నని తలంచెదను.

మారు—అట్లే కావచ్చును. సోమసరస్సునకు మార్గము చూపుము.

భ్రమ—సామీ! యిటు. ఇటు.

ఇద్దఱు—(నడుచుచున్నారు)

మారు—(కనికరముతో)

ఉ. ఘోటకవారణంబు లభిముఖంబుగ రా నతిఘోరఘీంకృతిన్,
గాఁడనేత్ర యేమొ మఱి గాంచ్రతు నునంగఁ గుటంగి చుఱుం బడెన్,

భీతిలి దద్దఱిల్లె దయనీయముగాఁ గమనీయగాత్రి, నా
చేతమునం దొనర్చెదను జింతనముం దదవస్థ నిప్పుడున్.

ఆశ్చర్యము !

ఉ. వేయిమడుంగు లైనతనవేఁడిమి తోడను గామవహ్ని నా
కాయము బగ్గు బగ్గు మని కాల్చుచు నున్నది; యైనఁ గాని, యా
రా యువతీఘనస్తనభరార్పణకారణలోభనీయ మా
నీయది నాదుమూఁపు వహియించెడు గగ్గురుపాటు మాటికిన్. 2

భ్రమ—సామీ! యామత్తుటేనుఁగును మద మడఁచి దూరముగాఁ దఱిమి వేసితిరి గదా!

మారు—భ్రమరకా! దమయంతిక మీఁదికిఁ బోవుచున్న యేనుఁగును గలకంఠుఁడు మరలించె నన్నమాట బూటకము గాదు గదా!

భ్రమ—సామీ! బూటక మెట్లగును? సోమసరస్తీరమునుండి మణికూటపర్వత మూలకాననమునఁ బ్రవేశించి సాటోపముగాఁ బరుగు వాఱుచున్న మదపుటేనుఁగు మెడమీఁద నెక్కియున్న కలకంఠుఁడుగారిని, దేవర వెనుకఁ బరు గెత్తుకొని వచ్చుచు నేను గన్నులారఁ జూచితి నని మనవి చేయుచున్నాను.

మారు—(సవితర్కముగా) భ్రమరక!

తే. గీ. పొంగు మది, విష్ణురాతునిపుత్రి మృత్యు
వక్త్రగుహ సొచ్చి కాపాడఁబడినది విని;
క్రుంగు నది కలకంఠు నొక్కరునిఁ గానఁ
గూళయేనుఁగు గొనిపోవు టాలకించి. 3

భ్రమ—సామీ! ప్రియమిత్రుని భుజపరాక్రమ మెఱిఁగి యుండియు నడలు చున్నా రేమి?

మారు—భ్రమరకా! నీ వన్నది నిజమే.

ఉత్సాహ. ఒక్కదంతి యెంత? కోటియుగ్రమత్తకుంభులున్
మొక్కవోనివిక్రమమున మొనసెడుకలకంఠునిన్
గక్కసముగఁ దాఁకి వానిగాథ మైనచండిమన్
నిక్కముగ సహింపఁ జాలునే తృణంబు నాజిలోన్? 4

అయినను—

తే. గీ. ప్రాణమిత్రుఁడు గ్రమ్మఱ వచ్చి నాదు

కంటఁ బడుదాక శోక మగ్గలము నాకు;
స్నేహకాతర మైనట్టిచిత్త మకట!
హేతువులు లేనియాపత్తు లెంచుఁ గాదె? 5

(తరువాత వేగిరపాటుతో బాటసారివేషమున శంబరకశిష్యుఁడు కలవింగకుఁడు ప్రవేశించుచున్నాఁడు)

కలవిం— (మారుతునిఁ జూచి)

తే. గీ. మల్లికాయుల్లకంబున నుల్ల ముడికి
యక్కజపుబుద్ధి శాలి మాయయ్యవార
లెఱుకపడ కుండ నితరుల కెనసికేని
ద్రోహ మొనరింతు రట్టిమారుతుఁడు వీఁడె. 6

వసంతవనోద్యానముననుండి యేతెంచుచు మాకుఁ గనఁబడినాఁ డని సింహముఖబర్బరులు నిజమే చెప్పినారు.

మారు—(చూచి)

తే. గీ. ముంగు గీఱినయొడలితోఁ, గండె గట్టి
దుమ్ము పాఱినయిరుచిఱుదొడలతోడఁ,
బయనపుంబడలికఁ దొట్రి నడుచు నెవఁడొ
వచ్చుచున్నాఁడు కాఁడారి బాటసారి. 7

కలవిం— (విషాదముతో) అయ్యో పాపము! మాయుపాధ్యాయులవారికుంజరోన్మాదనప్రయాస మంతయు వమ్మయ్యెను గదా! కానీ మఱి యొకయుపాయము ప్రయోగించెదను. (తొట్రుపడు మనమాపించుచున్నాఁడు)

భిక్షు—స్వామీ! మెడలో జందె మున్నది. ఇతఁడు బ్రాహ్మణుఁడు గానోపును.

మారు—బ్రాహ్మణా! మార్గాయాసము గలనీవు భ్రమసిపోయినట్లు గూడ నగపడుచున్నా వెందుచేత?

కలవిం— (ఆవేగము నటించుచు) అయ్యా! నా ప్రాణముఁ గొంచెము కుదురు పఱుచుకొని సర్వము మీతో మనవి చేసెదను. నా కిప్పటికిని గుండెదడ వదలినదికాదు. దిక్కు లన్నియు నాకు ద్విరదమయములయి కనఁబడుచున్నవి.

మారు—(తనలో) అయ్యో! పాప మీదీనుఁడు గూడ వేదండమునకే వెఱచుచున్నాఁడు. (ప్రకాశముగా) భీరుఁడా! భయపడక చెప్పు. ఇప్పు డాయేనుఁ గెక్కడ నున్నది?

కలవిం— (నిట్టూర్పుతో)

ఉ. ఏ విను మాంధ్రభూమి వసియింతును గొండొకగ్రామమందు; గో
దావరితీరవాసి; హరదత్తుఁ డటందురు నన్ను విప్రుఁడన్
భావమునందు సంసరణపంకజుగుప్స జనించినందునన్,
బోవుచు నున్న గాంగరుచి, ముమ్మొనవాల్దొరమౌళిపూరిన్. 8

మారు—అహో! తీర్థయాత్రాపరుఁడవా? ఎంతయదృష్టము!

కలవిం—తే. గీ. తెరువుబడి వచ్చుచును సోమసరసునందుఁ
గ్రుంకఁ బోవంగ నే, మణికూటపరిస
రాటవిని, గుండె జల్లన, నాము కవిపి
కొమ్మ కేనుఁ గొకందు నన్ గూడ ముట్టె. 9

మారు— (జనాంతికముగా) భ్రమరక! కలకంఠుఁ డెక్కినదే సుమీ యాకొమ్మకే
నుఁగు. (ప్రకాశముగా) అహో! మహోగ్రపనము సంభవించెను గదా! చె
ప్పు చెప్పు. దాని కెట్లు దప్పితివి.

కలవిం— ఉ. మావఁతుఁ డొక్కరుం డుదిరిమాదిరిఁ బచ్చిమేనివాఁడు, త
గ్గిన నిరంకుశుండు గ నధిష్ఠితుఁ డై యతిసాహసంబునన్
నోవఁ బదాగ్రఘట్టనవినోదము సల్పుచుఁ గర్ణమూలమున్
దావిలసద్దయాబ్ధి, మదహస్తి నదల్పఁగఁ జొచ్చెఁ జెచ్చెరన్. 10

మారు— (జనాంతికముగా) సందేహము తీఱినది. అడ్డు లేనియేనిక నంకుశము లేకయే
యదలింపఁ గలవాఁడు కలకంఠుఁడే గాక మఱి యెవఁడు? (ప్రకాశముగా)
తరువాత?

కలవిం—(కన్నీరుపెట్టికొనుచు) అయ్యో! పయిమాటను నాకు నోరాడకున్నది.

మారు—(ఆవలుతో) చెప్పు పిమ్మట నేమి జరిగినది?

కలవిం—

శా. కట్టా! కట్టలుకన్ బలాఢ్యమదనాగం బడ్డు మూర్ధంబు ని
ట్టట్టాడించుచు వాని శైలస్కంధము నయ్యాలూఁచి కూల్చెన్ మహిన్;

మారు—హా! ప్రాణసఖ! కలకంఠ! నీవేల పడిపోయితివి?

కలవిం—పుట్టం బూడఁగ వెండి వాఁడు నెగసెన్;

మారు—(ఆసతో) తరువాతఁ దరువాత?

కలవిం—కుంపెన్ గజం బుప్పతిన్ బఱ్ఱెన్;

మారు—(అపేక్షతో) తరువాత?

కలవిం—హా! సఖ! మారుతా! యఁతుదిన్ వాఁడీల్గె పంథాహతిన్. 11

మారు—(కన్నీళ్ళు గాఱ రోదనము చేయుచు)

క. హాహా! బంధుజనేందూ! హాహా! పరిపంథిసింధురాహార్యపవీ!
హాహా! మారుతజీవిత! హాహా! కలకంఠ యెంతయాపదమూఁడెన్. 12

(మూర్ఛిల్లుచున్నాఁడు)

భ్రమ—(కన్నీళ్ళతో, రోదనము చేయుచు, మారుతునిఁ బట్టుకొని) హా! స్వామీ! కలకంఠ! తాదృశపరాక్రమాపహసితమృగేంద్రుండ వయిననీ కాకరికీటమువలన వినిపాతము?

కలవిం—(సంతోషముతోఁ దనలో) నానీతివృక్షము ఫలించినట్టే; (ప్రకాశముగా) అయ్యో! యెంతకష్టము! నేఁ బ్రియమును జెప్పవాఁడ నయితినే! అయ్యో! పాపము! ఇటువంటిదుఃఖము రాఁగూడని యీమహాభాగుఁ డెవరు? ఈయనకుఁ బ్రేమాస్పదుఁ డయి మదద్విరదముకరమందుఁ బువ్వుబంతియగుచున్న యామహాపురుషుఁ డెవ్వఁడు?

భ్రమ—అయ్యా! యీయన మతిప్రభావవశీకృతసకలమహీమండలుం డగు నమాత్యాని హృద్దత్తుఁడుగారికుమారుఁడు మారుతుఁడుగారు. ఆయన యీదొరకుఁ బ్రియమిత్రుఁడు కలకంఠుఁడు.

కలవిం—(మిథ్యావిషాదమును గనఁబఱుచుచున్నాఁడు)

మారు—(కన్నులు దెఱచి) సఖుఁడా కలకంఠ! యే మిది? నన్నాకస్మికముగా వదలి వేసితివి. (నిట్టూర్పు విడిచి)—

ఉ. జానువు లంటుబాహువులు జాబిలివంటి మొగంబు గల్గి, యే
న్యూనత గాని లేని దయి యొప్పెడునీదుకడానిఁ బోలినె
మ్మేనకటా కటా! యనుఁగు మిత్రమ! వజ్రకఠోరధార మా
నేనుఁగుఁగొమ్మురోఁకటుల కేకరణిన్ విధి పాలు చేసెనో. 13

కలవిం—సుహృద్విపత్తివ్యసనములు దుస్సహములు గదా!

మారు—

మ. గురులం దన్పఁగ లేదు సేవలను గైకో లేదు గేస్తుంపసం
బు బుణత్రయ్యుపశాంతి కీప్సితములం బూరింప లే దర్థికిన్;
హరిదంతంబులఁ బూయ లేదు యశ మీ వాలింప లే దంగనా

చరితం బెత్తుక పోయెనే విధి, వయస్యా! ని న్నకాండంబునన్. 14

భ్రమ—అయ్యో! నాటుకొన్నతోడనే యీపారిజాతపోతము తెలియ కుండఁ బడిరక్కడిఁదిపిడుగుచేతఁ గాలిపోయినది.

మారు—(గద్గదికతో)

ఉ. ధీరతపట్టు వీడెను, గతించెను సజ్జనభావమున్ నిరా
ధారత నొందె నీతి విరతం బయి పోయె నయో! ప్రియోక్తియున్;
ధారుణిఁ బాసె నమ్మకము, దారెను బంధుతపంబు సర్వమున్;
చేరనె యుక్కిఁ గాంచుటను నీ వకటా! కలకంఠుఁడా! సఖా! 15

అయ్యో! యూరక యిట్లు విలపించుచు నాలసింప నేల? మణికూటమున కేగి భృగుపాతమునఁ బ్రియమిత్రునిమార్గము ననుసరించెదను. భ్రమరకా వెళ్ళు. స్కంధావారము నిక్కడనుండి మానగరమునకుఁ దీసికొనిపొమ్ము.

భ్రమ—(విషాదముతో) స్వామీ! యేమిది? విరుద్ధకార్య మారంభించితిరి. (కాళ్ళమీఁదఁ బడి) నాథా! సరాజకము, సబంధువర్గము, సరాజపుత్రమండలము సగజతురగపదాతిస్యందనము నగునీసకలకుంతలవిషయమును గాపాడుఁడు. ఇంతయు మీరే జీవితము గదా!

మారు—(శూన్యవదనుఁ డయి నవ్వి)

ఆ. వె. దుఃఖితుండ నయిన దుఃఖియు।సుఖితుండ। నయిన సుఖియు నెవ్వఁడట్టిసఖుఁడు
ధరణిఁ గీర్తిశేషతనుఁడైన జీవంబు। లజ్జగింప కుండి లజ్జ పడను.

కలవిం—(ఆనందముతోఁ దనలో) నిశ్చయముగా నితఁడు వచ్చును. ఆహా! యాకాశవాణీప్రయోగకోవిదుఁడ నయిననామతిప్రకర్షము సర్వాకషము గదా!

ఆ. వె. నైజభ్రూత్క్షేపవిభ్రమాయోజితోగ్ర। సైన్యనాసీరవీరజర్జరితవైరి
యైనవిక్రమనిధి నిట్లు హతముసేయ। నోపునాబుద్ధి యత్యంత మూర్జితంబు.

కాఁబట్టి యీవృత్తాంతమున మాగురువుగారిని సంతోషపెట్టెదను. (విమర్శించి) అట్లు కాదు. ఈబాటసారివేషముతోడనే పోయి, సోమసరస్తీరమున నున్నమల్లికకు మారుతుని మరణము నివేదించెదను. ఇట్లు చేసితినా యామె వీనియెడల నివృత్తానురాగయయి తనంతన గురువుగారిని పెండ్లియాడ ననుమతించును. కాత్యాయినీవచనైకప్రమాణుఁడయినవిశ్వవసుఁ డీవటికే యొప్పుకొన్నాఁడు.

భ్రమ—(కలవింగకునితో) అయ్యా! మహాదారుణ మయినమాదౌర్భాగ్యమును మీరు నివారింపుఁడు.

కలవిం—ఓయీ! యింతయనురాగము గలయీమహాపురుషుని ప్రయత్నము దుర్నివారము సుమీ. నే నిట్టిఘోరములు చూడలేను. గంగా దర్శనము గావించునంతకు క్షణమాత్రమయిన మార్గాలస్యము సయిఁపఁజాలను. పోయి వచ్చెదను. (నిష్క్రమించుచున్నాఁడు)

భ్రమ—(తనలో) వీఁ డెవఁడో మహానృశంసునివలె నగపడుచున్నాఁడు. (ప్రకాశముగా) స్వామీ! యింతయనురక్త రాలయినమల్లికను గూడ నుపేక్షింతురా?

మారు—ఓరి వెఱ్ఱివాఁడా!

క. దేహము విడుచుచుఁ గూడను । స్నేహార్ద్రిత నెవఁడు నన్నుఁ జేరె నతనితో
రాహిత్య మావహిల్లన్ । హాహా! మల్లిక యదేల నాఁ బ్రతుకేలా? 19

(తరువాతఁ గలకంఠుఁడు ప్రవేశించుచున్నాఁడు)

కల—(అనురాగముతో)

ఉ. కాటుక జాఱువెల్లఁ దెలిగన్నులనిగ్గులచేఁ గొలంకుపై
న్నీటను ఱెట్టిగాఁ గుముదనీరజముల్, జలకంబులాడున
బ్బోటిపయఃకణాన్వితపుముగ్ధకపోలము లొప్పునంపపుం
దేటమొగంబు నాహృదయదేశము దా నెడఁ బాయకుండెడున్. 20

ఏనుఁగును దూరముగాఁ దఱిమి వేసినప్రియమిత్రుని వసంతవనసమీపమున వెదకెదను. (నడచి చూచి విషాదముతోడను భయముతోడను) ఏమిది! యితఁడు కన్నుల బాష్పజలములు జాలువాఱ దుఃఖించుచుండఁగాఁ, గాళ్లమీఁదఁబడి భ్రమరకుఁడు బతిమాలుకొని యెట్టెట్టో యూఱడించుచున్నాఁడు. (సమీపించుచున్నాఁడు)

భ్రమ—సామీ! తమ రట్లే కావించుపక్షమున సకల మయినస్కంధావారమును ముందే భృగుపాత మొనరింపఁ గలదు.

కల—(భయవిషాదములతో) సకల మయినస్కంధావారమును ముందే భృగుపాత మొనరింపఁగల దనుచున్నాఁ డిది యేమి?

మారు—(వినకయే పైకిఁ జూచి)

క. నన్ను విడిచి దివి కిచ్చను । మున్నే వరుగుటకు సిగ్గు పొడమదె సఖుఁడా!

కల—అయ్యో! నేను జీవించి యుండఁగాఁ బ్రియవయస్యుఁ డన్యథా తలంచుచున్నాఁడు.

మారు—నిన్నుం గలసెద వేగమ । యన్నా! గజరాజగమన! యను గాఁగఁ గదే 21

కల—పాపము శాంతించును గాక. అమంగళ మడంగును గాక. (త్వరితముగా సమీపించి) చెలికాఁడా! సకలమహీమండలమండనమ మయిన నిన్ను నిష్కారణ మమంగళము లాడుకొనియెద వేమి?

మారు—అహో! యిది కలకంఠుని స్వరమే!

భ్రమ—(చూచి) సామీ! మన మదృష్టవశమున బ్రదికినారము. కలకంఠుఁడుగారిదిగోఁ దిరిగి వచ్చినారు.

మారు—(హర్షగద్గదికతో) కలకంఠుఁడా! రమ్ము రమ్ము. నాకంఠమ్మును గౌఁగిలించుకొమ్ము. బాష్పపూర్ణము లయి నాకన్నులు నిన్నుఁ జూడఁ జాలకున్నవి.

కల—(నెయ్యమునఁ గౌఁగిలించుకొని) చెలికాఁడా! యిది యేమి?

భ్రమ—సామీ! గోదావరీతీరవాసి నని యొకబాటసారి వచ్చి కుంజరవృత్తాంతము నట్లు చెప్పినందునఁ జతి నలుకుట కిటు దొరవా రుద్యోగించుచున్నారు.

కల—(విమర్శించి) శంబరకశిష్యుఁ డయిన మాయలమారికలవింగకుఁడు ప్రియవయస్యుని వంచించె నని తలంచెదను. మల్లికార్థి యగు శంబరకపశువు మనకు ద్రోహము చేయఁ జూచుచున్నాఁడు గదా!

(తెరలో) హా! సకలలోకలోచనఫలమహాభాగ! నీ కంఠతటియనురక్తురాల నయిన నన్ను విడనాడి స్వర్గవిలాసినీలోలుపుఁడ వయితి వేల? అపహాసితకుసుమాయుధగర్వుని నిన్నాయచ్ఛరలు వలలో వేసికొన కుండ నిదిగో నేను వచ్చి వారించుచున్నాను.

అందఱు—(ఆలకించుచున్నారు)

మారు—(సాకూతముగా)

తే. గీ. ఏణశాబవిలోచన దీయెలుంగు। నాధృతి గలంచి డెందంబు నాఁచికొనెడు
వ్యాధశరవిద్ధనిజవల్లభాతిశోక। దగ్ధకురరీరణనముగ్ధతార మగుచు. 22

కల—రోఁకండ్లతోఁ గ్రుమ్మి చంపఁదగిన యాకలవింగకుఁడు మల్లికను గూఢమూర్ఛ పుచ్చె నని నాకుఁదోఁచుచున్నది. శీఘ్రముగా మన మామెను జేరఁ బోవుదము.

(వేగమున సమీపించుచున్నారు)

భ్రమ—సామీ! యాపూజ్యురాలి పాపటనుండి జాఱి పడినది కాఁబోలు. ఇదిగో నిక్కడ శిఖామణి ప్రకాశించుచున్నది.

మారు—ఏనుఁగుభయమునఁ గలఁతపడి తొట్రుపాటుతో నడచుతొందరలో నీరతన
ము పతనము నొందియుండును. (తీసికొని సస్నేహముగా)

క. నీరదమున సౌదామని । తీరున సఖిచికురమునఁ బ్రదీపించితి వ
య్యో! రతనమ! యటఁ బాయుట । నీరొలికెడుఁ గంటఁ జూడ నేటియవస్థన్

(మరలఁ దెరలో) కాళిందీ! పట్టుకోవమ్మా. పట్టుకోవమ్మా. ప్రియసఖి మల్లిక మూ
ర్ఛిల్లి పడి పోవుచున్నది.

అందఱు—(విని త్వరితముగా సమీపించుచున్నారు)

(తరువాత నవమాలికా కాళిందులచేతఁ బట్టుకోఁబడి మూర్ఛానిమీలితాక్షి యగుమల్లి
కయుఁ, దత్తఱపాటుతో రమయంతికా మధురికా సారసికలును బ్రవేశించు
చున్నారు)

రమ—(సవిషాదముగా) అయ్యో! మల్లికకు నవయావము లేమియుఁ గనఁ జూడఁగానరాదు.

నవ—(కన్నీటితో) మన మెవరి కేడ్తము. మహాభాగునకా? మల్లికకా?

అందఱు—హా! సఖీ! మల్లికా! నీవు గూడ మహాభాగు ననుగమించి పోయితివా?

సార—కాళిందీ! మూర్ఛను బోఁగొట్టు సామర్థ్యము గలశిఖామణి యెక్కడఁ దొరలిపో
యిన దమ్మా?

నవ—హా! మల్లికాహృదయవల్లభ! మహాభాగ! మారుత! నీనిమిత్తమున మూర్ఛిల్లిన
యీమెను బట్టుకొమ్ము.

మారు—(తత్తఱమునఁ బ్రవేశించి) నవమాలికా; యిదిగో! నేను వచ్చితిని. పట్టుకొని
యెదను.

అందఱు—(చూచి యానందముతో) సంతోషము, సంతోషము. అక్షతశరీరుఁ డయి
మహాభాగుఁడు మరల వచ్చినాఁడు.

నవ—(సహర్షగద్గదముగా) మహాభాగ! హర్షపారవశ్యమునఁ బర్యాకుల నయినే నే
మియును ననలేకున్నాను. బ్రదుకే సంశయముగా నున్న ప్రియసఖిని మల్లికను బ
ట్టుకొమ్ము.

మారు—(విషాదానురాగములతోఁ బట్టుకొన్నాఁడు)

రమ—(వెనుకఁ దిరిగి) మధురికా! యిదిగోఁ బ్రత్యక్షమన్మథుఁడు మహాభాగుఁడు మా
రుతుఁడు. ఈయనయే గదా నాజీవితప్రదానమహోపకారికిఁ బ్రాణసఖుఁడు.
ఈయనయందు మల్లికకు స్నేహసంబంధము తగియే యున్నది. అదృష్టవశమున
నా బొటసారిపినుఁగుమాట లబ్ధ మయినవి గదా!

మధు—సఖి! రమయంతికా! యీదురాత్ముఁడే గదా సారెసారెకు వికారముగా నీ వంకఁ జూచుచు వచ్చినాఁడు.

రమ—చాలులే. ఆవచ్చినవానిప్రసంగ మిఁకఁ గట్టిపెట్టు.

కాళిం—సఖీ! తెలివి నొందుము. తెలివి నొందుము. తెలివి నొందుము. కల్పాంత దీర్ఘాయుష్యుని మహాభాగుని విలోకింపుము.

మల్లి—(తెలివి నొందుచున్నది)

మారు—(ఆనందముతో) నవమాలికా! యేమన కేమనకు, మీప్రియసఖి తేఱుకొను చున్నది. చూడుము.

ఉ. నిద్దము లైనవల్లనిక నీనిక లన్ వికసించె వాల్గనుల్,
సద్దడఁగెం గ్రమంబుగఁ గుచంబు లపర్చెడు గుండెదిబ్బునన్,
ముద్దియమోము రాహుపరిముక్తసుధాకరమండలంబుతో
నుద్దిగఁ దోఁచె మోహతమ మోలిని దూలి ప్రసన్న మౌటచేన్. 24

మల్లి—(స్పర్శసుఖము నభినయించి) సఖులారా! నే నమృతసరస్సున నుంటినా? కాక మరణించి పోయి స్వర్గములో నామహాభాగునిఁ గలసి కొంటినా?

నవ—సఖి! మల్లికా! స్వర్గమునందుఁ గాదు, ఈసోమసరస్తీరమందే లక్ష్మీవిలాసప్రాసాద మయినమహాభాగునివక్షస్స్థలమం దున్నదానవు.

మల్లి—హర్షముతోఁ జూచి మహాభాగ! భాగ్యవశమున మిమ్ము మరలఁ జూడఁగాంచితిని. నిజముగా బ్రతికితిరా?

మారు—(వెనుకఁ దిరిగి)

క. నీవిపుడు మూర్ఛ దేలితి। కావున నే నిజము బ్రతుకఁ గంటిని, గాదేన్
జీవకథ గలదె యంగజ। దావానలకీలజాలదగ్ధున కబలా. 25

కల—(సమీపించుచున్నాఁడు)

రమ—(సంతోషముతో) మధురికా! యదృష్టవశమునఁ గలకంఠుఁడు కూడ వచ్చినాఁడు.

మధు—సఖీ! భాగ్యవశమున నాపాపిష్ఠుఁ డీయన కమంగళమును జెప్పినాఁడు కాఁడు. చెప్పియున్నచో మల్లికకుఁ గలిగినట్లే నీకును మూర్ఛావ్యసనము సంభవించి యుండును.

కల—ఏమీ! బాటసారివేషముతో వచ్చిన శంబరకశిష్యునిచేత మీరును మోసపోయితిరా?

సార—(జనాంతికముగా) కాళిందీ! వీనిస్వరము గూడఁ గరభఘర్ఘరమయి యల్లయా కాశవాణి ననుకరించుచున్నదని చెప్పితినిగదా?

మారు—కలవింగకుఁడు నాకు నపకారి యయినను మహోపకారమే చేసినాఁడు.

తే. గీ. తరుణి యాలించి నాదుమిథ్యావిపత్తి
దలఁచె నిశ్శంకముగ జీవితమును బాయ
నఖిలవిస్రంభపాత్ర మవ్యాజమైన
ప్రేమసర్వస్వ మిందుచే విశదపడియె. 26

(తెరలో) భుజస్తంభస్తంభితప్రతిభటకరటిఘటు లగు సేనాభటులారా! మణికూటక టకంబులయందును వసంతవనోపకంఠంబులయందును, సోమసరఃకూలోపశల్యంబుల యందును బరిపంథిసింధురకంఠీరవుం డగుకుమారమారుతుని, సమరార్ణవమందరదో ర్దండుం డగు కలకంఠుని మీర లన్వేషింపుఁడు. వార లిరువురు భ్రమరకమా త్రపరిజను లయి మాకుఁ దెలియ కుండఁ దద్గ్రాలప్రభిన్నమదరోషామర్ష దురుపస ర్పంబు లయినకుంజరంబుల డీకొన్నవారు (అందఱు వినుచున్నారు)

కాళిం—(చూచి) అహో! ప్రచలత్కులాచలసహస్రసాదృశ్యంబు లయినభీషణ గజఘటలచే నిరుద్ధపురోభాగం బయి వలత్తురగఖురకుద్దాలోద్దళిత ధరిత్రీతలచలిత ధూళిపాళికలచే ధూసరితదిశాముఖం బయి యిదిగోఁ జమూసమూహ మీలాగున నే వచ్చుచున్నది.

మారు—భ్రమరకా! వెళ్ళువెళ్ళు. సంభ్రమము వలదు వల దని వారింపుము.

భ్రమ—చిత్తము దేవా! (నిష్క్రమించుచున్నాఁడు)

నవ—ఆహా! భ్రమరకముఖనిర్గత మయినముదల చెలియలకట్టగా సేనాసాగర మ క్కడనే నిలిచిపోయెను.

మల్లి—(జనాంతికముగా) అయ్యో! యింతటిసైన్యచక్రమునకు నధినాథుఁడయి న సకలలోకమండనభూతుఁడు మహాభాగుఁడు నానిమిత్తమున నేకాకి యయి భ యంకరద్విపదమున కభిముఖముగాఁ బరుగువారెను గదా!

నవ—సఖి! యిప్పు డయిన నీవు తిన్నగాఁ జేయవు. నిన్నాయనకు సమర్పించుకో వు గదా!

మల్లి—సఖీ! పితృపరతంత్ర నిని, నే నేమి చేయఁగలను? మల్లికావరనిర్ణయమున భగ వతి కాత్యాయనీదేవియే కాని నేను బ్రమాణము కా నని మీనిసన్నిధానమున నా యనగారు ప్రతినచేసిరి గదా?

(ప్రతీహారి కనకలత ప్రవేశించుచున్నది)

కన—వనమాలికా! మనయమ్మగారు దుస్సహదుఃఖసంతప్తహృదయురా లయి భర్తృదారికను శీఘ్రముగా నింటికి దోడుకొని రమ్మని యాజ్ఞాపించినారు. ఆమె సకలపరిజనపరివృత యయి వసంతవనపరిసరమున వేచి యున్నారు.

వన—(భయముతో) కనకలతా? యమ్మగారు దుస్సహదుఃఖసంతప్తహృదయురా లెందుచేత?

కన—(విషాదముతో) భర్తృదారికకు శంబరకుఁడు వరుఁ డని కాత్యాయనీభగవతి యమాత్యులవారి కానతిచ్చినది కాదా?

(మల్లికామారుతులు విషాదము నొందుచున్నారు)

సార—(జనాంతికముగా) సఖి! కాళింది! యది యామాయబాటసారి యగుశంబరకశిష్యుని వంచనప్రభాషము గాని నిజము గాదు.

కాళిం—(ఖేదముతో) కటకటా! పసివాడినసోముఁదామరలచే గుండెతల్లడము వెల్లడి యగుచున్నయీమల్లికామారుతుల యేతద్దురవస్థ నేను జూచి భరింపఁ జాలకున్నాను.

రమ—(జనాంతికముగా) మధురికా! మన్మథుఁ డెంతవెగటుపని చేసినాఁడే; పరస్పరసదృశానురాగు లగువీరి కకాండవియోగ మాపాదించెను.

మారు—(దుఃఖముతో)

చ. సొగియుచు నీమె నేఁ గొలుతఁ జూచిన నాఁటఁటు లంకురించి యే
పుగఁ బ్రగమస్పృష్టమై పనిచి పూచి ఫలోన్ముఖమైనయస్మదీ
యగురుమనోరథక్షితిరుహం బకటకటా! కూలి పోయె నే
మిగులఁ గృతాంతవైశసనమిష్టమహాశనిపాతదగ్ధమై. 27

మల్లి—అయ్యో! మల్లికా! యిపాటిదే నీబ్రతుకుఫలము? హా! తల్లి! కాత్యాయని! నన్ను రాక్షసునిహస్తముఁ బెట్టితి వేమి?

మారు—(మల్లికముఖము చూచి తనలో)

చ. పరికొన కుండఁ గాక పరితాపమునన్ భిదదీయచిత్తమై యో
గిరిసుత! తల్లి! దుఃఖభరఖిన్నముఖున్ ననుఁ జూచె; నక్కటా!
తొరఁగుకృపాశ్రుబిందువులతోఁ గనుపట్టెడు దేవి నీకనుల్,
కరము విషణ్ణవక్త్ర యగుకన్నియ నీమెను జూచి యేసగున్. 28

కన—వనమాలికా! భర్తృదారికను జూపెమి యమ్మగారు వగచుచున్నారు కాఁబోలి

త్వరితముగా నీమెను గొనిపోవుదము.

నవ—(విషాదముతో) భర్తృదారికా! యిటు. ఇటు.

మల్లి—(సబాష్పగద్గదముగా వెనుదిరిగి) నయనాభిరామమహాభాగ! మరణైకశరణు రా లగుమందభాగిని మల్లిక వీడుకొనుచున్నది.

నవ—భగవతీ! కాత్యాయని నీవు దయార్ద్రహృదయవు గావా? నీపాదములే యాధారముగా నున్నయీమల్లికకు జీవితసంశయావస్థ దెచ్చి పెట్టితి వేమమ్మా? ఒకవేళ నీయాదేశ మిట్లు కాలేదేమో. ఇది కూడ నాళంబరకశిష్యుని వంచనమే కావచ్చు నని తలంచుచున్నాను.

సార—(జనాంతికముగా) కాళింది! నవమాలిక యథార్థము పలికినది.

మల్లి—(తనలో) అయ్యో! మల్లికా! యింతటిదే నీబ్రతుకుఫలము? హా! తల్లీ! కాత్యాయనీ! నన్ను రాక్షసునిహస్తమునఁ బెట్టితివేమి? (నవమాలికతో నిష్క్రమించుచున్నది)

రమ—సారసికా! నే నెటు లయిన నీమల్లిక ననుగమించెదను. జీవితదానమహోపకారి యయినమహాభాగుని నేను సెల వడుగ లేను.

సార—మహాభాగ! నీవిచ్చిన శరీరమును దీసికొని రమయంతిక యింటికిఁ బోవ ననుజ్ఞ వేఁడుచున్నది.

కల—గృహము నలంకరించుము గాక.

కాళిం—సారసికా! తమహృదయంబులను భరియింప వలసినభావికాలదుస్సహవిరహావేదనను దలపోసికొనుటవలన సవిశేషవర్ధమాన మగుమదనానలంబు ధూమంబునుం బోనిదీర్ఘతరనిశ్వాసంబుతోడను, నుద్దామవిభ్రమోల్లసితభ్రూలతాకలంకితము లయినక్రేఁగంటిచూపుకోపులు ప్రకటించెడు ప్రణయానురాగసర్వస్వంబుతోడను నొడలెల్లను గ్రమ్ముకొన్నక్రొంజెమటలం దోఁచిన యొండొరులప్రతిబింబముల మూలమునఁ బ్రాప్తించుగాఢోపగూహనసుఖంబునం జేసి నారుమొలచినతీరునఁ దలచూపుపులకనికరంబుతోడను రమయంతికాకలకంఠు లెట్టు లున్నారో చూడు చూడు.

కల—(అనురాగముతోఁ దనలో)

సీ. అనయంబుఁ బ్రణయంబునను జంచలము లౌచు బ్రేమంబునను జాలఁ బెద్ద వగుచు
మన్మథస్వామికి జన్మదేశము లౌచు ధైర్యంబునకు విక్షేపకము లగుచు
స్వాంతాపహారణసమర్థంబు లౌచు సాదెకుఁ జలానిలకనీనికము లగుచు

నలిని, తరంగితములు ఘూర్ణితంబులు స్తిమితంబులును మధురములు స్నిగ్ధ ములును ముగ్ధంబులు నావవమోహనాంగి! చారునయనాంబురుహవిలాసంబులవాహి నాపయిం బ్రసరించుచుండదము దలంప! జల్లుమని మేను పారవశ్యము వహించు.

మధు — ఇటు. ఇటు.

రమ — (వెనుకకుఁ దిరిగి) మధురికా! పూర్ణచంద్రసుందరుఁ డగుమహాభాగునిమర లఁ జెప్పుడయినఁ జూడఁ గాంతునా?

మధు — సఖీ! ముందుగ రుద్రహాసుఁ డొకఁడు శంబరకి పక్షపాతి యని సంశయము. కానిచో దర్శనమే కాదు, వేలొకటియు సులభమే సుమీ.

రమ — (నిట్టూర్పుపుచ్చుచు నెచ్చెలితో నిష్క్రమించుచున్నది.)

మల్లి — వనమాలికా! కర్ణాంతదీర్ఘవిశాలలోచనపుండరీక మయిన మహాభాగునిముఖ చంద్రమండల మితఃపరము దుర్లభదర్శనము గదా! అందుచేతఁ గలవుడీల నిప్పుడే యింకొకమారు చూచుకొనెదను. (మోముద్రిప్పి కన్నీళ్ళతోఁ జూచుచున్నది)

సార — కాళిందీ! చూడు. సకరుణానురాగనిపతితముఖచంద్రమండల యగుమల్లిక నేత్రములు, బాష్పపూరపూరితము లయి తుషారకణకదంబితకమలపత్రములకు మిత్రము లగుచున్నవి. కాఁబట్టి మనము పోయి యామెనాశ్వాసితము పద.

కాళిం — సఖీ! మహాభాగుఁ డిట్లుండఁగా మనకుఁ బోనఁ గాళ్ళాడునమ్మా?

మారు — మీరు మల్లిక ననుసరింపుఁడు.

కాళిం — మహాభాగ! యిదియు వారాణసీపక్షకవచనముకంటె వేఱు కా దని తలంచు కొమ్ము. వానిస్వరమాకాశవాణీస్వరమును బోలి యున్న దని సారసిక చెప్పు చున్నది.

సార — మ రేమి?

కల — ఇది పోలియున్నది. వానిదుర్నయవిలసితము లిట్టివే.

మారు — (తనలో) ఇవి యూటలు గదా! (ప్రకాశముగా) కాళింది! మల్లికా సీమంతలాలిత మయినరత్నమిదిగో. (మణి నిచ్చుచున్నాఁడు)

కాళిం — (పుచ్చుకొని) అయ్యో! వెదకినను మాకిది కనఁబడ దాయెనే. (నిష్క్రమించుచున్నారు)

మారు — (నిట్టూర్పుపుచ్చి) హా! దరి యంచు లేనిదుఃఖసాగరమునఁ బడితిని గదా!

చ. తహతహ మీఱుతన్ బొడముతన్ బలుమూర్ఛలు దాల్మిమాలుతన్
బహుళత నాధి గాంచుత మపారసుఖేచ్ఛ నశించుతన్ మదిం

డహితత మేను గోసి తని నందుత బెంగ యొసంగుతన్ గనున్
గ్రుహిణుఁడు తుల్యరాగజనదుర్లభతాఘటనన్ గృతార్థతన్. 29

కల—మిత్రుఁడా! మల్లికామారుతులకు మీ కనురూప మగుపాణిగ్రహణమంగళము సర్వమంగళ కసమ్మత మనుట సంగత మగునా? చూడు.

తే. గీ. సేవచేతఁ బ్రసన్న యాదేవిసుప్ర
సాదమూర్తుఁలు గద మీ రసంశయముగ
భావమున నేను దద్వాగుపజ్ఞ మైన
విఘ్న మిది యించు కేనియు విశ్వసింప. 30

మారు—కలకంఠా! కర్మవిపాకములు కరము విచిత్రములు గదా! ఇది యవిశ్వసనీయ మె ట్లగును? చూడు.

క. కలిగించు శుభాశుభములు। తొలుతటికర్మములు సుఖము దుఃఖము; దైవం
బల రెంటిని గుడుపు మిఁకఁ దా। నలరుఁ దటస్థుఁడుగా నుదాసీనుండై. 31

కల—ఏల యిట్లు పలికెదవు? కలవింగకవృత్తాంతము వయస్యునకుఁ బ్రత్యక్షమే గదా!

మారు—(ఆలోచించి) ఆహా! సంశయస్థాపితుండ నయితిని గదా! (తనలో) ఇందుల కేమి చేయుదును? (గర్వముతో) ప్రణతజనపారిజాతవల్లిని భవానిని బ్రసన్నరాలిం జేసికొనియెదను.

తే. గీ. గౌరియాలయమునకు నొక్కరుండ నేగి
విఫల మగు నాదు ప్రాణముల్ విడుతు నొండెఁ
బ్రాణవల్లభ మల్లికఁ బడయువాఁడ
నొండెఁ దద్దేవి పాదాబ్జయుగము గొలిచి. 32

(ప్రకాశముగా) మిత్రుఁడా! కలకంఠ! నీహృదయము దమయంతికాక్రాంతము గదా!

కల—(సిగ్గునఁ జిఱునగవుతో) వయస్యా! సత్యము గనుఁగొంటివి.

చ. కలితనిగూఢభావములు గాఢతరోత్కలికంబులున్ సబా
ష్పలవసముద్గమంబు లగుభవ్యకటాక్షము లాపె నాపయిం
బలుమఱు చిమ్ముచుం బిఱుఁదుబర్వున మందరమందయాన మై
నిలయముఁ జేరుచుండియును నెచ్చెలి నాయెడఁ దం జరించెడున్. 33

మారు—కలకంఠ! మదపుటేనుఁగా మెను బట్టుకొనఁ బోవుచుండఁగాఁ బయినుండి నీ వేలాగున బ్రతికితివి?

కల—మిత్రుఁడా! నీవు క్రమముగ మాగ్రపరిజనూఢ వయి వసంతవనమున నుంటి వని నేను విని త్వరితముగా నీయొద్దకు వచ్చుచుండఁగాఁ దారిలోపల సాహసిక నా నీల్గి నన్ను సోమసరస్తీరమునకుఁ గొంపోయినది.

మారు—(తనలో) అవురా! యితనిని కూడ సాహసికయే దీసికొనివచ్చెనా? (ప్రకాశముగా) తరువాత?

కల—తరువాత జలక్రీడానంతరమునఁ, గదలినదువనుండి కలువలునుం బోలె సరోమధ్యమునుండి బయలువెడలు రమయంతికను నేను జూచితిని.

మారు—తరువాత?

కల—తరువాత—

ఉ. స్నానముచేసి వెల్వడి జలప్లుతదింపుతరంగితాంగియై ప
ద్మానన, సక్తమాత్మవిమలాంబరలోకనితంబభారయై దీ
రానను నిల్చినాపయిని రాలెడుచూపుల దాని, మన్మథుం
డానను బోణి నామనసునందు లిఖించె స్వకీయకౌశలిన్. 84

మారు—మిత్రుఁడా! జన్మాంతపుణ్యశిల్పిచేత సముల్లిఖితంబు లయిన నితంబిను లయంగకంబులు హృదయంగమంబులు; స్నానవాడివెడలునప్పుడు వారియొప్పిదము చెప్పవలసిన దేమి? తరువాత?

కల—తరువాత నయ్యాపన మదద్విపమాకస్మికముగ సమీపింపఁగా నెట్టనేదిక్కుపాదపంబు నధిరోహించి గుబేలన దానివిధమున బ్రతికితిని.

మారు—(హర్షములో) అదృష్టవశమున రమయంతిక మృత్యువుచేతనుండి తొలఁగింపఁ బడినది.

కల—చ. జనులు హాహాహాకిన్ నుతులు సల్పఁగ నే గజకంఠపీఠిఁ జ
ట్టనఁ బయినుండి హమ్మని హఠాద్గతి దూఁకుదు, నేమి చెప్పఁగాఁ
బెనఁగొనువాఙ్గతాంగభయవేగవశమ్మున నమ్మృగీవిలో
కన హృదయంబు దిగ్గురన గాఢపుమూర్ఛ మునింగె నక్కటా. 85

మారు—సఖా! నీకోరిక నెఱవేఱినదే యని తలంచుకొమ్ము. చూడు—

ఉ. తావకరూపవిభ్రమకథాపరివర్ధితరాగవృత్తి దాఁ
గావున మున్నె యాబిడ సఖా! భవదీయకరస్థ యయ్యెఁ; సం

రాపధయంకరంబుఁ జిసురగ్రహాయాళుకరంబు నైనచం
తావళి రాజాభోరి కిటు దప్పెనిఁ కిప్పుడు చెప్ప నేటికిఁ? 36

కళ---వయస్యా! యాపెయ న్నయపర్యుపరాతుఁడు శంబరకపత్నిపాతి యని సందేహము.

మాధ—అంతమాత్రమున నేమి?

క. తరుణులు సమహ్యాగు లయిరే, నిరువురుఁ బ్రతికూలు రైననేమి బంధుల్?
విరసు లయిరేని వారి, ర్వ్వురు వీరనుకూలురైరి పోషులు మేమీ? 87

కాఁబట్టి మనము శిబిరమునకుఁ బోదము.

(అందఱు నిష్క్రమింతుమన్నారు)

ఇది శ్రీపరమేశ్వరవరప్రసాదలబ్ధ సరసకవితాధురంధర విద్వాగ్గి సాధునంశక్తిరత్నాకర
రాకాసుధాకర రాచ్చనామాత్యపౌత్ర హారితస గోత్ర పవిత్రగుణకదంబలక్ష్మాంబా
గర్భశుక్తిముక్తాఫల సూరపరాజప్రధానతనూభవ విబుధవిధేయ సుబ్బరా
యనామధేయాంధ్రీకృత మల్లికామారుత ప్రకరణంబునందుఁ
చతుర్థాంకము.

శ్రీరస్తు.

# మల్లికామారుతప్రకరణము.

## పంచమాంకము.

---

(తరువాత విప్రవేషధరుఁడు రాక్షసుఁడు ప్రవేశించుచున్నాఁడు)

రాక్ష—ఆహా! యకుతోభయంబు నతిమనోహరంబును గదా యస్మదీయకుల చరిత్రము!

మ. నరమాంసంబున భోజనంబు జరగుఁ; రక్తంబు పానీయమౌ;
సురతక్రీడయు స్వేచ్ఛమై నడచు నస్తోకాన్యదారాహృతిన్;
బరఁగున్ భాగ్యసమృద్ధి యజ్ఞమథనప్రారంభదీక్షన్; వసుం
ధర స్వచ్ఛందమనోజ్ఞరాక్షసజనిఁ సంతుష్టిగా దేమిటన్? 1

అస్మదీయజాతివిరుద్ధ మగుటచే నతిశోచ్య మయినను, సింహళద్వీపవాసి యగు నాసఖుఁడు వికటగ్రీవునిపనినిమిత్త మీవేషము ధరించితిని. అతఁడు నాతో 'సఖా! ఖడ్గజిహ్వా! సకలమూర్ఛాహర మయినరత్నముఁ, జిత్రమయ మయినకన్యారత్నము, విమల మయినదివ్యాంబరము ననుప్రశస్తవస్తువులు మూఁడును నాకుఁ గలిగి యున్నవి నీవును జూచి యున్నావు గదా! నే నీమూఁడింటిని లంకాపురగమన సంభ్రమాకులుండ నయి నానివాస మగుమఱ్ఱిచెట్టుమొదటఁ బ్రమాదమునఁ బడవేసితిని. తద్వస్తుత్రయనాశనానంతరము నాయాయు వత్యల్ప మని లంకాపురవాస్తవ్యులగుజ్యోతిష్కులు చెప్పియున్నారు. కాఁబట్టి తద్వస్తుత్రయాన్వేషణమునకయి నీవు ప్రయత్నింప వలయు' నని యానతిచ్చినాఁడు. (హర్షముతో) విప్రవేషముతో వెదకుచున్ననాకు నమ్మూఁడును నీకుసుమపురమందే కంటఁ బడినవి. (విస్మయముతో) ఆహా! యనిర్వచనీయసౌందర్యనియంత్రితసకలలోకలోచన యగు నచ్చిత్రకన్యయు, దుకూలాంచలలక్షితుఁడును, మరకతస్తంభస్నిగ్ధరుచియు నగు నత్తరుణనయస్కుఁడును నిట నిజముగా నే యున్నారు. (నవ్వి) వారేదొంగలును. (వికటముగా నడచి ముందు చూచి) సాయంసంధ్యాసమయమ్మునఁ గ్రమ్మకొనెడు నిమ్మనిచీఁకటిని జిక్కఁబఱుచుచు నాకసము వాఁకుచున్నయీచీఁకటిబ్రమాఁకుల పెనుదోఁ పేమిగా నుండునో? (బాగుగఁ జూచి) కుసుమపురోపకంఠవాసిని యగు కాత్యాయనీదేవి విహారోద్యానము గానోపును. ఇది రాత్రులయందుఁ బత్త్రాళసన్నివిష్టసకలపరివారమండలం బయి మనుజదుష్ప్రవేశము గా నుండు నని

వినుచుండెను. అందుచేతనే యిప్పుడు——

చ. అట నిటఁ జెట్లఁ ద్రొక్కుచుఁ బ్రసూనఫలాళిని రాలెను; మహో
త్కటతర విఘ్న రాజ్ఞకృతవంబు బలుమ్రోఁగు వినంబడుం; బురీ
ఘటలు భయోత్పిత క్షితి[illegible]లు గండశిలల్ దొలఁగ వలంగ వీడు నా
వటముగ సింహవాహములు వాహనసింహసమావిభీత్యులై. 2

(భయముతో) కాఁబట్టియే యీ ప్రదేశము మాకుఁ జేరరానిది. ఈదేవి యసురాక్ష
సులపక్షమున నిరస్తద్వేషిణిగదా! మాయావినుఁ జెనకుచు దేవాంగనలకుఁ దో
డ్పడుచుండును. అస్త్రీ సామాన్యపరాక్రమురాలు.

తే. గీ. కొమ్మకొన నిల్చునీ పవాహమ్ముఁ జిమ్మి
నట్టిమహిషాసురునియుత్తమాంగ విభవ
మెంత పగుచిగురుంపుపోవికిఁ జనయ్యె
తనపదతలమున విమర్దన మొనర్చె. 3

అయినను నీమెపరాక్రమము భీకజనప్రశంసాగోచరమే.

మ. తొలి మస్వాన్తపరంపర మ్లానపతి మహాగ్రం దానవుల్ [illegible]
తెలియం గోరి పెకల్చి వెండిమల యొత్తంగాడె యా వేల్పుఁగాఁ;
గలియించి గిరి, యేమి చేయఁ బనిపన్ ? గౌఁగిలించెంజనం
తలసాహాయ్యమునఁ జేకు విభు సంతోషముఁ దా భీతినా. 4

(మార్గాంతరమున నడచుచు ముందు చూచి కౌతుకముతో) గంధసారశాఖాపల్లవసం
తానంబులతో నిండు కొంబుగా నడిచి కాయలి నారామమున ప్రవేశించినయుఖముఁ దాయు
ష్యమాసనాదంభుఁ డెల్లఁ జెనకో!

చ. మరకతరత్నకాంతి యుయి మంజులపాండరగంధభాగుఁ డై
యురుభుజపంజరమండనమహోగ్రకృపాణలతాసమేతుఁ డై
కరము మనోహరాకృతిని గాంచియు వీఁడు భయానకుండు సనన్,
పరుషవిషాహియుక్తవిటపం బగు చందనశాఖి కైవడిన్. 5

(బాగుగఁ జూచి) ఆహా! వీఁడు మాదునూలపుఁ జెంగున [illegible]
డు. అది తొక్కన్య పినియూహీన. (భయముతో)

క. తనతేజానఁ జీఁకటిలో, నను సైతము పవ్వులను కనంబడు నేత
[illegible] ను నకట! దుగలచుఁ డీ, యున యౌవనగ్రంథమాణహంస్త్రతక్షన్. 6

[illegible] యుని పిలుచెదను. ఆయినను

సత్యకన్య యుండఁగాఁ జిత్రకన్యతో నేమిప్రయోజనము? ఈవృత్తాంతము సర్వము మణికూటశిఖరాగతుం డగు చెలికానికి వికటగ్రీవునికి నివేదించి నాయిచ్చం బోయెదను. (ఆకాశముఁ జూచి) ఈసమయ మస్మత్సంచరణోచితము గదా!

ఉ. మాయనిక్రొత్త నెత్తురులమాంసపుసంచయమట్లు సంజకెం
జాయ విహాయసాంతమున సాంద్రముగాఁ గొమరారుచుండఁగా,
వాయసపఙ్క్తిపై నిరులు వావిరిగా నరుదెంచి ప్రస్తర
త్క్షోయులిమట్టులయ్యది సమస్తము గ్రస్తమొనర్చెఁ దోడుతోన్. 7

(నిష్క్రమించుచున్నాఁడు. విష్కంభము)

(తరువాత ముందు చెప్పినట్లు మారుతుఁడు ప్రవేశించుచున్నాఁడు)

మారు— (అపేక్షతో)

చ. అరమర లేనిప్రేమ విరివై, నునుసిగ్గునఁ బొల్చి, తేల్చుచున్
గరణములన్ బ్రమోదరసకంధి, హృదంతరగూఢభావముల్
సరసపుసత్క్రియాచారములజూపి వెలార్చెడు సుభ్రువిభ్రమో
త్కరమున కేను దొల్లిటివిధంబున వెండియుఁ బాత్ర మౌదునా? 8

కష్టా! యీవిషయమును బౌనఃపున్యముగాఁ దలంచుకొనఁతలంచుకొని నాహృదయము నుతాప మొందుచున్నది.

తే. గీ. తన్ను నన్యుండు పెండ్లిగాఁ బలఁచు టెఱిఁగి
వెడలు చింటికి నంతర్విభిన్నహృదయ
యిందుసుందర మైనమో మిటు మలంచి
సారె ననుఁ జూచెఁ, జూపు బొప్పను గలంప. 9

(మరల నపేక్షతో)

ఉ. పొంజిగియుంటి మొవ్వాడిపాట్టవలెం గడు గొంచనమై
పుంజితపున్నిస్గరుచి ముగ్గి కతోఁ కుసుమాయుధవ్యథా
సంజనితంపుఁ బాండిమ దెసం గొబచనుంగవపొంగుతోడియా
కంజదళాక్షియంగ మిఁకఁ గౌఁగిటఁ జేర్పను జూడఁగల్గునా? 10

అయిన నట్లనుకొనేల? అది యనుభూతమగుచునే యున్నది గదా!

ఉ. నేనిదె కూరుచుండి శయనించి నిలంబడి యేగుచుండి కు
న్నానియు మేలుకాంచి కను మూడి నటించుచు నుండి పూనికై
నానను బంపమానసెపుడున్ నగుమోమునఁ బ్రేమ దాపుడున్

దేనియపల్కులన్ దగుసతిఁ గనుదున్ నను హత్తు రేపగల్ 11

(ముందు చూచి సంతోషముతో)

క. కురవకచంపకకేసర, కురంటకతమాలముఖ్యకుటసాంద్రంబున్
బరిహసితనందనం బిదె, యరయం గాత్యాయనీగృహారామ మగుఁ 12

(అనుతాపముతో) ఎల్లరాత్రుల సర్వసుపర్వగణంబులు సాక్షాత్కరించుచుండుటం జేసి మానుసుల కిది దివసమైకగమ్య మని వినంబడుచున్నది. (తెరలోఁ గలకలము)

మారు—(చూచి విస్మయానందములతో) అహో! యహంపూర్వికాప్రణమానావర్జితము లయినమానికపుభోమిడికములపరస్పరసంఘట్టనమున విస్రస్తస్రస్తరుకుసుమాపీడు లయి వచ్చిపడుచున్నయమృతాంధసులచేత వృద్ధానీభవనసమీపమున నంబరము గిక్కిఱిసి యున్నది. (కౌతుకముతో)

తే. గీ. పుణ్యతమపర్వమందు సంఫుల్లనేత్రుఁ। డవతరించెడు నదె పైబిడౌజసుండు
కమలవనసౌరభమెు పెనుగాలిచేత। భూత మాదేనతానదీస్రోతమట్లు 13

శా. త్రైలోక్యంబును భూవిధేయము, బలిప్రధ్వంసి తమ్ముండు, ది
క్పాలుల్ బంటులు, స్వస్తివాది గురుఁడున్, బ్రాఁబల్కు స్తోత్రంబు, జ
న్నాలే యాహుతి కిల్లు హైమగిరి, మందారాళి పూఁదోఁట, మిన్
జాలే బావి, యెుడల్ శచీనయనవీక్షం బింద్రుభాగ్యం బహో. 14

(మఱియొకవంకఁ జూచి) మెఱుపువెలుఁగుకునలెఁ గన్నులు మిఱుమిట్లుకొల్పుచున్న యీపెద్దవెలుఁ గేమిగా నుండును? (ఆలోచించి)

ఉ. లంపటుకున్ సమాన మగునాస్యము వేల్పులకున్, బవిత్రయా
సుంపదు రాంగ్రే మగిళీప్రసూత్రముఁ గ్రొంచిననూలికన్న, రూ
పొందినస్వాహానోముఖము మున్కొటతేజముసం పదంబు వా
యుం దిగుచున్నవాఁ డిదెఁ దహస్పతితేజుఁ డుష్బసుం డగున్ 15

(చిఱునవ్వుతో) ఈతనిం జూచి యీపగున్మిషితమంవాక్యము గా హారమహిషి స్మరదాహము సంస్మరించు నని నే నూహించెదను. (పేఁలుపైపు చూచి) ఓహో! భీష్మణో జ్వాలాకారుఁ డిదిగో ఫగినానుఁడు త్రాపదేవుఁడు.

ఉ. పాపహతాత్మజీవులకుఁ బ్రాచితపుంబడమోపకాడము
జూపఁగ యుక్తి పంపినము శుష్ఠమనంబునఁ జేయువాఁ డిదున్
గొప్పడు, నెట్టు నాజగము చుట్టము గాదిలిచిక్కి దైనవాఁ
డిపాడికట్టు నాపడా పస్పె భుఁ డీల నపెహాననస్నుఁ డౌ? 16

అయ్యో! యీయనవాహనమున కీయాకస్మికసంభ్రమ మేమి చెప్పుమా? ఆ! తెలిసినది.

ఉ. మాత! జొహా ర్జొహా ర్మహిషమర్దని! నీ కని మ్రొక్కెదే వసం
ఘాతము వాక్ప్రయంబు భయకంపిత మౌచును వాలకించి, తక్
దూతలు ముట్టుకొన్న జనఘాతవిషాణభయానకంబుగాఁ
బోతు ప్రభావనంబు సలుపున్ వలవంకకు ఘంట మ్రోఁగఁగన్ 17

(అన్యత్ర చూపుఁ బఱపి భయముతో)

చ. వికటపుమోముఁ, గ్రొమ్మెఱుఁగువెండ్రుకలున్, నరమండమాల, తా
ళికుటమహాభుజంబులు, జ్వలన్నయనంబు లగోన్నతంబు మే
చకఘనకాయముం గలిగి సర్వభయంకరుఁ డౌచు విక్కనిన్,
వికృతముగా నభోంగణము నిండి కనంబడు నీతఁ డెవ్వఁడో, 18

(విమర్శించి) ఇతఁడు దిక్పాలపంక్తినివిష్టుఁ డని వినంబడురక్షఃపతి నిరృతి యని తలంచెదను. (నవ్వి) ఆహా! యీతనియం దంబికాపరివారవర్గమున కెంతసాహాయ్యము!

తే. గీ. వేసఁ బ్రత్యుద్గమింతును, కౌఁగిలింతు। స్వాగతంబుల నడుగుదు రవసగంబు
నుచితము వచింతు, నిర్జరా, నిచట నున్న ప్రముఖులెల్లను నిండారుప్రమదమునను.

(స్పర్శసుఖమనుభవించి) ఏమిది? నాయంగము చల్లనిమడుఁగులో మునిఁగినట్టు లాహ్లాద మొందుచున్నది! (చూచి)

తే.గీ హారకుండలధరుఁడు రమ్యాననుండు। నగుచుఁ గనుఁగవఁ బసనియించు నంబుభర్త.
విమలతారకపూర్ణేందుబింబయుక్త। మైనగగనావకాశంబునంపమునను. 20

ఓహో; యీతనితేజ మితరతేజఃపరిభావకము.

క. వరుణుని తేజం బన్యము। హరియింపఁ గనటన్న నేమి యబ్బుర మీతం
డిరవుకొనుకడను జేరిన। తరుణమున నె పొనుఁగుపడుఁ గదా వెనుజోతుల్. 21

(మఱియొకవైపుఁ జూచి తావి నరసి) సకలేంద్రియసంతర్పణం బయినపరిమళంబునఁ బ్రపంచము ముంచివేయుచున్నాఁ డీతఁ డెవఁడో? (బాగుగఁ జూచి)

చ. అనలుఁడు మిత్రుఁ డెంతుఁ డగు, నన్నము పాముల కబ్బు, నానిప్పు
చ్చును భువనం బనూన మగు శూలిశరీర మెనందు గల్గ, మా
ర్గనమనసంచలత్కుసుమదామగళన్మకరందలుబ్ధభృం
గనిచయగానబంధురుఁడుగా నలగంధవహుండు డగ్గఱున్. 22

(తలఁపు నప్పినట్లుగా) వీనిస్పర్శనంబున నాహృదయము వేమో కాని యనిర్వాచ్య మగున

యౌత్సుక్యము నొందుచున్నది.

తే. గీ. మానసము హర్షపడు, స్వాత్మమతి జనించు
నితని యెడ నేమొకో యిది యే నెఱుంగ; (చిఱునవ్వుతో)
నైన సంగంబునను గేవలైక్యబుద్ధి
గలుగు సమనామములకుఁ బయస్సులకుఁ బోలె. 23

(అతికష్టముగా నన్నత్ర చూపు మరలించి) ఏకపింగళ మయినకనుఁగవతో సన్నిహితుం డయిన సమగ్రభూషణమణిప్రభాశకలితశార్వరాంధకారోన్మేషుఁ డీపురుషుఁ డెవ్వఁ డగునో? (తెలియుట నభినయించి)

చ. కలుములకాఁపునంపుటలకాపురవాసాళికి సార్వభౌముఁడున్
విలసితనైజభూధరనివేశితశీతలపాదచారుఁడున్
లలితపుయక్షరాజ్యకమలావిపులావళి కంబువాహుఁడౌ
నలఘుదిశాధినాథమణి యైలబిలుం డగునీతఁ డారయన్. 24

(సానునయహర్షంబుగా) ఆహా! నాసౌభాగ్య మవాఙ్మనసగోచరము గదా!

మ. సజవోచ్చైర్గలదోపవాహ్యవృషభస్పందానువృత్తిస్ఖల
న్నిజచూడోచ్చలితాదితేయతటినీనిర్హ్రాదుఁ డాహ్లాదకృ
ద్ద్విజరాజచ్ఛవి, తాను దృక్పథమునం దీపించుచున్నాఁడు పూ
ర్వ్యజయుం దవ్వల దవ్వులం దొలఁగ దారిం దారునం దేవతల్. 25

ఉ. దేవర యిప్పు డొద్ద కరుదేరఁగ హర్షపరీతచిత్త యై
దేవియుఁ దల్పమంబునను దిగ్గనఁ బయ్యెద జాఱ లేచి, కై
లా విడఁగా జయాసఖి, కెలంకున మిక్కిలి సంభ్రమంబునన్,
దా విభు దాయఁగాఁ గొనిపదంబు లిదే మెలమెల్ల నేగెడున్. 26

(మరలవిలోకించి) ఆహా! యిది యతిమనోహరముగా నున్నది.

క. సురసిద్ధసాధ్యవిద్యా। ధరకిన్నరసుందరులయుదారనయనభా
సురముఖముల నిండి దివం। బరు దగు బహుచంద్రమండలావృతిమగ్నై. 27

నే నీబృందారకుల కందఱకు వందన మాచరించెదను.

తే. గీ. లగ్గు నొడఁగూర్చ నెగ్గుఁ దొలంగఁ బెట్టఁ
గలుగు నింద్రాదిదిక్పాలకులకుఁ బ్రణతి;
యేతదఖిలామరశ్రేణి యెపుడుఁ గొలుచు
దేవి కీశైలరాజపుత్రికి జోహారు. 28

(నమస్కరించి లేచి పైకిఁ జూచి) అయ్యో! యాకాశము శూన్యమైనది.

తే. గీ. వేలుపులు లేరు; లేరు దిక్పాలు రప్స। రసలు లేరు; విమానసర్గంబు లేదు;
కేవలంబును దొంటిభయావహంపుఁ। జిమ్మచీఁకటి శేషించెఁ గ్రమ్ముకొనఁగ.

నిర్వర్తితకార్యాణిపన్నను లయి గీర్వాణాలు గమించి రని తలంచెను. (హర్షముతో)

తే. గీ. వెనుకటిఘనంబులందు సల్పినమదీయ
బహుతరోత్కృష్టతప మెల్లఁ బండె నేఁడు;
దేవతాసాక్ష్యమును దాను గేవలంబు
సాంబమూర్తియె నాకు సాక్షాత్కరించె. 30

(విమర్శించి) సర్వమంగళాభరణమహాలోపసన్నిధానమున కిదియే నా కనుకూలసమయము సమీపించెను. (పరిక్రమించుచు సపేక్షతో) అంబిక యనుగ్రహించు నా?

క. ఉపచితఘనరాగుఁడ నే। నపారవిఘ్నాంగకార మాసఁచి కిరఁగునన్
జపలాక్షిఁ గ్రిహింతు నా। తపమున్ దయ సరాగనళినితానాదవో లెస్. 31

(ముందు చూచి) ఇదె యుపవనద్వారము నే నిందుఁ బ్రవేశించెదను. (ప్రవేశించి తొట్రుపాటు నభినయించి నిర్వేదముతో) ఇది సమృద్ధికారిణే యయినను నాయకుడగు తొట్రుపడు చున్నదేమి కారణము? కానీ. ఇక్కడనే కూరుచుండి దేవిని బ్రసన్నురాలిం జేసికొనియెదను. (దోసిలిపట్టి)

ఉ. పంచలపాలురా భిదురపాణి, కుబేరుఁడు పాఱ భీరుఁడై,
కాంచఁగ నీళ్ళలోఁ డాఁగఁ గంపము, శూలియు మూలఁ దూఱ, వే
యంచులవాలుజోదు పారయం బలుబాములు, పైఁప కెన్మరా
త్రించరుమస్త మెట్టి అమథించినదేవిపదంబు గొల్చెదన్. 32

(సగ్గాఘముగా నాకాశమున)

ఉ. శోడినయుస్వయావిజయతో సరసోక్తుల నింక మానకే,
జోడుగ నొప్ప నున్నశశిచూడుని మోమున చూపుఁ ద్రిప్పకే,
పోఁడిగ నెత్తునంఘ్రిమణిభూషయు గల్లన మ్రోఁగ కుండఁ జెం
డాడితి వద్రిజా! మహిషు; నంబ! యి దేమి విలాసమో గదా. 33

(నిమిత్తమును సూచించి)

తే. గీ. ప్రియసమాలింగనము నీకు బెడయ దింక
నకట! దక్షిణబాహువా! యదర దేల?

యెఱుఁగవే మల్లికానుట నైక హేతు
వైనఁ గగనోత్థకలిత వాక్యంబు నీవు? 84

(నిశ్వసించి యాకాశమున)

తే. గీ. అయ్యనిర్వ్యాజ్యకన్యకాస్పర్శచిత్త | మల్పసుకృతుఁడ నగునాకు నబ్బమి తగుఁ;
గాని త్వద్వాక్యమే కదా దాన మూల | మంబ! నీకరుణార్ద్రిత కద్దితగునె?

అయినను స్వకర్మాధీనసుఖదుఃఖుఁడ నయిననేను భగవతి నీకాత్యాయని నుపాలంభించెద నేల? ప్రియతమురాలు లభింపమిం జేసి నాజీవితము నిష్ఫలము గావున స్వాయుముపహ్నానంబు లయినయసుకుసుమంబులచే నీయార్యామహాదేవి నర్చించి సంతోషపఱచెదను. (మరల నాకాశమున) ఓ కాత్యాయనీ!

తే. గీ. ప్రణతకామితమందారవల్లి! తల్లి! | యనుఁగుఁజెలి నాకు మల్లిక యబ్బదేని
నాదు హస్తాసిలూనకంఠంపు మోము | గనుమిపుడు నీపదములఁ గోకనద మగును

(కత్తి దూసి సప్రార్థనముగా)

తే. గీ. పద్మపాటల మైననీపదములందు | దేవిగో! నాకు భక్తి నద్ధిల్లఁ గాక;
యనుఁగుమల్లికతోడ జన్మాంతరంబు | నందు నైనను సంగమ మబ్బఁ గాక.

(ఖడ్గము కంఠమునం దుంచుకొనుచున్నాఁడు)

(ఆకాశమున) హా! నాథ! మాధవ! రక్షింపుము రక్షింపుము. రాక్షసహస్తమునం దిట్లు చిక్కియున్నన న్నేల చూడవు? మొట్టమొదట మత్తేభముఁగుహాస్తమునుండి నన్ను విడిపించి బ్రతికించినవాఁడవు నీవే కావా? హా! యంబ! గౌరి! నేను సత్యముగానే రాక్షసహస్తమున కీయఁబడితిని. హా! తండ్రి! హా! తల్లి! యిదిగో! గౌరీప్రసాదలబ్ధయయినమీయేకపుత్రి మల్లిక చెల్లిపోవుచున్నది. హా! మాతృసమానురాల! భగవతి! మందాకిని! యిదిగో! నేను నీయాశ్రమపుసమీపమునకే తేఁబడినదానను. అమ్మా! నామీఁదిప్రేమచేతను గదా నీవు హిమగిరిని విడిచిపెట్టి యిచ్చోటికి విచ్చేసితివి! హా! సఖి! నవమాలిక! హా! కాళింది! మీదర్శన మిఁక నాకు దుర్లభము గదా! (ఖడ్గము కంఠమునుండి తీసి సంభ్రమాభిప్రాయములతో) ఏమిది! మల్లికాస్వరము కరుణకరుణముగా గగనగోచరమగుచున్నది! [విషాదవితర్కములతో]

ఉ. ఆక వసింప మేడపయి నభ్రము మిం చని కొంచుఁ బోయెనో?
నాక మలంకరింప సురనాథుఁడు వేలుపులన్ హరించిరో?
ప్రాకటభూష చంద్రకళ రాలె నటంచు గిరీశుఁ డెత్తెనో?

యాకసమం దిటుల్ కఠరి నై విలపించెదు భీరు వే మొకో? 38

(పైకిఁ జూచి) అన్నన్నా! యెంత ప్రమాదము

సీ. గుండె జల్లనుపల్లకోరవిూసంబులు, వ్రేలు జుంజూఱు రాగి వెంట్రుకలును
ముడివడ్డబొమలమోమును, బెద్దతలకాయ, కఱకు దేఱినవంక మెఱుఁగుఁగోఱ
లుఱుకుగ్రుడ్డులుగల్గి వ్రేమంబునను దమశ్ఛాయమాల్లుశోఁచు నీభయగుఁడెవ్వఁడొ?
తెలిసె నిశ్చయము; రాత్రించరుఁడు వీఁడు, ప్రకాశించుచున్నాఁడు; దైవమెంత
యాపదఘటించె! నదె వానియంకతలము
నుండి ప్రభ్రష్టయౌచుఁ బయోధరంబు
వలనఁ గ్రొక్కారుమెఱుఁగుఁదీవయును బోలెఁ
బడెడు మల్లిక గడగడ వడఁకు చహహా! 39

(కన్నీళ్ళతో) హా! విధాతనిష్కరుణత!

చ. మునుగను నేన నేన యని బోటులు చేతుల నూఁత యీయఁబో
వనములదారి నైనఁ గటిభారమునన్ మెలమెల్లడిగ్గునం
గన గగనంబునుండి వడిగాఁ బడు గాంగఝరిం బెకల్చి చి
మ్మినచవువంతిచేతిబలిమిం బడుబంగరుఁదమ్మితీఁగె నాన్. 40

ఈమెను నేను బడకుండఁ బట్టుకొనియెదను. (ఖడ్గము క్రిందఁ బెట్టి చేతులు వెలికిలఁ
బయికెత్తుచున్నాఁడు)

(తరువాత మారుతహస్తగతయయివడఁకుచున్న మేనితో మల్లిక ప్రవేశించుచున్నది)

మల్లి—హా! పడిపోయితినిగదా!

మారు—(కన్నీళ్ళతో) అస్పృష్టనంతురాల! భయపడకు భయపడకు.

చ. మదిఁ బదిలించుకొమ్మిటులు మాటికి మేను వడఁకనేల? నీ
కొదవ దుపద్రవం బసురయువతి నేని మఱొంటనేని యిం
కిది యభయప్రదేశము సుమీ! భవదీయవిధేయుచేయి యన్
మృదుతలిమంబునందు వసియించినదానవు చూడు సుందరీ. 41

మల్లి—(చటుక్కునఁ జూచి) అహో! మహాభాగుఁడే. హా! మహాభాగ! (కంఠము
కౌఁగిలించుకొనుచున్నది)

మారు—సుందరీ! యిది యేమి?

మల్లి—(తడవుగ నిశ్వసించి సిగ్గుతో) నేనాకాశవాణీప్రమాణమువలన మహాభాగుని
పాదసేవ దుర్లభ మని తలంచి యీయర్ధరాత్రమునఁ బ్రాణసఖి యయిన నవమాలిక

ను గూడఁ గన్ను మోఱఁగి మరణమునఁ గృతనిశ్చయురాల నయి భవనోద్యానమున
కుఁ బోయితిని. పోయినతోడనే యెవఁడో రాక్షసుఁ డొకఁడు న న్నాకస్మిక
ముగా నెత్తుకొని యాకసమునఁ బరుగెత్తుచుండఁగా దైవికముగా వానిబారికిఁ ద
ప్పి యిప్పుడు దేవరచేతిలోఁ జాఱి పడితిని.

మారు—(ఉచ్ఛ్వాసముతో)

ఉ. పాయవు శ్లాఘ్య జీవమును బంగుజనప్రియ! నాను నై, శుభం
బీయమృతంపుమేను వొలియింపఁడు పీనుఁగుఁదిండి, పుణ్య మా
హేయుని చేతికిం దొలఁగి తీగతి, భాగ్యము; నేలఁ గూలుచున్
నాయెద హేమమాలికయనం గయినేసి తప్పృష్టమే, ప్రియా. 42

మల్లి—మహాభాగ! మీరేల యిక్కడ దేవతాద్వితీయులరుగా విజయంచేసియుంటిరి?

మారు—ఉ. ఏనును నాశిరోంబుజము నీగిరిరాజతనూజ కింపుగాఁ
గానుక యిచ్చి, నిన్ బడయఁగా మదిఁ గోరి, కురంగనేత్ర! కం
ఠానఁ గదించుకొంటి (చేతఁ జూపుచు) నికటస్థిత మీ యసి కేలఁ బూని-

మల్లి—(తొట్రుపాటుతో) మహాభాగ? సాహసము చేయకు.

మారు—(చిఱునవ్వుతో) యా! లోననె నీదుశోకపుటెలుంగు చెవిం బడఁ దెంపు
మానితిన్. 43

మల్లి—(తనలో) అయ్యో! కడచినవృత్తాంతమా చెప్పఁబడుచున్నది? (సకరుణాను
రాగముగా) ఆహా! నానిమిత్తము మహాభాగుఁడు ప్రాణత్యాగము గూడఁ జేయఁ
బ్రయత్నించెనే!

(తెరలో) ఎవఁడో యూయువు చెల్లినవాఁడు నాయుత్సంగమంచలిమానవకన్యను దొం
గిలించినాఁడు. నాయొడిలో నిప్పుడేఁతి యిప్పుడు కనఁబడ కున్నది. నే నొక్క
యుఱుకున దానిని సింహళద్వీపముఁ జేర్ప నాలోచించితిని.

(ఇద్దఱు వినుచున్నారు)

మారు—(నవ్వి) అహా! దేవీప్రసాదమున నీమె నాచేతిలోఁ బడినసంగతి యీమూ
ఢరాక్షసుఁ డెఱుంగఁడుగదా!

మల్లి—(భయముతో) అయ్యో! రాక్షసుఁడు మరల వచ్చుచున్నాఁడు. (వడఁ
కుచున్నది)

మారు—(నవ్వి) సుందరీ! భయపడకు, క్షణమాత్రము మాచెట్టుచాటున నుండుము. ఈ
పెంటదొక్కసుని నేను జెండాడెదను.

మల్లి—అయ్యో! మహాకాయుఁ డయినరాక్షసునితో నాథుఁ డెట్లు కలయఁ బడునో?

మారు—(నవ్వి) భీరురాల! మహాకాయుఁ డయిన నేమి?

తే. గీ. చండదుస్సహవీర్యతేజస్వి యెందు
సరకు సేయదు పరిపుష్టసౌష్ఠ్యనుబల!
యంబుజాప్తుఁ గెంపుఁదునుకట్టియుఁ బుటగ్గి
బూది సేయదె కొండంతపుడుకవాము? 44

మల్లి—(భయముతోఁ జెట్టుచాటున నున్నది)

మారు—(కత్తి దూసి గర్వముతో నిలఁబడుచున్నాఁడు)

(తరువాత వెదకికొనుచు సంభ్రమముతో యథోద్దిష్టముగా రాక్షసుఁడు ప్రవేశించుచున్నాఁడు)

రాక్ష—

శా. నే నాసింహళదేశకాననపతిన్; డిండ్రిమనాద్రమోఁగఁ గా
లూనన్ భ్రామితకూటశాల్మలి భయంబొందున్ మహోన్మత్తవున్;
స్త్రీ నంకస్థను గోలుపోయి వికటగ్రాసుమం డోర్చునే?
నానాలింగయుక్తోన్నయన్నరుఁ డెటు న్గాఁడే గతాయుండికన్. 45

మల్లి—(భయముతో) అయ్యో! భయంకరాకారుఁ డగువీనితోఁ దగులాయెడఁ గోమ లాంగుఁ డయినమహాభాగునకు సంగరంబెట్టాడుగున జరుగునో గదా!

మారు—(చూచి విస్మయముతో)

మ. శిర మభ్రంకషతుంగశైలనిభ మాక్షింటుర్ సముద్గీర్ణశి
ఖరము బ్రస్థవిశాలభీషణము, తాలోత్తాలముల్ బాహువుల్,
చరణన్యాసము ఘూర్ణితక్షితలము, చాలన్ వీనిమైన్ బ్రేక్షకుల్
బరమాణుత్వముఁ గాంచెంబులునె పొందంజేసినో కాలముల్. 46

(బిగ్గరగా) ఓరీయనుంగికోస్సస్స!

తే. గీ. కుసుమసుకుమార, శృంగారరసపయోధి
సుధ, మదనజీవనాడి, నావిహృదయను,
బరమకల్యాణి నంటునీశరము నూఱు
ప్రయ్య లెటు గాను గోరితి వ్యర్థపాప! 47

రాక్ష— (నా లుకోని జూచి) నిశ్చయముగ నీఁ జేసెదను. (సపరిహాసముగ) ఒక...

రుఁడా! మేలు మేలు!

తే. గీ. గాఢవిషవహ్నిభీషణకాలసర్ప! విస్ఫుటస్ఫటఫలకశోభితమణిశిల,
నస్మదీయాంకమధ్యపర్యంకవిధృత! జవ్వనిని గవ్వినాఁడ వీ వెవ్వఁడవుర?

మారు—(సక్రోధముగా) హా! లోకవిద్విష్టాచార! వెండియు నీవ్యవహారము కన్యకాగోచరమే యగుచున్నది. (తిరస్కారముతో)

మ. అరితిం బాపమతీ! పలాశ! చపలాత్మా! శ్వాన మాజ్యాహుతిం
బోరయం బోలునె? బాల నంటు టెటు? ఛీ! పో జీవ మాశించితే;
మరికాదేని, కఠోరఖడ్గదితయుష్మత్కంఠరాంతస్సిరాం
తరసఞ్జాతకవోష్ణరక్తఝరమేదస్విన్ ధరంజేయుదున్. 49

రాక్ష—(బొమముడితో) ఆ! వికటగ్రీవుఁడ నగు నాయెదుట నిలుచుచు నిశ్శంకముగాఁ బొగడుకొనుచున్నావు! (బాగుగఁ జూచి ప్రత్యభిజ్ఞతోఁ దనలో) వీఁడే మద్గుకూలాంచలలిఖితుఁ డయినపడుచువాఁడు. చిత్రకన్యాచోరుఁ డని ఖడ్గజిహ్వుఁడు నాతోఁ జెప్పినవాఁడును వీఁడే. (ప్రకాశముగా)

ఉ. ఏలరమర్త్యడింభ! నిరపేక్షుఁడవై నిజజీవమందు, నా
మ్రోలకు వచ్చినాఁడ విటు? మూఢుఁడ! పుణ్యము; కన్యకేమిపో
నీళులఁ జెంతపండు బలె నీమృదులాంగము మేళగించి తృ
జ్వాల శమింపఁగా గుటగుటం దియనెత్తుటిచారు ద్రాగుదున్. 50

(మారుతుని మూఁపునఁ బెట్టుకొని పరుగెత్తుచున్నాఁడు)

మల్లి—(సత్వరముగాఁ జెట్టుచాటుననుండివచ్చి రోదనముతో) భద్ర! రాక్షస! యిదిగో నంజలిపట్టి వేఁడుకొనుచున్నాను. మహాభాగుని విడిచిపెట్టుము. వెండియు నన్నే భక్షింపుము.

రాక్ష—(చెవిని బెట్టక నిష్క్రమించుచున్నాఁడు)

మల్లి—(కన్నీళ్ళతో) అయ్యయ్యో! మహాభాగుని రాక్షసుఁ డెత్తుకొనిపోయినాఁడు. (సకరుణముగా) హా! సకలలోకలోచనచకోరవారపూర్ణచంద్ర! హా! కందర్పమనోహరాంగ! హా! సుజనచూడామణీ! హా! పుండరీకలోచన! హా! లక్ష్మీవిహారభవన! హా! మల్లికాహృదయవల్లభ! హా! మారుత! సర్వలక్షణలక్షితమైననీకమనీయవిగ్రహము రాక్షసాహారమగుచున్నదా నాథా? అయ్యో! నేనెంతపాపాత్మురాలను! ఎంతయదృష్టహీనురాలను! కట్టా! దైవోపహతురాలను గదా! సర్వానర్థములకు మరల మరల నేనేకారణ మగుచున్నదానను. (నిట్టూర్పు పుచ్చి) నా

బ్రతు కింక నిరర్థకము. అయ్యో! మరణము కూడ నాకు దుర్లభ మయినది. భగవతి! భూతధాత్రి! నాకు వివరమిచ్చి నీలోనికిఁ దీసికొమ్ము కటకటా! సకలభువనమును గాలాంజననీల మయినకటికిచీఁకటి క్రమ్ముకొని యున్నది. నేనెక్కడకుఁ బోదును? ఎవ్వరికి మొఱ్ఱ వెట్టుదును? హా! దిక్కుమాలినదాన నయితిని గదా! (రోదనము చేయుచున్నది)

(త్రొట్రుపాటుతో మందాకిని ప్రవేశించుచున్నది)

మందా—బిడ్డా! భయపడకు. భయపడకు.

మల్లి—(చూచి కన్నీళ్లతో) అమ్మా! భగవతి! భగవతీ! రక్షింపుము రక్షింపుము.

(పాదములఁ మీఁదఁ బడుచున్నది)

మందా—సకరుణముగాఁ గౌఁగిలించుకొని)

చ. తెలిసితి జ్ఞానరూప మనుదృష్టికితంబున భీరురాల! మీ
విలఁ యులవ్యసనానుబంధము సమస్తము; కస్తిని బొంద కింక కిటఁ;
దొలఁగె నము గఁద్రమురక్కసులు; సేగమ చీఁకటి విచ్చె మొగ్గగున్;
మఱియు మ నసు రేయి; దైవముస దోడగుఁ గ్రమ్మఱ! భద్ర మయ్యెడున్. 51

తే. గీ. భవ్యశౌ రుతుఁడు రాక్షసహస్తగతుఁ డయ్యె నని సంతాప పడకుము.
ర్యవిడంబితసవ్యసాచి। మారుతుఁ బరాభవింపంగ లే రసురులు;
ప్రాక్కుధ రజ్యంధమాకాంశుబాలభాను। దట్టమగుచీకువా లరికట్టఁ గలదె?

(తెరలోఁ జటచ టత్కృతిని)

మందా—(చూచి యానం దముతో) మారుతపరాక్రమ మెఱుఁగనిదానా! మల్లికా!
మహాభాగుని చండిమ ము చూడుము.

క. మూఁపునుండి రి యంపడ। కాపిశితాశనునిశిరము నతఁ డసిఁ దునిమెన్
గెప్పునఁ గరిశుంభ ము వ। జ్రోపమనఖరాంకుశమున యువహరి వోలెన్. 53

మల్లి—(హర్షముతోను భయముతోను జూచుచున్నది)

మందా—(ఆనందముతో)

చ. అసిహతమస్తకుం డగుచు నద్రిర! బిట్టద్రుపం ధరాతలం
బసురుఁడు వజ్రఘాతదళితాద్రితటంబును బోలెఁ గూలెడున్

(ఆశ్చర్యముతో)

విస్మృతిఁ పుఁ దత్కబంధమున వెల్వడి యుజ్జ్వలభూషణుండు మిన్
దెసఁ బురుషుం డొకం డహహా! దివ్యశరీరము దాల్చి యేగెడున్. 54

మల్లి—(విస్మయానందములతో) భగవతీ! యిది మహాశ్చర్యము! అతిభీషణుం డగు రాక్షసునివలన దివ్యపురుషుఁడు బయలు వెడలినాఁడు. చూడు. చూడు. ప్రదక్షిణము చేసి మౌళిప్రదేశసంఘటితాంజలిపల్లవపుటుం డయి మహాభాగునకు నమస్కరించుచున్నాఁడు.

మందా—(ఆలోచనతో) ఎవఁడో దివ్యపురుషుఁడు శాపవశమున రాక్షసుం డయ్యెనని తలంచెదను.

(తెరలోఁ గలకలము ఇద్దఱును వినుచున్నారు)

మల్లి—(భయముతో) భగవతీ! రాక్షసభయంబునం జేసి మరల రాక్షసుండే వచ్చుచున్నాఁడని తలంచుచున్నాను.

మందా—(చూచి) బిడ్డా! యిదిగోఁ గన్నీరు విడుచుచున్న నీతండ్రి నమాత్యవిశ్వవసునిఁ బురస్కరించుకొని నిన్ను వెదకుచు బెడిదంపుఁ గైగువులు గైకొని వీరపురుషు లిటు నటు సర్వత్ర దిరుగుచున్నారు.

(మరలఁ దెరలో) హా! పుత్రి! మల్లికా! యింద్రనీలప్రకాశముఁ జూచి కూఁతుఁ జీఁకటి యని జడిసెడుదానవుగదా తల్లీ!

మల్లి—(కన్నీళ్ళతో) అయ్యో! నాయనగారు ఏడ్చుచున్నారేమి చేయుదును?

మందా—బిడ్డా! నిన్నుఁ గానక దుఃఖపడుచున్న మీతండ్రిగారినూఱడించి, నీకుఁ బ్రాణదానమహోపకారము చేసి విజయమున వర్తిల్లుచున్న మారుతునిఁ గూడ సంభావింతము రమ్ము. (నిష్క్రమించుచున్నారు)

గద్య.

ఇది శ్రీపరమేశ్వరవరప్రసాదసమాసాదితసరసకవితాధురంధర నద్దాది సాధువంశక్షీరనీరాకరరాకాసుధాకరాచ్చనామాత్యపౌత్రహరితసగోత్ర గుణకదంబ లక్ష్మాంబాగర్భశుక్తిముక్తాఫల నూరపరాజప్రధానతనూభవ విబుధవిధేయ సుబ్బరాయనామధేయాంధ్రీకృత మల్లికామారుతప్రకరణమునందుఁ బంచమాంకము.

సమాప్తము.

శ్రీరస్తు.

# మల్లికామారుతప్రకరణము.

## షష్ఠాంకము.

---

(తరువాతఁ గాషాయాంబరయుగళీహస్తుఁ డొకపురుషుఁడు ప్రవేశించుచున్నాఁడు)

పురు— (హర్షముతో) ఓహో! బృహస్పతిని బరిహసించెడు తననయప్రభావముచేత మల్లికాకరగ్రహణమంగళమును సులభపఱుచుకొనుచున్న మాళంబరకప్రభువుగారి యెల్ల సమాత్యవిష్ణురాతుఁడుగారిపుత్రుఁ డగురుద్రరాతునికి స్నేహానుబంధ మత్యధికము గదా! అందుచేతనే సన్నిహితమైనయీవివాహమహోత్సవమునందు సంభావితులగుమహాజనులెల్లకాలము పౌరయాకసుఖముగా వసించుటకయి నిజమహాధనమునందుఁ గొంతభాగము వారికి విడిచి కూడ నొసంగినాఁడు. ఇంతియ కాక తండ్రి యగువిష్ణురాతుఁడు గారికి సమ్మతము కాకపోయినను దా నాయనను సరకుగొనక తనసోదరిని రమయంతిక నాట్యకలవింగకుని కియ్యఁ జూచుచున్నాఁడు. (నవ్వి) సోమపదసమాగమమునఁ జూచినదే మొదలుగా నాట్యకలవింగకునికి రమయంతికయందు ననురాగము వర్ధిల్లుచున్నది. దానం జేసియే కదా యతఁడు సవికారము లయినయనాలాపములతో నమ్మించుఁబోణిని మరల మరలఁ జూచుచున్నాఁడు. తానుగ నెట్టయెనుటికిఁ బోయి యేమేమో సల్లాపించుచున్నాఁడు. తానే పోషణకార్యములు చేసినట్లు తననోటితోనే యామెయొద్దఁ జెప్పుకొనుచున్నాఁడు. (సకౌతుకముగ నవ్వి) ఇతఁ డిన్నిపాట్లు పడుచున్నను నామెకుమాత్ర మితనిమోము పిఁపఁబ్రోయును. చూడ గిట్టదు. (విమర్శించి) కానున్నది కాఁగలదు. ఆర్యకలవింగకుఁడును రమయంతికను సర్వథా పొందఁగలఁడు. అఘటితఘటనైకసిద్ధవిద్యాభిరాము లయినమందాకినీభగవతిని నానావిధసత్కారములుచేసి శంబరకప్రభువుగారు తమపక్షమునకుఁ ద్రిప్పుకొనుచున్నారు గదా! ఆతల్లి నిశ్చయముగాఁ బలుఁదుకొన్నపక్షమునకుఁ దామరసను జంపకమాలను బరస్పరానురాగము గలిగింపఁగలదు. చెంగలువ నయినను వేవెలుంగుతో సంఘటింపఁగలదు. ఇదిగోఁ! ప్రొద్దుగా విహసించుచున్న మోముగుఁ బువ్వారెన్నగలిగినయీమెత్తనిసన్నకావిదువ్వలువల నామె కిచ్చుటకే గదా ప్రభువుగారు నాచేతఁ బంపినారు. వివాహమంగళోపకరణావ్యగ్రత యయినభగవతిని జూచుటకయి, విన్యస్తవితానతానమువంటి కాలపథ్వాలంపును నెత్తినక్షత్రపుంజముచే దీపించెడు నమాత్యవిశ్వ

వసుదేవుఁడుగారి యీమహాభవనమునఁ బ్రవేశించెదను. (ప్రవేశించి నలుదిక్కులు చూచి) ఇదిగో! దమయంతికిఁ బ్రియసఖి యయినమసురిక లోఁగిటిలోనుండి యీలాగున వచ్చుచున్నది.

మక—(ప్రవేశించి సంతోషముతోఁ దనలో) ఆహా! యనితరసాధారణమతిప్రభావ యగుమందాకినీభగవతి యింతకంటె నో పాయము ననవద్యముగాఁ గనిపెట్టినది గదా! (నిట్టూర్చి నిర్వేదముతో) అయ్యో! దమయంతికిని దుష్టరాజుఁడు సహజశత్రువు గాని యన్నగాఁడు. మఱియు టము నకు మల్లెపువ్వు లేకుండఁ జేసిన లెక్క గావిం గకుండను నీమె నీయఁ జూచుచున్నాఁడు. ఇందుకుఁ గూడఁ దెలియఁజేసినయు పాయముఁ బ్రియసఖికిఁ బోలె భగవతి నా చెవిలోఁ జెప్పియే యున్నది. (పురు షునిఁ జూచి) ఇప్పు డేకస్థానివాసపరిచయమువలన వీఁడు శంబరికపరిజనుఁ డయి చపలకుఁ డని నేను దెలిసికొనుచున్నాను.

పుర—మసురికా! భగవతి మందాకిని యెక్కడ నున్నదో నీకుఁ దెలియునా?

మక—(తనలో) వీఁడు భగవతిని వెదకుచున్నాఁ డేమి? కానీ అడిగెదను. (ప్రకాశముగా) చపలకా! భగవతి యెందుకు?

చప—(నవ్వి) ముగ్ధురాలా! యనల్పకల్పనాకౌశలము భాషించినను బ్రతిపా లించుటకయి శంబరికప్రభువుగారికిఁ గామె సర్వవిశ్రంభపాత్రమయి ప్రవర్తించు చున్నది కాదా?

మక—(తనలో) తల్లీ! భగవతీ! నీయందఱ్ఱ ప్రభాతమునకు నమస్కారము.

చప—(తనలో) దమయంతి కాప్తాంతరముఁ జెప్పెదను. (ప్రకాశముగా) ఇప్పు డావశ్యకముగా భగవతిని సందర్శింప వలయును. అన్నగారు దమయంతిని తమ్ముఁ గలిపికొనుటకు నిశ్చయము చేసికొనియున్నారు. దమయంతి కి సమ్మతింపక యున్నది. కాబట్టి భగవతి యామె పెండ్లికి యొప్పుకొనునట్లు మానిం పవలయును.

మక—(సోపహాసముగాఁ దనలో) నానివాసకాలు! అకల్పవిరాగుని పరిశ్రమమున కుఁ బ్రధానకసమరణతాసినమే తుదకు ఫలముగును లే. (ప్రకాశముగా) చపలకా! దమయంతికి నోరఁబెట్టుపట యనఁగా భగవతి కది యెంతపాటిపని? (తనలో) నవమాలికా! యాలాగుసి యిప్పు డేమి? కన్యానిపరితాపముతోఁ దమ్మెరలు వీతెంచె డాక తమున నతిమనోహర మయిన లీలోద్యానముఁ బ్రవేశించి యెంతసేపటినుండి యో మల్లిక నీకొఱకు నిరీక్షించుచున్నది. నీవు శీఘ్రముగా బోయి యోదార్ప

తనువు వివాహోచితము లయినసుగంధభూషణములను సవిశేషముగా నామె కిప్పు డలంకరింపు మని భగవతి నీ కాజ్ఞాపించుచున్నది. పెండ్లివారు రాక మునుపే నీ వీపని నెఱవేర్పవలయును జుమీ.

మక—(తనలో) ఇది మంచిదే. మారుతుఁడు గూడఁ గలకంఠభ్రమరకసహాయుఁడయి యిక్కడనే యున్నాఁడు. అతనిని నిగూఢముగా నక్కడకు సారసిక తోడుకొనిపోయినది గదా! ఇఁక నేనును దగినసంవిధానమునఁ బ్రవర్తించెదను. (ప్రకాశముగా) చపలకా! యిదిగోఁ గంచుకులు భగవతి యాదేశమును జరుపుచున్నారు. ఆమె చేయుచున్నది సులభముగా సంవర్తింపవచ్చును బోవమ్ము. (నిష్క్రమించుచున్నాఁడు. ప్రవేశకము)

(తరువాత మారుతుఁడు కలకంఠుఁడు భ్రమరకుఁడు ప్రవేశించుచున్నారు)

మారు—భ్రమరక! మల్లిక యీచేరువ లతామంటపము నడుమ నున్న దన్నమాట సత్యమగునా?

భ్రమ—ప్రభువా! కాళిందీవనపాలికలు మంగళాలంకరణమును జేయుచుండఁగా నామెను జూచినాఁడ నని మనవి చేసితిని గదా!

మారు—(నిట్టూర్పుతో)

శా. దేనిం బొందఁ దపస్యమగ్నమునిజాతిం గూరి మున్ గోరితిన్,
దేనిం గాంచుట దుర్లభం బనెడుభీతిం బ్రాణనైరాశ్యమే
యే నట్లొందితి, నట్టిజీవితఫలం బిప్పుడుఁ గరప్రాప్త మ
ట్లౌ; నంబా! భవితవ్యతా! మరల నెట్లౌనొ వింతో గదా! 1

కల—మిత్రుఁడా! సంశయింపకుము. గొంతు గోసికొనుట కయిన జంకు లేక నీవు సాహసింపఁగానే మల్లిక నీచేతిలోఁ బడినది గాన జీవితఫలము భవానీప్రసాదమువలన నీకుఁ గరప్రాప్తమే.

భ్రమ—ప్రభువా! లతామండపమునకు మార్గ మీనల్లికాపంక్తుల నడుమనుండి.

మారు—భ్రమరక! యీప్రదేశము వట్టంపుటాకుజొంపముల గుబురయినతీవలగుంపుకతమున జీబుకొని యున్నను బరిజను లెవ్వరయిన వత్తు రేమో యనుశంకవలన నెమ్మది లేక కాలు గదలింపఁ జాల కున్నాను.

భ్రమ—ప్రభువా! భగవతి యాజ్ఞచేతఁ బరిజనమును వేత్రహస్తు లుద్యానవనమునకు వచ్చువారినే యాటంకపఱిచి యున్నారు.

మారు—(హర్షముతో) ఓహో! భగవతినీతి సర్వత్ర యప్రమాదిని గదా! దారి చూపుము.

భ్రమ—ప్రభువా! యిటు. ఇటు.

(అందఱు నడుచుచున్నారు)

కల—(చూచి) ఓహో! యమాత్యవిశ్వావసుఁడు గారిభవనము ప్రత్యాసన్న వైవాహిక మంగళమును సూచించెడు నుదాత్తమండనవిధానముచేత నెంతచక్కఁగా శోభిల్లుచున్నది!

ఉ. తేనియ లుట్టు ద్వారముల దిద్దిరి నందనమాల లుంచి రిం
పైనవి క్రొత్తచిత్తరువు లచ్చపుమేడల గోడలందు, సం
ధాన మొనర్చి రౌమపువితానములందు సుహాణిజల్లులన్
మానుగ వీథివాకిట నమర్చిరి బంగరుఁగాయుమానముల్. 2

మఱియు—

ఉ. లీల నటింపకేతుపటలీపట పల్లవముల్ గదల్చుచున్,
దాలిచి తోరణప్రసవదామసుగంధమరందబిందువుల్,
గాలులు వీచు వల్గువిచలత్కుచకుంభసుహర్షవేగసాం
దోలనచేటికామృదుభుజదోర్వలయధ్వను లాహరించుచున్. 3

భ్రమ—(చెవి యొగ్గి) ప్రభువా! కేవల మిది నలయస్వనియే యనియెద వేమి? అటు నిటుఁ బ్రధావించెడు వారసుందరులనితంబబింబముల వ్రేలుచున్న మణిమేఖలా సహస్రముల ఝణఝణత్కారంబులఁ దోరం బయి, ఘూర్ణమానసకలాంతఃపురగానంబుల భూషణారావంబులఁ బూరితం బయి, గుంజన్మంగళమృదంగశంఖకాహళాది నినాదంబుల నిర్భరం బయి, సన్నిహితమహితభూదేవసర్గసంపఠ్యమానపుణ్యాహఘోషంబున మాంసలం బయి, వృద్ధకులాంగనాజనసమారబ్ధంబు లైనపవిత్రపార్వతీలక్ష్మీకల్యాణగానంబుల ననూనం బయి యీయుత్సవకోలాహలము మహీయము గానున్నది గదా!

మారు—(నిశ్వసించి) సఖా! కలకంఠ!

క. రమణీమణికిం బరిణయ। సమయము ప్రాపించుకొలఁది సాన్నిధ్యము, చి
త్తము సంశయడోలారూ। ఢ మగుచు నూఁగాడెఁగాఁ దొడంగెడు నాకున్. 4

భ్రమ—ప్రభువా! లతాభవనసమీపమునకు వచ్చినారము.

మారు—(సంతోషముతో) మల్లికావాసనసుభగమయినలతాభవనమా యిది?

కల — ప్రసాధనసమయసంభావ్యమయి క్షణోత్పన్నవిరత మయ్యెడుభూషణఝంకారము వినఁబడుచున్నది గదా!

ప్రమ — ప్రభువా! మంగళస్నానవిశుద్ధముగ్ధ మయినపరిక్షామపాండురాంగంబుచే సవిశేషలోభనీయదర్శనయుఁ బ్రసాధననిపుణనవమాలికానిర్వర్తితవివాహనైపథ్యమనోహరోదారవేషయు నయి సాక్షాత్కరించిన యుద్యానలక్ష్మివలెఁ దీఁగెలసందులనుండి యదిగోఁ బూజ్యురాలు గనంబడుచున్నది.

కల — (పత్త్రజాలకాంతరమునుండి విలోకించి) మిత్త్రుఁడా! చూడు చూడు.

మ. ఇది సుక్షామమనోహరాంగకము లెంతేఁ గాంతిపూరంబులన్
వెదచల్లన్ నయనాంబుజంబులకు నుద్వేలప్రమోదంబుగాఁ,
గొంత లేఁదీవిభూషణంబులు హొరంగుం బెంపఁ గల్యాణి యీ
పొదరుందీవలయొప్పఁ దాను నొకపూవుందీవ యై భాసిలున్. 5

మారు — (ఆనందముతోఁ జూచి) ఇదిగో నీమె కొంచెముగా మోము పెడమరల్చినది. కాళిందీనవమాలికలతో నేమో సల్లాపించుచున్నది సుమీ. మన మీతీఁగెలసందులనుండి ప్రవేశించి రహస్యముగాఁ జూతము. (అట్లు చేయుచున్నారు)

(తరువాత ముందు చెప్పినట్లు మల్లికయు, నవమాలికయుఁ గాళిందియుఁ బ్రవేశించుచున్నారు)

మల్లి — సఖులారా! మీ విప్రలంభవచనము చేతనే నే నీయలంకారమున కనుమతించితిని.

నవ — సఖీ! నీవు వేఱుగాఁ దలంచుకోకుము. (మారుతునిఁ జూచి సంతోషముతో జనాంతికముగా) కాళింది! మహాభాగుఁడు వచ్చి వెనుక నున్నాఁడు. వెల్లడింతమా? ప్రియసఖికి సత్యమని నమ్మిక పుట్టును.

కాళిం — సఖీ! వెల్లడింపకు. సమయము వచ్చినప్పుడే వెల్లడింపవలయును.

నవ — (చిఱునవ్వు నవ్వి) సఖీ! మల్లికా! నీవు మమ్మును వంచించితివి గదా!

మల్లి — (అనుతాపముతో) ఎప్పుడు?

నవ — సఖీ! రాత్రివేళ మమ్ముఁ గూడఁ గన్నుమొఱఁగి ప్రాణపరిత్యాగమునకుఁ బ్రయత్నించినదానవు కావా?

మల్లి — (సిగ్గుపడుచున్నది)

కాళిం — అదృష్టవశమున వెంటనే రాక్షసునిచేత గృహీతవయి మహాభాగునిహస్తమునందుఁ బడినదానవు.

కల — సఖా! మల్లిక పడినచోటనే నీవుండుట యెట్లు తటస్థించినది?

మారు—మిత్రమా! నే నుపవనాంతరమునఁ బ్రవేశింప నెంచియుఁ గాలు దొట్రిలినందున సంశయించి యిక్కడనే నిలువఁబడితిని.

మల్లి—కాళింది! రాక్షసుఁడు గాఁడు. ఎవ్వఁడో యొకదివ్యపురుషుఁడు. అతఁడు మహాభాగునకు జన్మాంతరమిత్రుఁ డని భగవతి నాకుఁ జెప్పినది.

(ఇద్దఱు విస్మయపడుచున్నారు)

కల—సఖా! యేపురాక్షసజన్మమునుండి యీయనను నీవు విడిపించితివి గదా! ఆ మహాపురుషుఁ డెందుఁ బోయినాఁడు?

మారు—అతఁ డత్యంతసౌహార్దమున నాతోడ మాటాడి సఖుఁడా! నీవు నన్నుఁ దలంచుకొన్నతోడనే నీయొద్దకు వచ్చి నీయుపకృతమును నేను నెఱవేర్చి పోయెద నని పలికి వెంటనే తిరోధానము నొందెను.

నవ—కాఁబట్టి నీవే విప్రలంభశీలవు.

మల్లి—నీయుపాలంభ ముచిత మయినదే.

నవ—సఖీ! నీ కీయలంకరణ మనుకూలముగా నున్నదో లేదో చెప్పు.

మల్లి—(సిగ్గుతో చిఱునవ్వుతో) సఖీ! యిది నాయలంకారము గనుక సిగ్గున నిట్టిది యని ప్రశంసింపఁ జాలకున్నాను. ఇంతియకాని నీప్రసాధననైపుణి వాగతీతమే.

కల—వాగతీత మని మల్లిక చక్కఁగాఁ జెప్పినది. ఇం దొక్కొక్కటే వర్ణనము నతిక్రమించుచున్నది. ఇది చూడు——

తే. గీ. వఱచునభినవకుంకుమపంకమునను। దిద్దుమదిరాక్షిముద్దులతిలక మొప్పు;

మారు—(అభిలాషతో)

రక్తమై రమ్యనవసాహసక్తమై యు। చంచలత నిల్చుమామకస్వాంతమట్లు. 6

కల—(చిఱునవ్వుతో) సఖా! నావచనమును నీ వపహరించితివి.

భ్రమ—అయ్యా! చూడు మారుఁడు ప్రభువుగా రొసంగిన హారయష్టి యీమెకంఠమూలమును జుట్టుకొని యున్నది

కల—(చక్కఁగాఁ జూచి) నిజముగా నిది నయనస్యదోరంతరవిహారమల్లిత మయిన హారవల్లియే. (విమర్శించి)

మ. స్మరదాహంబునఁ బాండుభావము నగుచున్ శంఖంబుపాంకంబుదా
హారియింపం గలకంఠకాంతమున నీహారంబు భాసిల్లెడున్;

మారు—

హరిణాక్షీవచనంబు నిక్కముగ నేహాంసంబుగా నెంచి యం

నరమం గుంటి యుద ప్రకాండము భజింపఁగోరి యేతెంచె నాన్. 7

కల—(సక్షానుముగా) నీ ప్రతిభోత్కర్షము సర్వోత్కృష్టముగదా!

మాధ—సఖా! [illegible] నీలఘమ్మిల్ల [illegible] నవమాలతీకుసుమ సౌరభ్యలుబ్ధ ఇందిందిరసు[illegible] సమాఘ్రాణగీతసంగీతకంబును, [illegible] తాటంక కిరణపల్లవిత [illegible] లంబును. నలినదళహిమజలశబలకుంకుమఘన సారసరసాంగరాగలులితఘనతుంగకుచకుంభాభోగ ప్రేంఖోళహారజాలంబును, నిబిడనితంబ[illegible]మండితకాంచన కాంచీగుణ[illegible]రాగమయూఖపుంజ [illegible]జితమంగళస్నానంబును, [illegible] కనూపురకిరణ[illegible] సంసేవితచరణపుండరీకంబును నై [illegible] మ్మెక్కుడైన[illegible] ము సకల[illegible] (ప్రాగుగఁ జూచి) అయిన నీయనవద్యాంగికి నలంకారములు ప్రసక్తములే. మాఱు—

మ. నయనప్రాంతనత[illegible]తిప్రతిష్ఠ [illegible] నీలాబ్జమే
క్రియ హారంబును గాను భారము స్మితశ్రీఁ బాల్పుచెందోయినన
వ్యయరాగాంక్రియు గాతిబాధకము పిండాలక్తపాతంబు; వి
శ్చయ మీసాజప్రఁ గన్మతావి మెయిం జుట్టల్ ప్రయాసముల్. 8

ప్రథమ—పాపట యందుఁ జూడామణి కనఁబడ దేమి?

లవ—సఖీ! నీయనయానలక్ష్మిచే నలంకృతమయి[illegible] లంకరణము నీరత్నము కుఱ రమునఁ జూచుకొనుము.

(పాటల సర్పము గనఁబడుచున్నది)

మాల—(సిగ్గుతోఁ జూచుచున్నది)

మాధ—సఖా! మాడు—

మ. ఎలప్రాయంబున [illegible] నీ [illegible] బంధఁ జే
[illegible] లకొలుకుల్ గల [illegible] జేసి, యాయుదం గాంచఁ యథార్థంబుగాఁ
జెలువం పుంగని మైనయాకలికిన్ సిద్ధోపమానం బెటన్;
నిలువుం [illegible] నీచం జూపీ చూనితిక్. 9

లవ—సఖీ! స్వభావస్నిగ్ధము లయిన నీలనయనోత్పలములచే పెను గాక రానికాటుక రేకతోడను, ముగ్ధమనోహరకధనశీలమయిన గండమాలమున గుణోత్కర్షము గాంచు మున్నకి [illegible] తోఁ జూచిన విభావిత [illegible] యమునతోడను, గారి [illegible] హంసకుంకుమతిల

కాంచితరమణీయలలాటము నీటుతోడను, గండభిత్తికలం బర్వు పత్త్రాంకురాంకు ను త్పాదించెడును దారసీమంతపథవర్తిసుందరసిందూరముతోడను, సకలలోచనానం దసంధాయకమయి చంద్రమామకు సాటి వచ్చెడు నీమోముఁదామరను నీవు గూడఁ జూచుకొనుము.

మల్లి—సఖీ! నవమాలికా! నాకు శిఖామణి యేల పెట్టవయితివి?

నవ—సఖీ! మఱచితివా? రాక్షసహస్తమునుండి జాఱిపడినప్పుడె మరలఁ గ్రిందఁ బడిపోయిన దని నీవే చెప్పితివి గదా!

మారు—అయ్యో! శిఖామణీ! మరలఁ గ్రిందఁ బడిపోయితివా?

తే. గీ. ఎట్టెటో యీమెపొందు నప్పగింత
మరల మరలను గొండొక పొరయునీవు
మానికమ! నాకుఁ బోలెను మాటి కకట!
కలుగుచున్నది యెడఁబాటు సుఖము గనక.

(తెరలో) నవమాలికా! త్వరపడుము త్వరపడుము మంజరీవీథి నిర్వాణప్రాప్తము. (అందఱు వినుచున్నారు)

కాళిం—సఖీ! భగవతి వేగిరించుచున్నది. పోదము. ఈవివాహమహోత్సవసంభ్రమము నీవు పొందఁ దగినది గదా!

మల్లి—(విషాదముతో నిట్టూర్చి తనలో) అయ్యో! నాప్రాణములు గాపాడుటకు మాత్రముపయోగించెడుమాట లాడునీప్రియసఖులచేత మోసపోయితిని, కటకటా! నిష్కరుణారంభ మయిన నిష్ఠురగగనవాణీదుర్విపాకముచేత నాజన్మము పాపహత మయినది. హా! మందభాగినిని నేనిప్పు డేమి చేయుదును? వెంట నేల నన్ను క్రూరరాక్షసుఁ డేల భక్షింపఁడయ్యెను? అయ్యయ్యో! దురదృష్టవంతురాలను నిరాలంబ మయిన యాకాశమునుండి క్రిందఁ బడినప్పుడు నుగ్గునూచమేల కానయితిని? (స్మరించి మరల నిట్టూర్చి) అయ్యో! యట్లు కంఠసీమునఁ గరోద్ర ఖడ్గము నందుకొని జీవితపరిత్యాగమునకుఁ బ్రయత్నించిన యామహాభాగుఁడు నానిమిత్త మింక నేమి గానున్నాఁడో?

నవ—(జనాంతికముగా) సఖీ! కాళింది! పాపము! నిజము తెలియక ప్రియసఖి మానసవ్యాపారములచే నతిదుర్వ్యథ నొందుచున్నది. (ప్రకాశముగా) భర్తృదారికా! పరిత్యక్త వినాయక యూర కుంటి వేమి? నీనిట్టూర్పుగాలు లేల దీర్ఘోష్ణము లయి యెఱ్ఱని మోవి దిగుగను మలినించి పయ్యెదఁ జెఱఁగు నల్లలార్చుచున్నవి? ఏమి

టి కీబాష్పస్తబకములు నీ చెక్కుటద్దముల వ్రాసినపత్త్రలేఖలను జెఱిపి కాటుక గ
రంగఁ గాలువలు గట్టుచున్నవి?

మల్లి—(నిశ్వసించి) సఖీ! నవమాలికా! మనోరథసహస్రములచేత సంవర్ధిత మయి నన్నా ప్రియవస్తువును విఘటించునిష్ఠురవిఘ్న మనియెడుమృత్యుదేవత తుత్తుకను జొచ్చి బాధపడుచున్నదానినిగా నన్నెఱింగి యుండియు నీవు గూడ నిట్టులాయా సపెట్టెద వేల? (నిశ్వాసముతో) జీవితనిర్విశేషురాండ్రగుప్రియసఖుల కిది యుక్తమే. ఇంతపనక నయ్యయి విప్రలంభవచనములచేతఁ బ్రతారించి యిప్పుడు వెండియును నన్నీ హేయపుఁగుంభీపాకమునఁ గూలఁ ద్రోయఁ బ్రవర్తించెదరు.

కల—వయస్య! నీసౌభాగ్యమును జూచుకొనుము.

ఉ. ఈమె ప్రియాలివాక్యముల నెంతయు నమ్మి భవత్సమాగమా
శామిళితాత్మ, ముగ్ధ, తను జక్కఁగమున్ గయిసేయు నిచ్చి, యి
చ్చో నది బాష్పకంఠి యయి ప్రుక్కెడు నన్యవివాహసంశ్రుతిన్,
లో మొగులుం దలంచి దిగులుం గనుబాలమరాళిపోలికన్. 11

నవ—(సకరుణముగా, జనాంతికముగా) కాళిందీ! మనసులోని దుఃఖముచేత నతివిషమమయిన భర్తృదారికావచనము నాలకింపుము.

క. అనుకూలవిప్రలంభము! లను మన మొందింప నుమ్మలము సస్నేహం
బును సవిషాదము సోల్లుంఠనము నధికార్యమునుగ నాతి వచించెన్. 12

(ప్రకాశముగా) సఖీ! యీమావిప్రలంభవచనమునకుఁ గినియకుము. ప్రసన్నవు గమ్ము. (మారుతునిఁ గడకంటఁ జూచి) నీయందు సవిశేషబద్ధానురాగుఁ డయిన యీయనకు నీకరకమలము నొసంగుము. బంధువర్గము నానందపఱుపుము.

మల్లి—(శోకభారముతో) సఖులారా! తరుణమయూరపింఛమువంటి నిద్దంపుఁ జామనచాయ గలమంగళాంగమున నెసంగుమహాభాగుని మారుతుని సంస్పర్శించినది మొదలు అన్యపురుషునిఁ దలంచి యేని యెఱుంగను; కాఁబట్టి సత్యప్రమాణముగాఁ జెప్పుచున్నాను. విను మహాభాగునిపూర్ణలావణ్య మనెడుభాగీరథీప్రవాహమున నవగాహనము గావించుటచేతఁ బవిత్రము లయినవా నేత్రములతో లాఁతివాని నీకముంగును జూచువానను గాను.

కల—మిత్రుఁడా! యీ వచనామృతమును వీనుజేరలతో గ్రోలుకొనుము.

మారు—సుదీర్ఘమనఃసవిహారమల్లికాక్షీ! మల్లిక!

ప. హృద్యవచనమునన్ నిమేషమాగ ప్రేమాదసాత్త్వికయుంజేసునాన్నప్ర

న్నది కడుఁ బొంగి పైఁబొరలు నా, హృదయంగమ మైనపల్కులన్
మదనమహాగ్నిదగ్ధుఁ డయి మ్రందెడు నా కమృతాభిషేకసం
పద గలిగించిన ట్లయితి; ప్రాణము వచ్చెను ప్రాణనాయికా. 18

(మరలఁ జెవిలో) వనమాలికా! త్వరపడుమనుచున్నారు. సిద్ధాంతులు పెట్టిన వివాహముహూర్తము సమీపించుచున్నది.

(అందఱు వినుచున్నారు)

మల్లి—(కన్నీళ్లతో) అమ్మో! భగవతి మాటల నాక్షేపించుచున్నది. సఖి! వనమాలిక! లే లెమ్ము. భగవతి తానుగానే యిక్కడికిఁ వచ్చెనేమో; ఇంతలో వేఱొకలతావలయమున కరిగి మి మ్మొక్కటి ప్రార్థించెదను.

వన—సఖీ! నీ వాజ్ఞాపింప యోగ్యురాలవు. ప్రార్థించుట యేమి? మా కెల్ల నీయిచ్చ వచ్చినకార్యమునందు యథేష్టముగా నియోగింపు. భగవతి యాదేశమును నిర్వర్తింపుము.

మల్లి—సఖి! విషాదసంభ్రమములచే నాదేహము కంపించుచున్నది. కాబట్టి నేను లేవలేక యున్నాను. నాకన్నులయందు బాష్పపూరము నిండుచున్నది; నే నిటు చేరఁ జూచెదను సయితము చాలకున్నాను. నీవే నాచేయి పట్టుకొని లేపఁ దీసి మెల్లఁగా లతావలయాంతరమున నన్నుఁ బ్రవేశపెట్టుము. (చేయి చాఁచుచున్నది)

సఖులు—సంజ్ఞచేఁ బాణిగ్రహణమునకై మారుతుని బ్రేరించుచున్నారు)

మారు—(భయము నభినయించుచున్నాఁడు)

కల—మిత్రుఁడా! యిది సాధ్వసమునకు సమయము గాదు. చిరకాంక్షితమైన మల్లికాపాణిగ్రహణమహోత్సవము ననుభవింపుము.

మారు—(లతావలయమునుండి వెడలివచ్చు మల్లికపాణిని గగుర్పాటుతో గ్రహించుచున్నాఁడు)

మల్లి—(హర్షముతో) సఖీ! వనమాలిక! నీహస్తమిప్పుడు వేఁడిగా నున్నది. చేయి పట్టుకొన్నంతమాత్రమున నాయవయవము లన్నియు నమృతవర్షమునఁ దడిసినట్లు సుఖపారవశ్యము నొందుచున్నవి. (మాటుతునే యూఁతకొని లేచుచున్నది)

మారు—(బదులు పలుకకయే మెల్లమెల్లగాఁ దీసికొని పోవుచున్నాఁడు)

సఖులు—(చిఱునవ్వుతో వెంబడించుచున్నారు)

కాళిం—సఖీ! మల్లికా! లతాగృహమునకు వచ్చినారము [illegible] నేర్పఁ [illegible] న దేమో చెప్పు

మల్లి — (నిట్టూర్పుతో) సఖీ! నవమాలికా! యేతీఁగె మొదటికి వచ్చినారము?

మారు — బహుళకుసుమరసపరివాహమందరపరిమళలోలలోలంబపుంజబంధురితమిర మీ మందారమూలమునొద్దకు.

మల్లి — (సబాష్పగద్గదముగా) ఈమందారము నేను పెంచినదే. కాఁబట్టి నిర్జనమైన యీప్రదేశమునందు మిమ్మొకటి ప్రార్థించెదను.

కాళిం — సఖీ! మేము సావధానము గలిగియున్నాము.

మల్లి — ఓ జీవితనిర్విశేష! మారుత! (అర్ధోక్తిని వైలక్ష్యమభినయించుచున్నది)

సఖులు — (పరస్పరము నవ్వుకొనుచున్నారు)

మల్లి — ఓజీవితసర్వశేష! నవమాలిక! సఖీ! కాళింది! పరిపూర్ణచంద్రసుందరాకారుండగుమహాభాగుని పాదములకు శుశ్రూషచేయుసౌభాగ్య మభిలషించి కదా విఘటమాన మయిన నాజీవితమును నిలుపుకొంటిని. అకంపన్పసుందరుని ప్రథమదర్శనము మొదలిప్పటివఱకును గృహోద్యానకారవిందమకరందవాహులయి మందమందముగా వీతెంచెడు సుద్యానవనమారుతములకు నోర్చుకొనుచుంటిని. ప్రచండమకరధ్వజభుజదండమండలితధనుర్దండటంకారఘోరము లయినమధుకరఝంకారముల నాకర్ణించుచుంటిని. చిగిరించినతీయమామిడిగుబురులలో విహరించుచుఁ గోకిలములు గావించెడు పంచమప్రపంచము హాలాహలముచే దురంతము లగువసంతదివసములు వేగించుచుంటిని. ఇంతియ కాక కిసలయతల్పకల్పనములచేతను, మృణాళవలయహారరచనములచేతను, కదళీదళపవిత్రవీజనములచేతను ఘనసారపంకచార్చిక్యసంపాదనములచేతను నింకను పత్త్రుచితోపచారములచేతను, మిమ్మును గూడ నాయాసపెట్టుచుంటిని. అట్లు రాక్షసహస్తమునుండి జాఱి యాకసమునుండి క్రిందఁబడుచు నిమ్నవర్థమాత్రమున నెవ్వనిచేత రక్షితనయితినో యట్టిమహాభాగునిసంగమమెవరికో పుణ్యాత్ములకుఁగాక సులభముగాని నాకు దుర్లభమే. కాఁబట్టి నాజీవితధారణము క్షణమేనియు మహాపాతకములలో నగ్రగణ్యమని తలంచెదను సఖులారా! జనాంతరమునఁ బునర్దర్శనము గోరుచు మిమ్ము వీడుకొనుచున్నాను. (సప్రశ్రయముగా నంజలి పట్టి సగద్గదముగా) సఖీ! నానిమిత్తము నీవిట్లు నమస్కరించి సుందరస్త్రీసాంతక్ష్మీబంధుండును దీర్ఘనిద్రలోపడనున్నవాఁడును నగు నమ్మహాజనుఁడు పరలోకగత నగునాకొఱకు జలాంజలి నిచ్చునట్లు రహస్యమున నాయనతో విన్నవింపవే. (రోదనము చేయుచున్నది)

---

* ఈవాక్యములుమూలమునందు సంస్కృతప్రాకృతసమానము.

మారు—(సకరుణముగాఁ దనలో)

న. హరిహారి మేను వాసెను బ్రయత్నముతోడ శుభాంగి తానిటుల్
కరుణము నోహటం బగువిలాప మొనర్పఁగ నాలకించుటన్,
సరళతచేఁ గరంగెడును, జాలిని రూపఱుఁ, గంటు మోహవి
స్తరమున, వ్రీలు నాటీఁ, హృదయంబునఁ బొంగెడు, డెంద మిత్తఱిన్. 14

కాళిం—సఖీ! యమంగళము దొలంగును గాక.

నవ—(కన్నీరు పెట్టుకొనుచున్నది)

మారు—(ప్రకాశముగా)

* క. వీణావిరావకోమల! వాణీబంధుగణచిత్తవనజమంజీ
రాణ నెసఁగుసహచారిణి! ప్రాణమునకుఁ దగకు పలుక కతికరుణోక్తుల్. 15

నవ—(జనాంతికముగా) కాళింది! మహాభాగుఁడు తన నేర్పుచేత నచ్చముగా నావలెనే మాటలాడుచున్నాఁడు; కాఁబట్టి యీయన నిప్పటికిని బ్రియసఖి యెఱుఁగదు.

మల్లి—సఖీ! ముగ్ధురాల! సాహస మనియెద వేమి? ఎవ్వనికి జీవలోక మంతయును మన్మయ మయి కనఁబడుచున్నదో యెవనిహృదయము మదీయశాధభంగమున నతికాతర మయి యడలుచున్నదో, యంతటియర్ధరాత్రమున నట్టిదుర్గమప్రదేశమున కేకాకి యయి పోయి సకలభూమండలమండన మయి తనకంబుసుందరకంధరాకాండమునందు నెవ్వాఁడు క్రొవ్వాఁడికరవాలముఁ జేర్చుకొనునంతటి మహాసాహసమునకు సిద్ధపడెనో, యటువంటి నాప్రేమనిధికొఱకు జీవితసహస్రపరిత్యాగ మయినను సాహసము కానేరదు. ఈవిషయమున నీవు నాకుఁ బ్రతికూలవు కాకుము. వెండియు మహాభాగునకు నామాటగా నిట్లు చెప్పుము (సగద్గదముగా) నాథ! మందభాగినిని నే నీజన్మమున యుష్మదీయపరిరంభసౌభాగ్యమును బడయ లేక పోయితిని. కానీ జన్మాంతరమున నయినను నీపొందే యపేక్షించుచున్నాను. నాతోఁబుట్టువగు నక్షత్రమాలికను మాత్రము మరకతకవాటస్నిగ్ధవిశాల మయినమీవక్షస్స్థలమునందు నన్నుఁ బోలె సర్వదా ధరించుకొనుఁడు. (మారుతునిఁ దడవుగఁ గౌఁగిలించుకొని యానందముతోఁ దనలో) ఏమిది? ప్రియసఖీసంస్పర్శము మయినంతట మంచిగంధ మబ్బినట్లయి మహాభాగపరిరంభమునకుఁ బ్రతి వచ్చుచున్నది. హృదయసన్నిహితుఁ డయి సుఖింపఁ జేయుచుండె నని తలంచెదను. (ప్రకాశముగా) సఖీ! యిది నాకడసారికవుఁగిలింత సుమీ.

---

* ఈపద్యము మూలమునందు సంస్కృతప్రాకృతసమాసము.

సఖులు—(చిఱునవ్వుతోఁ దమలో) ఇది కపటపుఁగౌఁగిలింత కాదు. మొదటిదో రెండవదో.

మారు—(కౌఁగిలింపఁ బడియే యానందముతో సహజస్వరముతో)

ఉ. ఎవఁడు దృఢానురక్తమతి నింగముఖీ నిను నిచ్చగించునో
యెవనికినై శుభాంగి యసుచేతి త్యజియింపఁగఁ దెంపుఁ జేసితో

మల్లి—(తనలో) ప్రియసఖికంఠము మాఱిపోయినదేమి? (ప్రకాశముగా) ఆయనయెచ్చట నున్నాఁడు?

మారు—

వివిధవిషాదమారశరవిద్ధభుజాంతరగాఢపీడితా
త్యవిరళపీవరస్తనత హాయిగఁ ద్వాగ్భుజపంజరంబునన్. 16

మల్లి—అయ్యో! మహాభాగుఁడే. (హర్షసాధ్వసలజ్జలతోఁ దొలఁగుచున్నది)

మారు—

తే. గీ. సాధ్వసంబునఁ దొలఁగకు చంచలాక్షి!
తగునె సంభ్రమకాతర వగుట గాన
జనుఁ గడఁ? జిరకాంక్షితోత్సవపుఁ గౌఁగి
టికిని భంగం బొనర్తు వటే లతాంగి? 17

మల్లి—(వ్రీడాసూయలతో) సఖులారా! నేను బాగుగా వంచిత నయితిని.

కల—(త్వరగా సమీపించి) కల్యాణి! యీలాగున బలుకకుము.

మ. జగదుత్తంసుఁడు నావయస్యుఁడకు భూషాప్రాయ నై తీ వహో
సుగుణాఢ్యా! యెటు విప్రలబ్ధయన వచ్చున్ నిన్నుఁ? దత్రాప్తిలో
భగరీయోమృగతృష్ణికం బడి యసద్భ్రాంతి వహించు దు
ర్భగుఁ డాడంబరకుండె సుమ్మి పరికింపన్ విప్రలబ్ధుం డిటన్. 18

ఉ. చందనపాదపంబునకు సౌరభసంపదవోలె, జ్యోత్స్న పూ
ర్ణేందునకుం బలెన్, మణికి ఘృష్టియుఁ బోలెను శోభనాంగి! నీ
వందపుసొమ్ముగ మ్మతని కవ్వియు వానికిఁ బోలె నీవు నీ
సుందరమూర్తి యొప్పెడును జూడవె సముభ్యుదితానలంబమై. 19

భ్రమ—(సమీపించి) నవమాలికా! మనయదృష్టము మంచిది. ఒడయుఁడు నొడయురాలు నభ్యుదయమున వర్ధిల్లుచున్నారు.

మంద—(పరిహృష్టవదన యయి ప్రవేశించి)

తే. గీ. సిరియుఁ బార్వతి, భారతి, సీత, భీమ
జాత, పౌలోమి, రుక్మిణి, సత్యభామ,
కృష్ణ, శర్మిష్ఠ, సావిత్రి, ధృతి నరుంధ
తీ రమసాధ్వి, యాశీర్వదింత్రు గాక. 20

(అంతటఁ జూచి సాశంకముగా) మల్లిక యీలతాభవనమునుండి యెక్కడికి వెళ్ళినదో! (లతాంతరముఁ జూచి యానందముతో) అహో! నామనోరథములు ఫలించినట్లే. ఇదిగో! మందారమూలమున మారుతుఁడు—

చ. అతిసుకుమారముల్ గ్రహము నై రమణీయతఁ గాంచు మేనితోఁ
బ్రతిపగుడు ప్రియుండను సరి వచ్చెడురూపున లోభనీయుఁడై
చతురకటాక్షముల్ స్మరునిజాలబలాత్కము ప్రీక్షనమ్ము వా
వతులితమల్లికాముఖమునం దొలయించుచు నున్నవాఁ డిటన్. 21

(సమీపించుచు) నవమాలికా! యాలసించెద వేమి?

నవ—అహో! భగవతియే వచ్చినది. (ఎదురువోయి) భగవతి! మే మాలసించుట లేదు.

మల్లి—(సగద్గదముగా) భగవతీ! రక్షింపుము. రక్షింపుము. (అంజలిపట్టి వచ్చుచున్నది)

మందా—(మల్లికను కౌఁగిలించుకొని) బిడ్డా!

మ. సమరాగుండను మహాభిజన్ముఁడు జగచ్ఛ్లాఘ్యప్రియుండు డౌజనో
త్తముఁ డందున్ బృథరక్త వీవు; పొగ డొందం జాలుకల్యాణి! నీ
దుమనోవాంఛ ఫలించుఁ; బుణ్యసుభగా దో నిన్నుఁ బెండ్లాడి, డెం
దముఁ గందించుచిరాంగజజ్వరముబాధం బాయుం నిం కేతఁడున్. 22

నవ—(ఆనందముతో) భగవతీ! సర్వోత్తర మయినతననిర్మాణవైదగ్ధ్యము చిరకాలమునకు సఫలమగుటచేత విధాత కృతార్థతను బొందుఁ గాక. శంబరకహంతకుని పరిణయప్రసంగముచేతఁ గలుషము లయిన బంధుజనహృదయంబులు ప్రసన్నత నొందుఁ గాక. మాతాపితృసమానము లగువీహస్తములతోడనే మహాభాగునిచేతికిఁ బ్రియసఖి నర్పింపవలయును.

మల్లి—(తనలో) అయ్యో! వారు సర్వమంగళావచనప్రమాణలు గదా!

మందా—నవమాలికా! నే నిప్పుడు వేఱుగ నర్పింప వలసినదేమి?

తే. గీ. చెక్కుచెమరింప కుండంగ రక్కసీని। చేతియందుండి తిగిచి రక్షించి యీమె
ఘోరఖడ్గంబు మెడఁ బెట్టుకొన్నయతని। కరమునం దుంచె సర్వమంగళయె మున్నె.

మఱియు—

క. ఒండొరులయిచ్చ నగునీ। పెండిలియం దేల యీమెఁ బెద్దలొసఁగ ! నా
ధుం డుపయింపఁగ రంజిలు। చుండుకలువ నెక్కరిచ్చిరో తొగచెలికిన్. 24

అయినను లోకాచారము జరిగించెదను. (మాధవుని గూర్చి) వత్స! మాధవ! యిటు రా.

మాధ—భగవతీ! యాజ్ఞాపింపుము.

మంద—

చ. వెలఁది, ప్రసిద్ధవైభవుఁడు విశ్వాసుఁడు భూరికీర్తి పుణ్యసం
కలితత నద్రి లచ్చి బలెఁ గానక కొండించునప్పుడు; ధర్మముల్
సలుపఁగ రాగపావకుఁడు సాక్షిగ, నే సుహృదుండనై నినీ
కొలఁకుని నీకు శ్రేయము నవద్యపుఁ బద్మపింఛిని వేడ్కతో. 25

కల—మాపుణ్యఫలము ఫలించినది.

నవ—మాకుల దేవతలు ప్రసన్నులయిరి.

కల—(హర్షముతో) భగవతి! సర్వథా యనవద్యమయి యీసంబంధమును జూచి హృదయము ప్రసన్నమగుచున్నది. చూడుము—

ఆ. వె. సహజనూతనాభిరామసౌందర్యసముదాయ। మైకరాశి కఖిలదృక్చకోర
కేంద్రకాంతి కీమె కిరణాభిజాత్యంబు। కినకకుసుమదామమునకుఁ దావి. 26

నవ—(మల్లికను జూచి నిట్టూర్పుతోఁ దనలో) ప్రియసఖి మహాభాగునకు సర్వదా వల్లభయిస్సేఁ గాఁగలదా?

మంద—(మన్నించి కన్నీళ్లతో) వత్స! మాధవ!

మాధ—(సాశంకముగా) భగవతీ! యాజ్ఞాపింపుము.

మంద—

ఉ. ఒరు లెఱింగింపఁ దగ్గ దొకఁ డింత యెఱుంగుము శ్రేయసారముల్
కోరనరి! నైనఁ గేవలముఁ బ్రేమయొసఁగన్ బలికించు నియ్యెడన్

మాధ—(వినయముతో వినుచున్నాఁడు)

మంద—(మల్లికచేయి పట్టుకొని)

తరుణి యి దేశప్రతీసుమి తండ్రిఁ, బంధువర్గల్లఁ బ్రాణమీ
పొందినస్నేహబంధ మెడ పొంపక యుండుత ముందు నీమెకోన్. 27

మాధ—(...) భగవతీ! ...

పుట్టుచున్నది.

కల—భగవతీ! యాప్రసక్తమయిన మీయుపన్యాసమునకుఁ దగినయుత్తరము మిత్రుని పక్షమున నాకుఁదోఁచకున్నది. మాడుఁడు—

చ. స్థిరపడె స్నేహ మీమె కన, స్నిగ్ధునకున్ సకృపేక్షణల్లె; ప్రు
మ్మరు నతుఁడై యటన్న, నసమంచిత, మయ్యెను బ్రేమవశుండె మున్;
సరళత ట్టెఁ డెన్వఁ డా, సౌహృదవాక్యము; యీమె కోసమై
నరకు నొసంగు ప్రాణము, సర్వము నీమెయె చూచె నాతనిన్. 28

మందా—(సవిమర్శనముగా మల్లికను జూచి) పుత్రీ! నీకుఁ గూడ నిందుకై యుపదేశించెదను.

మల్లి—భగవతీ! యానతిమ్ము.

మందా—

ఉ. సేవల నత్తమామలకుఁ జేయుము నెప్పుడు మాఁటవిద్దెరున్;
సేవకులం దయంగనుము, స్నిగ్ధవుగమ్ము సపత్నులందతి
థ్యావళి సత్కరింపుము; గృహక్రియలందును బద్ధకింప క
మ్మా! వెయి చెప్పనేల? సుఖమందుము నల్పమభర్తయిష్టమున్. 29

మల్లి—(సిగ్గుతో మనస్సున నంగీకరించుచున్నది)

వన—ఇది యుచితమయినయుపదేశము.

మందా—వత్స! మారుత! తలఁచినప్పుడు వచ్చెదనని నిన్న వీడుకొనినయాదివ్యపురుషుని మాకరందనాముని, శంబరకహింతకవంచనార్థము మల్లికావేషమును దాల్చి దయచేయుమని యిప్పుడు సంస్మరింపుము.

మారు—(ధ్యానము నభినయించుచున్నాఁడు)

(తరువాత మల్లికావేషముతో మాకరందుఁడు ప్రవేశించుచున్నాఁడు)

మాకం—సఖా! మారుత! యిదిగో నేను వచ్చితిని. నీయభీష్టము నెఱవేర్చెదను.

(మందాకినీమారుతులు దక్క మిగిలినయందఱు విస్మయము నభినయించుచున్నారు)

కాళిం—(జనాంతికముగా) వనమాలికా! యీతఁడు మహాభాగునిచే రాక్షసభావము నుండి విమోచితుఁడయిన దివ్యపురుషుఁడు సుమా!

వన—కాళిందీ! యాశ్చర్యమాశ్చర్యము! ఎవ్వఁడు ప్రియసఖిని భక్షించుటకు సిద్ధపడెనో యతఁడే యిప్పుడు రక్షించుటకు సిద్ధపడినాఁడు. [మల్లికతో] సఖీ! మాకు మఱియొక ప్రియసఖి యెట్లుగలిగెనదో చూడుము.

మారు—మహాపురుష! భగవతి నిన్ను మున్ను కోరినదాని నాచరింపుము.

మాకం—చక్కఁగా నాచరించెదను.

[కాషాయాంబరయుగళహస్తయయి సారసిక ప్రవేశించుచున్నది]

సార—భగవతీ! యిది చపలకుండు తెచ్చినవస్త్రయుగ్మము.

మందా—వత్స! కలకంఠ! నీ వీకాషాయయుగ్మముచే శోచనీయమయినను నావేషము ధరించుకొమ్మ. ఇది విషయోపభోగవిరుద్ధమే యయినను దీనిచేతనీవు రమయంతికను బొందం గలవు. [అందఱు నవ్వుచున్నారు]

మారు—ఇదియు మనకు మంగళమే యనుకోవచ్చును.

కల—[చిఱునవ్వుతో వస్త్రయుగ్మము తీసికొని నిష్క్రమించి మందాకినీ వేషముతోఁ బ్రవేశించి] ఇదిగో! భగవతి నయితిని.

మారు—శంబరకుఁడు నీపాదములమీఁదఁ బడుఁగాక.

మందా—[కాళిందీనవమాలికలను చూచి] బిడ్డలారా! మీరిద్దఱుఁ గలకంఠునితోఁ గూడ నీమహాపురుషునుసరింపుఁడు.

ఇద్దఱు—చిత్తము భగవతి!

మాకం—[చిఱునవ్వుతో] భగవతి! శంబరకునిఁ బెండ్లియాడఁ బోవుచున్నాను.

మందా—వత్సా! ముందునీకుఁ జెప్పినమార్గమున మాయభిలషితము నెఱవేర్పుము.

మాకం—మిత్రుఁడా! రమ్ము కలకంఠ! మారుతునకు నేను నీవంటివాఁడనే సుమీ.

కల—మహాపురుష! మా కందఱకు నీవు పూజ్యతముఁడవు. పోదము రమ్ము. [కాళిందీనవమాలికలతో నిష్క్రమించుచున్నారు]

మల్లి—సఖులారా! నా కిక్కడ సాయ మెవరు?

నవ—[చిఱునవ్వుతో నించుక మరలి] ఇదిగో నీమహాభాగుఁడే.

మందా—భ్రమరక! నీవుకూడ గూఢముగా విష్ణురాతుసంటికిఁ బోయి మధుకరిక చెప్పినట్లు కావింపుము.

భ్రమ—చిత్తము భగవతి! [నిష్క్రమించుచున్నాఁడు]

మందా—వత్స! మారుత! యిదిగో నిరుగడ వృక్షముగా వెలుఁగువేసి కాపాడఁబడెడు నీయుద్యానవీథి నాయాశ్రమము నంటి యున్నది. ఇక్కడ నంబికావర్ణనార్థమునకు మల్లికకొఱకుఁ బుష్పాడియునుకతోఁ జక్కనిదారి యొకటి యేర్పఱుపఁబడియున్నది. కాఁబట్టి మనమును బోవుదము. అస్మదాశ్రమోపశల్యభూములు రమణీయములు సుమీ అక్కడ—

ఉ. స్వైరవిహారలీలలం దొసంగు సౌఖ్యము మీకు నవాబ్ధిశంకమా
యోదనమారనృత్య సమయోచితనిస్వనశబ్దసత్త్వమా
లోకితమోహనిగూఢములు సుచ్ఛమరీచకిసాలశాఖిక
న్నాళ చకోరికానయన శారము లౌపిక భుక్తచూతముల్. 30

సూత్రి. ము——

చ. అలసినఁ గిరిశలన్ నవలతాంతవితానలతాగృహంబులం
గొలగొనుచు మెల్లమెల్లనిము నోపికతో భజియించు నూత్నని
ర్మలితనవప్రసూనమకరందనిమగ్నసముత్థితంబులౌ
కలకలహంసమాల సుముఖంబులు సోమపదస్ఫురాదిముల్. 31

(అందఱు నిష్క్రమించుచున్నారు)

గద్య.

ఇది శ్రీహరి మీనాక్షీదేవీప్రసాదలబ్ధసరసకవితాధురంధర వర్ణాదిసాధుసాహిత్య శ్రీనివాసరాజ
సాహిత్యాచార్య నామాత్యపౌత్ర హరితసగోత్ర పవిత్రగుణకదంబ జగద్గురు శా
స్త్రముక్తాఫల సూరపరాజప్రధాన తనూభవ విబుధవిధేయ సుబ్రహ్మణ్యనామధే
యప్రణీతాంధ్రీకృత మల్లికామారుతప్రకరణమునందు షష్ఠాంకము.

సమాప్తము.

## సరస్వతీకార్యస్థానమున వెలకుదొరకు పుస్తకములు.

| | | | రూ. | | |
|---|---|---|---|---|---|
| 1. | మాలతీమాధవీయము | ... | 0 | 8 | 0 |
| 2. | రాయనభాస్కరమంత్రిచరిత్రము | ... | 0 | 4 | 0 |
| 3. | శ్రీరామేశ్వరయాత్రాచరిత్రము | ... | 0 | 8 | 0 |
| 4. | మార్కండేయపురాణము ఎఫ్. ఏ టెక్స్టు 1903 04 | ... | 1 | 4 | 0 |
| 5. | శకుంతలాపరిణయము | ... | 0 | 8 | 0 |
| 6. | హిందూగృహము | ... | 0 | 1 | 0 |
| 7. | మనుష్యవాంఛానిష్ప్రయోజనత్వము | ... | 0 | 1 | 0 |
| 8. | నేలబొగ్గు | ... | 0 | 1 | 0 |
| 9. | భువనమోహిని | ... | 0 | 4 | 0 |
| 10. | మిల్టనుగారిజీవితము | ... | 0 | 1 | 0 |
| 11. | అపవాదతరంగిణి | ... | 0 | 6 | 0 |
| | డిటో సరస్వతీచందాదారులకు | ... | 0 | 4 | 0 |
| 12. | విజయవిలాసము | ... | 0 | 6 | 0 |
| 13. | కాటన్‌గారిచరిత్రము | ... | 0 | 1 | 0 |
| 14. | మాతృపటము (ఇంగ్లీషులో) | ... | 0 | 1 | 0 |
| 15. | నన్నయభట్టారకచారిత్రము | ... | 0 | 8 | 0 |
| 16. | నిరంకుశోపాఖ్యానము ... | .... | 0 | 6 | 0 |
| 17. | హరివిలాసము ... | ... | 0 | 8 | 0 |
| 18. | బాలరామాయణము (ప్రథమభాగము) | ... | 0 | 8 | 0 |
| 19. | సౌందర్యతిలక, (నోవలు రెండుభాగములుకలది) | ... | 0 | 14 | 0 |
| 20. | శ్రీమత్పరమహంసరామకృష్ణులు | ... | 0 | 5 | 0 |
| 21. | కేయూరబాహుచరిత్రము | ... | 0 | 6 | 0 |
| 22. | సంస్కృతనాటకకథాసారము | ... | 0 | 12 | 0 |
| 23. | హాలింగ్రాయి | ... | 0 | 10 | 0 |
| 24. | రాజతరంగిణి (ప్రథమభాగము) | ... | 0 | 8 | 0 |
| 25. | బుద్ధచరిత్రము | ... | 0 | 10 | 0 |
| 26. | శ్రీశివాజీచరిత్రము | ... | 0 | 10 | 0 |

గ్రంథములు కోరువారు సరస్వతీమేనేజరుగారికి కార్డువ్రాసి వి. పి. గానైనను సొమ్ముపంపినయెడను తెప్పించుకొనవచ్చును.